

www.prajapaksham.in

ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

దోషులకు బెయిల్‌పై కోర్టు కెళతా: బిల్కిస్ బానో

వంతెన పైనుంచి లోయలోకి దూసుకెళ్లిన బస్సు

బిజెపి, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల నిండా విషమే

07

సంపుటి 09, సంచిక: 347 | బుధవారం | 18-11-2026 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00



కోటి కుటుంబాలకు 'ఇందిరమ్మ బీమా'

12 లో

- అన్ని ప్రభుత్వ బీమా పథకాలు ఒకే గొడుగు కిందకు
- 19న సిద్దిపేట సభలో దరఖాస్తు ప్రారంభం



ఆర్టిసిని వెంటనే ప్రభుత్వంలో విలీనం

3 లో


- ఆర్టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్
- కరీంనగర్ జోనల్ మహాసభ విజయవంతం



బహ్రెయిన్‌లో అమెరికా రాడార్ వ్యవస్థ ధ్వంసం

8 లో

ఐఆర్‌జిసి ప్రకటన : ట్రంప్ హెచ్చరిక



మణుగూరులో భూ ప్రకంపనలు

- నాలుగు సార్లు కంపించిన భూమి
- బ్రాడ్‌బ్యాండ్, టెలిఫోన్ సేవలకు అంతరాయం

ప్రజాపక్షం/మణుగూరు

భద్రాది కొత్తగూడెం జిల్లా మణుగూరులో మంగళవారం భూప్రకంపనలు వచ్చాయి. దీంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ఒకటి కాదు, రెండు కాదు.. ఒకే రోజు సుమారు నాలుగుసార్లు భూమి కంపించినట్లు వివిధ ప్రాంతాల ప్రజలు చెబుతుండటంతో మణుగూరు పరిసర ప్రాంతాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఉదయం సుమారు 11:28 గంటల సమయంలో మలపల్లి ఓపెన్‌కాస్ట్ ప్రాంతంలో భూమి కంపించినట్లు సమాచారం అందింది. అనంతరం ఉదయం 11:40 గంటల సమయంలో శివలింగాపురంలో మూడు సార్లు దడదడమనే శబ్దాలు తరువాయి 8లో

సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసి ఇవ్వండి

ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రికి సిఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి

సానుకూలంగా స్పందించిన విష్ణుదేవ్ సాయిని

- ఎల్ నినో పరిస్థితుల వల్ల తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని వివరణ
- ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతులకూ సహకరించాలని వినతి

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో /హైదరాబాద్

తెలంగాణలోని ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద నిర్మించిన సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఎన్ఓసి జారీ చేయాలని తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి విష్ణుదేవ్ సాయిని కోరారు. ఎల్ నినో పరిస్థితుల వల్ల తెలంగాణలో నీటి అవసరాలు పెరిగే అవకాశం ఉందని సిఎం వివరించారు. సమ్మక్క సాగర్ బ్యారేజీలో నీటిని నిల్వ చేసుకునేందుకు అనుమతి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన మిగిలిన అనుమతులకూ సహకరించాలని కోరారు. తెలంగాణ సిఎం విజ్ఞప్తిపై ఛత్తీస్‌గఢ్ సిఎం సానుకూలంగా స్పందించారని, ఎన్ఒసి ప్రక్రియను త్వరగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారని తెలంగాణ సిఎం కార్యాలయం తెలియజేసింది. ఛత్తీస్‌గఢ్ సిఎం విష్ణుదేవ్ సాయితో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి, నీటిపారుదల శాఖ తరువాయి 8లో



భారత్‌కు క్వాడ్ విశ్వసనీయ భాగస్వామి

- ఇండో-పసిఫిక్‌లో శాంతి, స్థిరత్వంపైనే కూటమి దృష్టి
- మనీలా సమావేశంలో ప్రధానమంత్రి మోదీ వెల్లడి
- మోదీ నా మిత్రుడు,గౌరవనీయుడు : ట్రంప్

మనీలా: భారత్‌కు క్వాడ్(నాలుగు దేశాల వ్యూహాత్మక కూటమి) విశ్వసనీయ,నిర్మాణాత్మక భాగస్వామి అని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చెప్పారు. భారత్, అమెరికా,జపాన్,ఆస్ట్రేలియాదేశాలతో కూడిన ఈ కూటమి సమావేశం రెండు సంవత్సరాల విరామం తర్వాత ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో మంగళవారం జరిగింది.డోనాల్డ్ ట్రంప్‌తోపాటు ఆంథోనీ ఆల్బెనీస్(ఆస్ట్రేలియా ప్రధానమంత్రి),సనే తకైచీ(జపాన్ ప్రధానమంత్రి) తరువాయి 8లో



జిఎస్‌టి నంబర్ దుర్వినియోగం!

- రూ.100 కోట్ల అక్రమ లావాదేవీలు
- రూ.15 కోట్ల ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ క్లెయిమ్
- పోలీసులకు అంబటి రిసోర్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఫిర్యాదు

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్

ఒక ప్రైవేటు ఐటి సేవల సంస్థకు చెందిన జిఎస్‌టి గుర్తింపు సంఖ్యను దుండగులు దుర్వినియోగం చేసి సుమారు రూ. 100 కోట్ల విలువైన అక్రమ లావాదేవీలు నిర్వహించినట్లు ఆరోపణలు వెలుగులోకి వచ్చాయి. సంస్థకు ఎలాంటి సమాచారం లేకుండా, అనుమతి పొందకుండా 2025 అక్టోబర్ నుంచి 2026 అక్టోబర్ వరకు జిఎస్‌టి రిటర్నులు దాఖలు చేసినట్లు ప్రాథమికంగా గుర్తించారు. ఈ లావాదేవీల ద్వారా సుమారు రూ.15 కోట్ల తరువాయి 12లో

నిర్మాణ సంస్థలకు రెరా జరిమానా



నిబంధనలు ఉల్లంఘించడంపై ప్రభుత్వం సీరియస్

- సనాలి ఐటి పార్క్‌కు రూ.25 లక్షల జరిమానా : 30 రోజుల్లోగా చెల్లించాలని ఆదేశం
- అనుమతులు లేని ప్రాజెక్టుల విక్రయాలపై తక్షణ నిషేధం
- కొనుగోలుదారులకు వడ్డీతో సహా నగదు వాపస్
- ఫ్లాట్ల అప్పగింతకు ఆదేశాలు

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్

రియల్ ఎస్టేట్ నిబంధనలను ఉల్లంఘిస్తూ కొనుగోలుదారులను ఇబ్బందులకు గురిచేస్తున్న పలు నిర్మాణ సంస్థల పై తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టిజి రెరా) కొరడా ఝుళిపించింది. రియల్ ఎస్టేట్ రంగంలో వినియోగదారుల హక్కులను కాలరాస్తున్న, నిబంధనలను ఉల్లంఘిస్తున్న నిర్మాణ సంస్థలపై రెరా చర్యలు చేపట్టింది. ప్రాజెక్టుల నిర్మాణంలో జాప్యం, అనుమతులు లేకపోవడం, కొనుగోలుదారులు చెల్లించిన సొమ్మును తిరిగి చెల్లించడంలో విఫలమవడం వంటి వివిధ ఫిర్యాదులపై తాజాగా రెరా కీలక ఆదేశాలు జారీ చేసింది. రెరా చట్టం, 2016 నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఎనిమిది ప్రముఖ నిర్మాణ సంస్థలకు భారీ జరిమానాలు, వడ్డీతో కూడిన నగదు వాపసు, తక్షణ ఫ్లాట్ల అప్పగింతకు సంబంధించి కీలక ఆదేశాలు జారీ చేసింది. రెరా చట్టంలోని సెక్షన్లు 3, 4 నిబంధనలను ఉల్లంఘించినందుకు 'సనాలి ఐటీ పార్క్స్ సంస్థకు అథారిటీ రూ.25 లక్షల భారీ జరిమానా విధించింది. ఈ మొత్తాన్ని 30 రోజుల్లోగా చెల్లించాలని స్పష్టం చేసింది. మంచిరేవులలోని రెరా నమోదు లేని 'సనాలి ది ఎడ్జ్' ప్రాజెక్టుకు సంబంధించి అన్ని రకాల ప్రకటనలు, ప్రచారం, బుకింగ్‌లు, విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని, రెరా అనుమతి పొందే వరకూ ఎటువంటి విక్రయ కార్యకలాపాలు చేపట్టరాదని తేల్చిచెప్పింది. నిర్మాణ జాప్యంపై నగదు వాపసు, వడ్డీ చెల్లింపు ఆదేశాలు కొనుగోలుదారుల నుంచి భారీగా నగదు వసూలు చేసి, సకాలంలో నిర్మాణాలు పూర్తి చేయని, హామీలను నెరవేర్చని సంస్థలపై రెరా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అవసరమైన చట్టబద్ధమైన అనుమతులు పొందకుండా, నిర్మాణ పనులు ప్రారంభించకుండా కొనుగోలుదారు నుంచి భారీగా నగదు వసూలు చేసినందుకు, రూ.41.85 లక్షలను వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశించింది. తాము జారీ చేసిన ఈ ఆదేశాలను నిర్దేశిత గడువులోగా తరువాయి 8లో

ప్రెసిషన్ ఇంజినీరింగ్‌కు హైదరాబాద్ చిరునామా

- ఏరోస్పేస్, రక్షణ రంగాల్లో పెట్టుబడులకు ప్రత్యేక కార్యాచరణ
- విమాన విడిభాగాల తయారీకి అవసరమైన అధునాతన టూలింగ్ ఇక స్థానికంగానే
- జెఇహెచ్ ఏరోస్పేస్ టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించిన మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం / కొత్తూరు (రంగారెడ్డి)

ప్రపంచ ఏరోస్పేస్ పరిశ్రమకు అవసరమైన అధునాతన విడిభాగాలు, ప్రత్యేక పరికరాలు, ప్రెసిషన్ టూలింగ్ తయారీలో హైదరాబాద్‌ను అంతర్జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోందని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. విమానాలు, విమాన ఇంజిన్ల తయారీ, అసెంబ్లీ, మరమ్మతులు, నిర్వహణకు అవసరమైన అత్యాధునిక టూల్స్, ఫిక్చర్లు, గేజ్‌లను స్థానికంగానే తయారు చేసే సామర్థ్యాన్ని అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. దీనివల్ల విదేశీ సంస్థలు, పరిమిత సంఖ్యలో ఉన్న సరఫరాదారులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గడంతో పాటు తెలంగాణ పారిశ్రామిక రంగానికి కొత్త తరువాయి 12లో



ఒపిఎస్ పునరుద్ధరించండి

- రాష్ట్ర వ్యాప్తంగా టిఎస్‌సిపిఎస్ ఇయు నిరసన కార్యక్రమాలు
- సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్

ప్రజాపక్షం , న్యూస్‌బ్యూరో/హైదరాబాద్

కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్) విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని (ఒపిఎస్) పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ స్టేట్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ యూనియన్ (టిఎస్‌సిపిఎస్ ఇయు)' ఆధ్వర్యంలో మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యోగులు నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. ఉద్యోగులు సామూహికంగా సెలవు పెట్టి హైదరాబాద్‌తో పాటు 32 జిల్లా కేంద్రాల్లో ధర్మదీక్షలు నిర్వహించారు. సిపిఎస్ సమీక్ష కోసం ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న అధికారిక అధ్యయన/సమీక్ష కమిటీలో అధ్యయన కమిటీలో, రాష్ట్ర స్థాయి ఉద్యోగుల ఆరోగ్య పథకం (ఇహెచ్ఎస్) కమిటీలో కూడా టిఎస్‌సిపిఎస్ ఇయు ప్రతినిధులకు తప్పనిసరిగా ప్రాతినిధ్యం కల్పించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాల్సిన పెండింగ్ డిఎబకాయిలను తక్షణమే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని (టిఎస్‌సిపిఎస్ ఇయు) డిమాండ్ చేసింది. ఈ సందర్భంగా టిఎస్‌సిపిఎస్ ఇయు రాష్ట్ర అధ్యక్షులు జి. స్థిత ప్రజ్ఞ మాట్లాడుతూ 2023, ఆగస్టు 12న పాత పెన్షన్ సాధన సంకల్ప సభలో 'ఓట్ ఫర్ ఒపిఎస్'అని పిలుపునిచ్చామన్నారు. నాడు పిసిసి అధ్యక్షునిగా రేవంత్ రెడ్డి వరంగల్ సభలో సిపిఎస్‌ను రద్దు చేసి తరువాయి 8లో

సంక్షేమం, ఆత్మగౌరవం... పేదల మనుగడే ముఖ్యం

- గత బిఆర్ఎస్ పదేళ్ల నిర్లక్ష్యానికి ప్రజాపాలనే సమాధానం
- కార్మిక, గనుల, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి వ్యాఖ్య
- మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలో లబ్ధిదారులకు చేయూత పింఛన్ పత్రాల పంపిణీ



ప్రజాపక్షం / మందమర్రి

గత పదేళ్ల నిర్లక్ష్యానికి ప్రజాపాలన ప్రభుత్వం సమాధానం చెబుతోందని, పేదల సంక్షేమం, ఆత్మగౌరవంతో కూడిన జీవనమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక, గనుల, ఉపాధి శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి అన్నారు. మంగళవారం మంచిర్యాల జిల్లా మందమర్రి మండలం గద్దెరాగడిలోని ఎన్విఆర్ గార్డెన్‌లో క్యాతనపల్లి, మందమర్రి మున్సిపాలిటీలు, మందమర్రి మండల లబ్ధిదారులకు చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి వివేక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ పాలనలో పేదలకు రేషన్ కార్డులు, పెన్షన్లు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4 లక్షలకు పైగా కొత్త పెన్షన్లు అందిస్తోందని తెలిపారు. పార్టీలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు, గృహజ్యోతి పథకాలు అమలు చేస్తున్నామన్నారు. 20 లక్షల మంది విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్ అందిస్తున్నామని, దీపావళి నాటికి రెండు లక్షల ఇందిరమ్మ ఇళ్లు తరువాయి 12లో



09

ప్లేయర్‌గా ధోనీ గుడ్‌బై

మెంటార్‌గా బాధ్యతలు

టీమ్‌ఇండియా మాజీ కెప్టెన్ మహేంద్రసింగ్ ధోనీ అభిమానులకు బాధ కలిగించే వార్తే. ఎన్నో ఏళ్లుగా ఎల్లో కలర్ జెర్సీలో మైదానంలో కనిపించిన ధోనీ, ఇకపై ఐపిఎల్‌లో ఆటగాడిగా కనిపించడు. ప్లేయర్‌గా తన జర్నీకి ముగింపు పలుకుతూ కొత్త బాధ్యతలు చేపట్టనున్నాడు. 2027 సీజన్ నుంచి చెన్నై సూపర్ కింగ్స్ జట్టుకు టీమ్ మెంటార్‌గా వ్యవహరించనున్నాడు. దీంతో దాదాపు రెండు దశాబ్దాలుగా కొనసాగిన ధోనీ ప్లేయింగ్ కెరీర్‌కు తెరపడినట్లయింది.

చాలీచాలని ఆదాయంలో పేదరికం ఛాయలు

తమ పాలనాకాలంలో 50కోట్లమందిని దుర్భర దారిద్ర్యం నుంచి పైకి తెచ్చినట్లు ప్రపంచబ్యాంక్ కితాబిచ్చిందని బిజెపి పాలకులు చంకలు చరుచుకుంటున్నారు. అయితే 80కోట్లమందికి ఉచిత ఆహారధాన్యాల పంపిణీ ఎందుకు అని ప్రశ్నించే వారికి ప్రభుత్వం నుంచి సమాధానం లభించదు. విద్యావంతుల్లో నిరుద్యోగం పెరుగుతుందన్నది నిరాకరించలేని వాస్తవం. ప్రభుత్వ విద్యనుంచి లబ్ధిపొంది పట్టభద్రులైన పేద కుటుంబాల విద్యార్థులూ వారిలో ఉన్నారు. తాజా వారపు ప్రతిపత్తి (సిడబ్ల్యుస్) ప్రకారం నిరుద్యోగిత రేటు 2026 సెప్టెంబర్‌లోని 5శాతం నుంచి అక్టోబర్‌లో స్వల్పంగా – 4.9 శాతానికి తగ్గింది. అందులో పట్టణాల్లో నిరుద్యోగిత హెచ్చుస్థాయిలో 6.7 శాతంగా ఉంది. కాగా గ్రామీణ నిరుద్యోగిత గత మూడు మాసాలుగా – ఆగస్టు నుంచి 4.2 శాతం వద్ద స్థిరంగా ఉంది. పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే(ఎ.ఎల్.ఎఫ్.ఎస్) 2026 అక్టోబర్ డేటాను 2025 నవంబర్‌తో పోల్చితే కొంత ప్రోత్సాహకరంగా ఉంది. అయితే 2026 ఆగస్టు నుంచి గ్రామీణ నిరుద్యోగిత రేటులో మార్పు లేదు. ఆగస్టు అనంతరకాలం వ్యవసాయ తరుణం, పండుగల సీజన్ కూడా. ఈ కాలంలో ఉపాధి కల్పన పెరగకపోవటం ఆందోళనకరం. గ్రామీణ యువతలో (15–29 సం.మధ్య వయస్కులు) నిరుద్యోగిత గత మూడు మాసాలుగా 12.7శాతం వద్ద నిలబడి ఉంది. పట్టణాల్లో నిరుద్యోగిత రేటు 0.2శాతం తగ్గినా 6.7శాతంగా హెచ్చుస్థాయిలోనే ఉంది. అదే పట్టణ యువతలో అది అక్టోబర్‌లో భారీగా 18.3శాతంగా ఉంది. పట్టణ యువమహిళల నిరుద్యోగిత రేటు గత రెండు మాసాల్లో 26.6శాతం నుంచి 25.1శాతానికి తగ్గింది. యువకుల్లో 16.4 నుంచి 15.9శాతానికి తగ్గినా ఇది ఎంతో ఆందోళన కలిగించే హెచ్చుస్థాయి.

భారతదేశంలో కార్మికుల ఉపాధి స్థితిపై తాజా ప్రభుత్వ డేటా ప్రకారం రెగ్యులర్ జీతంతో కూడిన ఉద్యోగాలు, అలాగే క్యాజువల్ ఉద్యోగాల (నిర్ణీతకాల ఉద్యోగాలు) లభ్యత తగ్గుతున్నది. దాంతో కార్మికులు స్వల్పాదాయ స్వయం ఉపాధి వైపు నెట్టబడుతున్నారు. అయితే వారి ఆదాయార్జన దారిద్ర్య రేఖకు దిగువనే ఉంటున్నది. ఏది దారిద్ర్య రేఖ? తక్కువ, మధ్యస్థాయి ఆదాయ దేశాలకు (వాటిలో భారత్ ఉంది) కొనుగోలు శక్తి సరిసమానత ప్రాతిపదికపై 2021లో ప్రపంచ బ్యాంక్ నిర్ణయించిన దారిద్ర్యరేఖ రోజు ఆదాయం 4.20 డాలర్లు. ఐదేళ్ల తర్వాత, ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం లెక్కలోకి తీసుకుంటే ఇది ఒక వ్యక్తికి నెలవారీ ఆదాయం రూ.3300 నుంచి రూ.3450అవుతుంది. ఐదుగురు సభ్యుల కుటుంబానికి నెలసరి దారిద్ర్యరేఖ రూ.16,500 నుంచి రూ.17,250అవుతుంది. భారతదేశంలో ఎఎల్ఎఫ్ఎస్, ఆర్థిక సర్వేల ప్రకారం స్వయం ఉపాధి కార్మికుల్లో 75–80శాతం మంది ఆదాయార్జన రూ.12,000 నుంచి రూ.15,000 ఉంది. ఇది 2026లో అంచనా వేస్తున్న దారిద్ర్య రేఖ కన్నా తక్కువ. 2021 రేఖ ప్రకారం దారిద్ర్యం అధిగమించామని గొప్పలు చెప్పుకోవచ్చు. కాని 2026రేఖ ప్రకారం దారిద్ర్యం, పాక్షిక దారిద్ర్యం హెచ్చుస్థాయిలోనే కొనసాగుతున్నాయి. దానికి జీవిత వాస్తవ ధృవీకరణ ఉచిత ఆహార ధాన్యాల పథకం. మోదీ ప్రభుత్వం, అంతకుముందు 2013లో యుపిఎ ప్రభుత్వం ఆమోదించిన 'జాతీయ ఆహార భద్రత చట్టం' క్రింద కోవిడ్ మహమ్మారి కాలంలో (ఏప్రిల్ 2020 – డిసెంబర్ 2022) తాత్కాలిక ఉపశమనంగా ఉచిత ఆహార ధాన్యం(బియ్యం లేదా గోధుమలు) పథకం (ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్నయోజన) ప్రారంభించింది. తదుపరి అంచెలంచెలుగా పొడిగిస్తూ డిసెంబర్ 2022లో ఆహార సబ్సిడీ పథకాలన్నిటినీ గరీబ్ కల్యాణ్ అన్న యోజన కిందకు తెచ్చింది. ప్రస్తుత పొడిగింపు 2028 డిసెంబర్ వరకు అమలులో ఉంటుంది. పేదలకు నెలకు 5 కిలోలు, అంత్యోదయ అన్నయోజన (పేదల్లో కెల్లా పేదలు) కింద కుటుంబానికి నెలకు 35కిలోలు ఉచితంగా సరఫరా చేస్తున్నది.

దారిద్ర్యరేఖ నేపథ్యంగా క్యాజువల్ లేబర్ ఆదాయాన్ని చూచినట్లయితే, జాతీయ సగటు దినసరి వేతనం రూ.453 ప్రకారం, వారు నెలకు రూ.12,750 నుంచి రూ. 13 వేలు సంపాదిస్తారు. అదీ నెలరోజులు పూర్తిగా పనిదొరికితేనే. అంటే వారి నెలవారీ ఆదాయం 2026లో దారిద్ర్య రేఖ అంచనా (రూ.16,500 నుంచి రూ.17,250) కన్నా తక్కువగా ఉంది.

అందువల్ల పిఎల్ఎఫ్ఎస్ త్రైమాసిక డేటాను (2026 జులై–సెప్టెంబర్) సీరియస్‌గా తీసుకోవాలి. ఆ డేటా ప్రకారం క్యాజువల్ లేబర్ ఏప్రిల్–జూన్ త్రైమాసికంలో 19 నుంచి 18.4శాతానికి తగ్గారు. కాగా రెగ్యులర్ వేతన కార్మికులు 26.2 నుంచి 25.8 శాతానికి తగ్గారు. స్వయం ఉపాధిపరులు 54.8 నుంచి 55.8శాతానికి పెరిగారు. స్వయం ఉపాధిపరుల్లో కూడా 40.9 శాతమే స్వయానా వర్కర్ లేదా యజమాని. కాగా స్వయం ఉపాధిలోపల పనిచేసే వేతనం తీసుకోని కుటుంబ సభ్యులు ఆ రెండు త్రైమాసికాల మధ్యకాలంలో 13 నుంచి 14.2 శాతానికి పెరగటం ఆందోళనకరం. స్వయం ఉపాధిపరులైన మహిళల సంఖ్య ఈ కాలంలో 64 నుంచి 64.9శాతానికి పెరిగారు.

ఏ రకంగా చూసినా, పెరుగుతున్న ధరవరలు దారిద్ర్యభారాన్ని, దారిద్ర్య రేఖ కింద ఉన్న జనాభా సంఖ్యను పెంచుతున్నాయి. ఒక్క అక్టోబర్‌లోనే టోకు ధరలు గరిష్టంగా 12.9 శాతం పెరుగుదలతో కుటుంబాలు తల్లడిల్లుతున్నాయి. రానున్న ఎల్ నినో తమ కుటుంబాల్లో ఏ భారం తెచ్చిపెడుతుందోనని ఆందోళన చెందుతున్నారు. కేంద్ర ప్రభుత్వం తక్షణం రంగంలోకి దిగాలి. రాష్ట్రప్రభుత్వాలను ఆదుకోవాలి. అంతర్జాతీయంగా క్రూడ్ రేటు తగ్గినందున, ఆ తగ్గుదలను వినియోగదారులకు అందించి ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి. ఎల్ నినో దృష్ట్యా స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలపై దృష్టిపెట్టాలి.



ద్వేషం కాదు ప్రేమే ప్రధానం

'ద్వేషాన్ని పంచడం సులభం, కానీ ప్రేమను పంచడం కష్టం.' ప్రస్తుత సమాజంలో బహిరంగ చర్చలన్నీ ద్వేషం, ఆగ్రహం, చేదు అనుభవాలతో నిండిపోతున్నాయి. ఇలాంటి సమయంలో, ప్రేమ, అనురాగం, మానవ సంబంధాల గురించి మనం మరింత ఎక్కువగా మాట్లాడుకోవాల్సిన అవసరం ఉంది. రాహుల్ గాంధీ తన తల్లిదండ్రుల మధ్య ఉన్న ప్రేమ గురించి మాట్లాడేందుకు పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని ఎంచుకోవడం సరైనదేనా కాదా అనే దానిపై చర్చించవచ్చు. అది వేరే విషయం. కానీ, ఏ సందర్భంలోనైనా సరే, ద్వేషం కాదు ప్రేమకే నా మొదటి ప్రాధాన్యత!

- రాజ్‌దీప్ సర్దేశాయి, సీనియర్ జర్నలిస్ట్




మున్సిపల్ ఎన్నికల్లో సత్తా చాటిన దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ

- స్వతంత్రంగా పోటీ చేసిన తొలిసారే 271 స్థానాలలో గెలుపు
- పలు చోట్ల కౌన్సిల్ ఏర్పాట్లు ఎస్ఎసిపి కౌన్సిలర్లే కీలకం

దక్షిణాఫ్రికాలో నవంబర్ 4న జరిగిన స్థానిక ఎన్నికలలో దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ (ఎస్ఎసిపి) 271 మున్సిపల్ కౌన్సిల్ స్థానాలను, జాతీయ ఓట్లలో సుమారు 2.4% గెలుచుకుంది. వర్ణవివక్ష ముగిసిన తర్వాత ఎస్ఎసిపి తొలిసారిగా సొంత పతాకంపై పోటీ చేసింది. స్థానిక ప్రభుత్వంలో శ్రామిక వర్గ ఓటర్లు వామపక్ష ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నట్లుగా ఈ ఫలితం రుజువుచేస్తోందని ఆ పార్టీ నాయకులు చెబుతున్నారు. అలాగే, ఆఫ్రికన్ నేషనల్ కాంగ్రెస్ (ఎన్ఎన్సి)తో ఎస్ఎసిపికి దశాబ్దాలుగా కొనసాగిన భాగస్వామ్యం ముగిసిపోయినట్లు కాదని వారు నొక్కి చెబుతున్నారు.

ఎస్ఎసిపి జాతీయ స్థాయిలో ఎనిమిదవ స్థానంలో నిలిచింది. మెరుగైన నిధులు కలిగిన అనేక పార్టీలను అధిగమించింది. దేశంలోని తొమ్మిది ప్రావిన్సులు అన్నింటిలోనూ ఎస్ఎసిపి స్థానాలను గెలుచుకుంది. ఈస్టర్న్ కేప్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచింది. అక్కడ 6.2% ఓట్లతో మూడో స్థానంలో నిలిచి 89 స్థానాలను కైవసం చేసుకుంది. లింపోపోలో 45, మ్పుమలంగలో 26, నార్త్



వెస్ట్‌లో 20 స్థానాలతో మంచి ఫలితాలు నమోదయ్యాయి. పార్టీ ప్రధాన కార్యదర్శి సోలీ మపైలా మాట్లాడుతూ అతి తక్కువ బడ్జెట్‌తో క్షేత్రస్థాయిలో నిర్వహించిన కృషిని ప్రశంసించారు. 1950 లో వర్ణవివక్షకు సంబంధించిన 'కమ్యూనిజం అణచివేత చట్టం' దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీని నిషేధించినప్పటి నుంచి, అంటే 76 సంవత్సరాలుగా పార్టీ ఎన్నికల ప్రస్థానం నిలిచిపోయిందని ఆయన తెలిపారు.

120కి పైగా మున్సిపల్ కౌన్సిళ్లలో జరిగిన ఎన్నికలలో ఏ పార్టీకీ మెజారిటీ లభించనందున, విధానాలను రూపొందించే ప్రక్రియలో కమ్యూనిస్టుల కొత్త కౌన్సిలర్లు కీలక పాత్ర పోషించే అవకాశం ఉంది. ఒక విశ్లేషణ ప్రకారం, 18 మున్సిపాలిటీలలో ఎఎన్‌సికి అవసరమైన మెజారిటీని అందించేందుకు సరిపడా సీట్లు ఎస్ఎసిపి వద్ద ఉన్నాయని తేలింది. ఎఎన్‌సి నుండి స్వతంత్రంగా పోటీ చేయాలనే నిర్ణయాన్ని 2022లో జరిగిన దక్షిణాఫ్రికా కమ్యూనిస్టు పార్టీ 15వ జాతీయ మహాసభలో ఆమోదించారు. 2024 డిసెంబర్‌లో జరిగిన ప్రత్యేక మహాసభలో దానిని పునరుద్ఘాటించారు. కానీ పార్టీలోని ఈ చర్చ రెండు దశాబ్దాలకు పైగా కొనసాగుతోంది. ఎఎన్‌సికి జాతీయ మద్దతు రికార్డు స్థాయిలో సుమారు 31 శాతానికి పడిపోవడాన్ని ఆ పార్టీ సెక్రటరీ జనరల్ ఫికిలే మ్బలులా 'పెను వైఫల్యం' అని అభివర్ణించారు. కొంతమంది దీర్ఘకాల మద్దతుదారులు ఇతర పార్టీలలోకి వెళ్లిపోగా, మరికొందరు నామమాత్రంగా పార్టీలోనే ఉండిపోయారని ఆయన అంగీకరించారు. ఇప్పుడు సంకీర్ణ బేరసారాల సమయం ఆసన్నమైంది. చర్చల చట్రాన్ని ఖరారు చేయడానికి ఎస్ఎసిపి రాజకీయ విభాగం సోమవారం సమావేశమైంది. 'ఏ ఒక్క పార్టీకి గుడ్డిగా మద్దతు ఇవ్వడం లేదు,' అని మపైలా అన్నారు. విశ్వసనీయమైన సేవలు, కమ్యూనిటీలకు ప్రత్యక్ష బడ్జెట్ కేటాయింపులు అనేవి రాజీపడలేని అంశాలని ఆయన పేర్కొన్నారు. ఎఎన్‌సి తన గత నయా ఉదారవాద ఆర్థిక విధానాలను పునఃసమీక్షించుకుంటే, ఆ పార్టీతో కలిసి పనిచేయడానికి తమ పార్టీ సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు. తమ మద్దతుతో ఏ మున్సిపల్ కౌన్సిల్ అయితే ఏర్పడుతోందో, అక్కడ ఎఎన్‌సి, డిఏ లేదా మరే ఇతర పార్టీ మాదిరిగానే తమను కూడా స్వచ్ఛమైన నీరు, పనిచేసే లైట్లు, నిజాయితీతో కూడిన ఒప్పందాలు, తమను ఎన్నుకున్న ప్రజలకు జవాబుదారీగా ఉండే కౌన్సిలర్లను అందిస్తుందా లేదా అనే దాని ఆధారంగానే అంచనా వేయాలని ఎస్ఎసిపి కోరుతోంది.

భారతదేశపు మెగా రవాణా కేంద్రంగా హైదరాబాద్!



డా।। ఎం.సురేష్ బాబు

హైదరాబాద్ దేశంలోనే అత్యంత కీలకమైన మెగా రవాణా కేంద్రంగా ఎదిగే దిశగా అడుగులు వేస్తోంది. హైస్పీడ్ రైలు కారిడార్లు, మెట్రో విస్తరణ, ఆధునిక రైల్వే స్టేషన్లు, కొత్త జాతీయ రహదారులు, విమానాశ్రయ అనుసంధానం వంటి భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు నగర ఆర్థిక వ్యవస్థను, రవాణా వ్యవస్థను, జాతీయ ప్రాధాన్యతను కొత్త స్థాయికి తీసుకెళ్లే అవకాశాలు కల్పిస్తున్నాయి. అయితే ఈ మెగా ప్రాజెక్టులపై ఆశలు, అంచనాలు పెరుగుతున్న తరుణంలో ఒక కీలకమైన ప్రశ్నను కూడా సంధించుకోవాలి. ఈ మౌలిక సదుపాయాల విప్లవం సామాన్య పౌరుడి నిత్యజీవితాన్ని ఎంతవరకు మెరుగుపరచగలదు?

బుల్లెట్ రైళ్లు, అద్దాల భవనాలతో కూడిన రైల్వే స్టేషన్లు, బహుళ అంతస్తుల ఫ్లైఓవర్లు ఉన్నంత మాత్రాన ఒక నగరం ప్రపంచస్థాయి నగరంగా మారదు. ఒక కార్మికుడు సమయానికి తన పనిస్థలానికి చేరుకోగలగాలి. విద్యార్థులు సురక్షితంగా, తక్కువ ఖర్చుతో ప్రయాణించగలగాలి. వృద్ధులు, దివ్యాంగులు ప్రజా రవాణా వ్యవస్థను సులభంగా వినియోగించుకోగలగాలి. కుటుంబాలు తమ ఆదాయంలో గణనీయమైన భాగాన్ని ప్రయాణ ఖర్చులకే వెచ్చించాల్సిన పరిస్థితి ఉండకూడదు. అప్పుడే ఆ నగరం నిజమైన ఆధునిక నగరంగా గుర్తింపు పొందుతుంది.

హైదరాబాద్ హైస్పీడ్ రవాణా కేంద్రంగా ఎదగడం వల్ల అపారమైన ఆర్థిక అవకాశాలు అందుబాటులోకి రావచ్చు. ఇతర ప్రాంతాలతో వేగవంతమైన అనుసంధానం వ్యాపార కార్యకలాపాలను విస్తరించడంతోపాటు పెట్టుబడులను ఆకర్షించడానికి, పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడానికి, కొత్త ఉద్యోగ అవకాశాలను సృష్టించడానికి దోహదపడుతుంది. మెట్రో రైలు విస్తరణ, రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ, విమానాశ్రయానికి మెరుగైన అనుసంధానం హైదరాబాద్‌ను వ్యాపార, పారిశ్రామిక కేంద్రం గా మరింత బలోపేతం చేయగలవు. అయితే అభివృద్ధికి వేగం ఒక్కటే ప్రామాణికం కాకూడదు. ప్రయాణ సౌకర్యం ఎంత ముఖ్యమో, దాని ఖర్చు సామాన్యులకు అందుబాటులో ఉండటం కూడా అంతే ముఖ్యం.

హైస్పీడ్ రైళ్లు హైదరాబాద్‌ను దూర ప్రాంతాలతో అనుసంధానించవచ్చు. కానీ నగరంలోని లక్షలాది మంది ప్రజలకు మెట్రో, ఎంఎంటిఎస్, ఆర్‌టిసి బస్సులే నిత్యజీవితానికి ఆధారంగా ఉంటాయి. ఒక కార్పొరేట్ ఉద్యోగికి విమానాశ్రయ ఎక్స్‌ప్రెస్ రైలు ఉపయోగకరంగా ఉండవచ్చు. కానీ నగర శివారు ప్రాంతాల నుంచి ప్రయాణించే రోజువారీ కూలీకి అందుబాటు ధరలో బస్సు అవసరం. విద్యార్థులకు కళాశాలలు, విశ్వవిద్యాలయాలకు చేరుకునే నమ్మకమైన రవాణా సౌకర్యం కావాలి. వృద్ధులు, దివ్యాంగులకు సురక్షితమైన, అందుబాటులో ఉండే ప్రయాణ వ్యవస్థ అవసరం.

కాబట్టి హైదరాబాద్ రవాణా విప్లవ విజయాన్ని



కేవలం ఎన్ని కిలోమీటర్ల మేర మెట్రో మార్గాలు నిర్మించారనే దానితోనో, ఎన్ని ఫ్లైఓవర్లు అందుబాటులోకి వచ్చాయనే దానితోనో, భవిష్యత్తులో బుల్లెట్ రైలు ఎంత వేగంతో ప్రయాణిస్తుందనే దానితోనో కొలవకూడదు. అంతకంటే ముఖ్యమైన ప్రశ్న ఏమిటంటే – సామాన్య పౌరుడు ఈ రవాణా సౌకర్యాలను భరించగలిగే ధరల్లో వినియోగించుకోగలుగుతున్నాడా?

మరో ప్రధాన సమస్య చివరి మైలు అనుసంధానం (Last Mile Connectivity). ఆధునిక మెట్రో స్టేషన్లు, రైల్వే టెర్మినళ్లు ఆకర్షణీయంగా కనిపించినప్పటికీ ప్రయాణం స్టేషన్ దగ్గర ప్రారంభం కాదు, అక్కడితో ముగియదు కూడా. అనేక ప్రాంతాల్లో నివాసాల నుంచి మెట్రో స్టేషన్లకు చేరుకోవడమే ప్రయాణికులకు సమస్యగా మారుతోంది. సరైన ఫుట్‌పాత్‌లు లేకపోవడం, ఫీడర్ బస్సులు అందుబాటులో లేకపోవడం, ఆటోలు లేదా క్యాబ్‌లపై ఆధారపడటం వల్ల ప్రయాణ ఖర్చులు పెరుగుతున్నాయి.

నిజమైన సమీకృత రవాణా వ్యవస్థలో ప్రయాణికులు సురక్షితంగా నడుచుకుంటూ స్టేషన్లకు చేరుకునే మార్గాలు ఉండాలి. తక్కువ ఖర్చుతో ఫీడర్ రవాణా సౌకర్యాలు అందుబాటులో ఉండాలి. మెట్రో, ఎంఎంటిఎస్, బస్సులు, సాధారణ రైళ్ల మధ్య సులభంగా మారే అవకాశం కల్పించాలి. సైకిళ్లకు ప్రత్యేక మార్గాలు, పాదచారులకు అనుకూలమైన రహదారులు, సురక్షితమైన ప్రజా ప్రదేశాలు ఆధునిక నగరానికి విలాసాలు కాదు, అత్యవసర అవసరాలు.

ఒక రైలు అత్యంత వేగంతో ప్రయాణించినా, గమ్యస్థానానికి చేరుకున్న తర్వాత మరో రవాణా సాధనం కోసం ప్రయాణికుడు అరగంట వెతకాల్సి వస్తే, సమీకృత రవాణా వ్యవస్థ లక్ష్యం నెరవేరినట్లు కాదు.

భారీ మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు భూమి సేకరణ, జీవనోపాధి, నిర్వాసితుల సమస్యలను కూడా ముందుకు తెస్తాయి. కొత్త జాతీయ రహదారులు, రైల్వే కారిడార్లు, పట్టణ అభివృద్ధి ప్రాజెక్టులు భూముల విలువను పెంచి పెట్టుబడులను ఆకర్షించవచ్చు. అయితే అభివృద్ధి పేరుతో బలహీన వర్గాల ప్రజలు తమ నివాసాలను, జీవనాధారాలను కోల్పోయే పరిస్థితి రాకూడదు. పెద్ద ప్రాజెక్టుల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు తగిన పరిహారం, పునరావాసం, న్యాయమైన పరిష్కారాలు కల్పించాలి.

పర్యావరణ పరిరక్షణ కూడా హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధిలో కీలకమైన అంశంగా ఉండాలి. ఇప్పటికే నగరం నీటి కొరత, పట్టణ వరదలు, పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, పచ్చదనం తగ్గిపోవడం వంటి సమస్యలను ఎదుర్కొంటోంది. కొత్త రహదారులు, పారిశ్రామిక కారిడార్లు, పట్టణాలు నిర్మించే క్రమంలో చెరువులు, సహజ నీటి ప్రవాహ మార్గాలు, పచ్చని ప్రదేశాలు దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

మెట్రో రైలు, ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్లపై ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో బస్సులు, సబర్బన్ రైల్వే సేవలను నిర్లక్ష్యం చేయకూడదు. మెట్రో రైలు కొన్ని ప్రధాన మార్గాల్లో అధిక సామర్థ్యంతో ప్రయాణికులను చేరవేయగలదు. కానీ నగరంలోని ప్రతి కాలనీకి చేరుకునే సౌలభ్యం బస్సుల ద్వారానే సాధ్యమవుతుంది. హైదరాబాద్ విస్తరిస్తున్న శివారు ప్రాంతాలను అనుసంధానించడంలో ఎంఎంటిఎస్, సబర్బన్ రైళ్లు కీలక పాత్ర పోషించగలవు.

హైదరాబాద్ మౌలిక సదుపాయాల అభివృద్ధి లక్ష్యాలు అభినందించదగినవి. భారతదేశంలోని అత్యంత కీలకమైన రవాణా, ఆర్థిక కేంద్రాల్లో ఒకటిగా ఎదిగేందుకు నగరానికి చారిత్రక అవకాశం లభిస్తోంది. ప్రతిపాదిత హైస్పీడ్ రైలు కారిడార్లు, మెట్రో విస్తరణ, రైల్వే ఆధునికీకరణ, విమానాశ్రయ అనుసంధానం, రీజినల్ రింగ్ రోడ్డు వంటి ప్రాజెక్టులు హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాల భవిష్యత్తును కూడా మార్చగలవు.

హైదరాబాద్ నిస్సందేహంగా కొత్త రవాణా యుగంలోకి అడుగుపెడుతోంది. అయితే మన ముందున్న లక్ష్యం కేవలం వేగవంతమైన హైదరాబాద్ కావడం కాదు. సమాన అవకాశాలు కల్పించే, పచ్చదనాన్ని కాపాడే, సురక్షితమైన, అందరికీ అందుబాటులో ఉండే హైదరాబాద్ నిర్మాణం కావాలి.

విషవాయువుల చెరలో హోటల్ వంట కార్మికులు



మేకిరి దామోదర్
9573666650

కడుపు నింపే..అన్నం వండే చేతులే వేడికి, విషవాయువులకు బలవుతుంటే: ఆ కార్మికుల కన్నీళ్లను తుడిచేదెవరు?. నలుగురికి రుచికరమైన భోజనాన్ని అందించే హోటళ్లు, రెస్టారెంట్ల వంటశాలల్లో పనిచేసే కార్మికుల జీవితాలు మాత్రం పొగ, సెగ, ఉక్కపోత మధ్య ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఆహార పరిశ్రమలో పనిచేసే వీరికి కనీస ఆరోగ్య రక్షణ, సురక్షిత పని వాతావరణం, ఉద్యోగ భద్రత ఎంతవరకు అందుతున్నాయన్నది ప్రశ్నార్థకం.

మన దేశంలో కార్మికుల్లో అత్యధికులు అసంఘటిత రంగాల్లో పనిచేస్తున్నారు. వివిధ అంచనాల ప్రకారం, దేశంలోని మొత్తం కార్మికుల్లో సుమారు 90 శాతానికి పైగా ఈ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. వీరిలో హోటళ్లు, రెస్టారెంట్లు, చిన్నపాటి ఆహార విక్రయ కేంద్రా లు, నిర్మాణ రంగం, వ్యవసాయం, గృహ కార్మికులు తదితర తరగతులున్నారు. సంఘటిత రంగంలోని ఉద్యోగులకు కొంతమేరకు వేతన భద్రత, సెలవులు, ఆరోగ్య బీమా, పదవీ విరమణ ప్రయోజనాలు అందే అవకాశం ఉండగా, అసంఘటిత కార్మికుల్లో చాలామందికి అలాంటి సదుపాయాలు అందడం లేదు.

కార్మికుల హక్కుల కోసం ట్రేడ్ యూనియన్లు ఎన్నో పోరాటాలు చేసి చట్టబద్ధమైన ప్రయోజనాలను సాధించాయి. అయితే, అసంఘటిత కార్మికులకు అదే స్థాయి లో ప్రాతినిధ్యం, సంఘటిత శక్తి, న్యాయపరమైన అండ లభించడం లేదు. సమస్యలు ఎదురైనప్పుడు తమ గోడు ను ఎవరికి చెప్పుకోవాలో తెలియని పరిస్థితులు అనేక చోట్ల కనిపిస్తున్నాయి. కనీస వేతనం, నిర్ణీత పని గంట లు, వారాంతపు సెలవు, ఓవర్‌టైమ్ వేతనం, ప్రసూతి ప్రయోజనాలు, ప్రమాద బీమా వంటి హక్కులు అందరికీ అందాల్సి ఉన్నా, వాటి అమలులో లోపాలు ఆందోళన కలిగిస్తున్నా యి.

కార్మికుల సంక్షేమం కోసం రూపొందించిన విధానాలు ప్రకటనలకే పరిమితం కాకూడదు. కేంద్ర ప్రభుత్వం 44 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్లుగా సమీకరించింది. వీటి ద్వారా కార్మికులకు ప్రయోజనాలు కలుగుతాయని ప్రభు త్వం చెబుతున్నప్పటికీ, కార్మిక సంఘా లు ఉద్యోగ భద్రత, సమ్మె హక్కు, సామాజిక భద్రత, యాజమాన్యాల బాధ్యతల విషయంలో ఆందోళనలు వ్యక్తం చేస్తున్నాయి. కార్మికుల హక్కులు క్షీణించకుండా, మారుతున్న చట్టాల అమలులో వారి ప్రయోజనాలకు తగిన రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.



గ్యాస్ వంటశాలల్లో విషవాయువులు

నగరాలు, పట్టణాల్లోని హోటళ్లు, రెస్టారెంట్ల వంటశాలల్లో పనిచేసే కార్మికులు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలపై వెలువడిన తాజా అధ్యయనం ఆందోళనకరమైన అంశాలను వెలుగులోకి తెచ్చింది. గ్యాస్ ఆధారిత వంట పరికరాల నుంచి వెలువడే వేడి, వాయు కాలు ష్యం కార్మికుల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయని అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయి. తగిన వెంటిలేషన్, పొగను బయటకు పంపే వ్యవస్థలు ఉన్నచోట్ల కూడా కొన్ని వంటశాలల్లో ఉష్ణోగ్రతలు ప్రమాదకర స్థాయులకు చేరుతున్నట్లు పరిశోధకులు గుర్తించారు.

పిఎస్ఇ హెల్త్ ఎనర్జీ, స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం, ఎన్‌వైయు గ్రాస్‌మన్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ తదితర సంస్థల పరిశోధకులు వాణిజ్య వంటశాలల్లో ఉష్ణోగ్రతలు, గాలి నాణ్యతపై అధ్యయనాలు నిర్వహించారు. గ్యాస్ స్టవ్‌ల వినియోగం వల్ల నైట్రోజన్ డయాక్సైడ్ వంటి కాలుష్య కారకాలు గాలిలో పెరిగే ప్రమాదం ఉందని, కొన్ని పరిస్థితుల్లో బెంజీన్ వంటి హానికర పదార్థాల ఉనికి కూడా ఆందోళన కలిగిస్తుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ముఖ్యంగా తగిన గాలి ప్రసరణ లేని వంటశాలల్లో పనిచేసే సిబ్బందికి ఈ ముప్పు మరింత ఎక్కువగా ఉంటుంది.

అధ్యయనంలో పరిశీలించిన వంటశాలల్లో అనేక చోట్ల ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల సెల్సియస్‌ను దాటినట్లు, కొన్ని సందర్భాల్లో 37 డిగ్రీలకుపైగా నమోదైనట్లు నివేదికలు వెల్లడించాయి. మరికొన్ని చోట్ల ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలను దాటి, అత్యధికంగా 50 డిగ్రీలకు చేరినట్లు పేర్కొన్నాయి. వంటశాలల్లో మండే గ్యాస్ మంటలు, నిరంతర వంట ప్రక్రియ, వేడి గాలిని బయటకు పంపే వ్యవస్థల లోపాలు ఈ పరిస్థితులకు కారణమవుతున్నాయి. ఇటువంటి వాతావరణంలో గంటల తరబడి పనిచేయడం వల్ల శరీరంలో నీరు తగ్గిపోవడం, అలసట, తలతిరగడం, వేడి సంబంధిత అనారోగ్యాలు వచ్చే ప్రమాదం ఉంది.

నైట్రోజన్ డయాక్సైడ్ వంటి వాయు కాలుష్య కారకాలకు నిరంతరం గురికావడం వల్ల శ్వాసకోశ సమస్యలు, ఆస్తమా లక్షణాలు తీవ్రతరం కావచ్చు. దీర్ఘకాలికంగా కాలుష్యానికి గురికావడం ఆరోగ్యంపై మరింత ప్రభావం చూపే అవకాశం ఉంది. వంటశాలల్లో రద్దీ తక్కువగా ఉండే సమయాల్లోనూ కాలుష్యం అధికంగా ఉంటే, ఉదయం శుభ్రపరిచే సిబ్బంది, ముందస్తు తయారీ పనులు చేసే కార్మికులు కూడా ముప్పును ఎదుర్కొంటా రు.

ప్రభుత్వాలు హోటళ్లు, రెస్టారెంట్లలో కార్మిక చట్టాల అమలును పర్యవేక్షించాలి. వంటశాలల ఉష్ణోగ్రతలు, గాలి నాణ్యత, అగ్నిప్రమాద నివారణ ఏర్పాట్లు, విద్యుత్ పరికరాల భద్రతపై క్రమం తప్పకుండా తనిఖీలు నిర్వహించాలి. ఉల్లంఘనలకు పాల్పడే యాజమాన్యాలపై చట్టప్రకారం చర్య లు తీసుకోవాలి. అదే సమయంలో చిన్న వ్యాపార సంస్థలు సురక్షిత పరికరాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆర్థిక ప్రోత్సాహకాలు, సాంకేతిక సహాయం అందించాలి.

అసంఘటిత రంగ కార్మికులకు కనీస వేతనాలు, ఆరోగ్య బీమా, ప్రమాద బీమా, సామాజిక భద్రత, ఉద్యోగ భద్రత కల్పించే చర్యలను వేగవంతం చేయాలి. కార్మికుల నమోదు, సంక్షేమ పథకాలపై అవగాహన, ఫిర్యాదుల పరిష్కారానికి సులభమైన వ్యవస్థ

ఆర్‌టిసిని వెంటనే
ప్రభుత్వంలో విలీనం

ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్
కరీంనగర్ జోనల్ మహాసభ విజయవంతం



ప్రజాపక్షం/కరీంనగర్ : ఆర్‌టిసిని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలని, కార్మికుల పెండింగ్ సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్‌లో గణేశ్‌నగర్‌లోని ఎఐటియుసి కార్యాలయంలో జరిగిన కరీంనగర్ జోనల్ మహాసభ విజయవంతంగా జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.బాబు మాట్లాడుతూ ఆర్‌టిసిలో ఇటీవల జరిగిన గుర్తింపు సంఘాల ఎన్నికల్లో ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్‌కు ఘన విజయం అందించిన కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ముందుండి పోరాడుతుందని ఇటీవల యాజమాన్యం ఇచ్చిన కోడ్ ఆఫ్ డిసిప్లేన్ సర్కులర్‌ను వెంటనే ఉపసంహరించుకోని పాత పద్ధతిలో ఇవ్వాలని అన్నారు. లేనియెడల పోరాటం ఉధృతమవుతుందని హెచ్చరించారు. ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న మాట్లాడుతూ ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ కార్మికుల హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తుందని తమపై నమ్మకం ఉంచి ఘన విజయాన్ని అందించిన కార్మికులకు కృతజ్ఞతలు తెలిపారు. ఇటీవల జరిగిన గుర్తింపు సంఘాల ఎన్నికల్లో సికింద్రాబాద్, వరంగల్, నల్గొండ, మెదక్ రీజియన్‌లలో మెజారిటీ రాకున్నా గుర్తింపును ప్రభుత్వ సహకారంతో లేబర్ కమిషన్ ఏకపక్షంగా కట్టబెట్టడాన్ని తీవ్రంగా ఖండిస్తూ పోరాటం చేస్తామన్నారు. అవసరమైతే న్యాయ పోరాటం చేస్తామని కోడ్ ఆఫ్ డిసిప్లేన్ సర్కులర్ యూనియన్ హక్కులను కాలరాసే విధంగా ఉందని వెంటనే ఉపసంహరించుకోవాలని అన్నారు. కార్మికులపై అధికారుల పెత్తనం సహించేది లేదని కార్మికవర్గం కోసం పోరాడేది ఎంప్లాయిస్ యూనియన్ అన్నారు. ఆర్‌టిసి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, టికెట్ తీసుకునే బాధ్యత ప్రయాణికులదే ఉండాలని ఆర్‌టిసిని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలన్నారు. ఖాళీలన్నీ వెంటనే భర్తీ చేయాలన్నారు. రాబోయే ఆర్‌టిసి సిసిఎస్ ఎన్నికల్లోనూ ఎంప్లాయిస్ యూనియన్‌ను మాత్రమే గెలిపించాలని కోరారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకట్ గౌడ్ మాట్లాడుతూ ఆర్‌టిసి పుట్టిన నాటి నుంచి ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ ఉందని యాజమాన్యం కవ్వింపు చర్యలకు పాల్పడకుండా వారి సంక్షేమానికి కృషి చేయాలని అన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ చైర్మన్, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి సమ్మన్న మాట్లాడుతూ ఆర్‌టిసి ఉద్యోగులకు అండగా ఎఐటియుసి ఉంటుందని మన గుర్తింపును బాధ్యతగా కార్మికుల హక్కుల కోసం పోరాటం చేయాలని, సింగరేణిలో కూడా మన సంఘం గెలవడం జరిగిందన్నారు. ఈ జోనల్ మహాసభలో యూనియన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ అప్పారావు, రాష్ట్ర కార్యదర్శులు డి.సంజీవ్, కాళిదాసు, స్వామి, జిఎస్ నారాయణ, బొట్ట లక్ష్మయ్య, ఖదీర్, సిహెచ్ వీరన్న, జోనల్ నాయకులు, రీజియన్ నాయకులు, డిపోల నాయకులు పాల్గొన్నారు.

రైతు వ్యతిరేక విధానాలపై
ఐక్య పోరాటాలకు సిద్ధం

మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలి : ఎఐకెఎస్ జాతీయ కార్యదర్శి విజ్జు కృష్ణన్



ప్రజాపక్షం/నల్లగొండ : రైతాంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఐక్య పోరాటాలను ఉధృతం చేయాలని అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) జాతీయ కార్యదర్శి విజ్జు కృష్ణన్ పిలుపునిచ్చారు. పంటలకు కనీస మద్దతు ధర కల్పించేందుకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని, స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం ఉత్పత్తి వ్యయంపై 50 శాతం అదనంగా ధర నిర్ణయించాలని డిమాండ్ చేశారు. అమెరికా, ఐరోపా సమాఖ్య, న్యూజిలాండ్, బ్రిటన్ తదితర దేశాలతో కేంద్ర ప్రభుత్వం చేసుకుంటున్న వాణిజ్య ఒప్పందాలు భారత రైతాంగానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. నల్లగొండలో జరుగుతున్న ఎఐకెఎస్ 36వ జాతీయ మహాసభలు రెండో రోజు మంగళవారం సారంపల్లి మల్లారెడ్డి నగర్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు రోజులుగా జరుగుతున్న మహాసభలకు తెలంగాణ నలుమూలల నుంచి రైతులు పెద్దఎత్తున తరలివచ్చారని, బహిరంగ సభను విజయవంతం చేసిన రైతాంగానికి,ప్రజా సంఘాలకు, యువతకు, ప్రసార మాధ్యమాల ప్రతినిధులకు ఆహ్వాన సంఘం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. దేశంలోని 27 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి ప్రతినిధులు మహాసభలకు హాజరయ్యారని తెలిపారు. గత మూడేళ్లలో దేశవ్యాప్తంగా రైతు సంఘం నిర్వహించిన పోరాటాలు, సాధించిన విజయాలు, ఎదురైన సమస్యలపై జాతీయ ప్రధాన కార్యదర్శి నివేదిక సమర్పించారని చెప్పారు. రైతాంగం, ప్రజానీకం ఎదుర్కొంటున్న సమస్యలపై ఇప్పటికే పది తీర్మానాలు ప్రవేశపెట్టినట్టు వెల్లడించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికుల ఐక్యతతోనే పాలకుల ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలమన్నారు. నవంబర్ 26న దేశవ్యాప్తంగా రైతులు, కార్మికులు ఐక్యంగా పోరాటాలు నిర్వహించనున్నారని తెలిపారు. నాలుగు కార్మిక చట్టాలను రద్దు చేయడంతోపాటు కనీస మద్దతు ధరకు చట్టబద్ధమైన హామీ కల్పించాలని డిమాండ్ చేస్తామన్నారు. గుజరాత్‌లో రైతులు అప్పట్లోనే ఇది అభివృద్ధి నమూనా కాదని, మోదీ, అదానీ,అంబానీల ప్రయోజనాలకు అనుగుణంగా సాగుతున్న పాలనా విధానమని విమర్శించారని గుర్తుచేశారు. నేటి పరిస్థితులు ఆ విమర్శలను నిజం చేస్తున్నాయని అన్నారు. దేశవ్యాప్తంగా రైతుల హక్కుల కోసం సాగించిన పోరాటాల్లో చారిత్రాత్మకమైన విజయం సాధించామని, కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మూడు వ్యవసాయ చట్టాలను రైతుల ఉద్యమం ద్వారానే వెనక్కి తీసుకునేలా చేశామని గుర్తుచేశారు. ఆ పోరాటంలో 736 మంది రైతులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతు వ్యతిరేక విధానాలను మరో రూపంలో తిరిగి అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ఐక్యంగా ప్రతిఘటిస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పోతినేని సుదర్శన్, తీగల సాగర్, నల్లగొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి, పి. వెంకటేశ్వర్లు, రాష్ట్ర మహిళా కన్వీనర్ కందాల ప్రమీల పాల్గొన్నారు.

పార్లమెంట్ సభ్యుల సంఖ్య పెంపు సరికాదు
సిపిఐ నేత వి.ఎస్. బోస్

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: డీలిమిటేషన్ పేరుతో పార్లమెంట్ సభ్యుల సంఖ్యను పెంచే ప్రతిపాదనను కేంద్రంలోని బిజెపి–ఆర్ఎస్ఎస్ ప్రభుత్వం విరమించుకోవాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు వి.ఎస్ బోస్ డిమాండ్ చేశారు. దేశంలో అనేక సమస్యలు తీవ్రంగా ఉన్న ప్రస్తుత తరుణంలో పార్లమెంట్ సభ్యుల సంఖ్య పెంపునకు కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇవ్వడం సరికాదన్నారు. ప్రస్తుతం ఉన్న 543 పార్లమెంట్ స్థానాలను 815కు పెంచేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని బోస్ ఆరోపించారు. డీలిమిటేషన్ వల్ల దక్షిణ భారత రాష్ట్రాలకు అన్యాయం జరిగే అవకాశం ఉందని పలు రాజకీయ పార్టీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల బిల్లును డీలిమిటేషన్‌తో ముడిపెట్టకుండా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టి ఆమోదించాలని మెజారిటీ రాజకీయ పార్టీలు కోరుతున్నాయని పేర్కొన్నారు. డీలిమిటేషన్‌తో మహిళా రిజర్వేషన్ బిల్లును ముడిపెట్టడం వల్ల మహిళా బిల్లు మరింత ఆలస్యమయ్యే ప్రమాదం ఉందన్నారు. ప్రస్తుతం పార్లమెంట్ సభ్యుల జీతభత్యాలు, ఇతర వ్యయాలే ప్రజలకు భారంగా ఉన్నాయని, సభ్యుల సంఖ్యను పెంచితే ఆ భారం మరింత పెరుగుతుందని బోస్ అన్నారు. దేశంలో ఎలొనొ ప్రభావం, పెరుగుతున్న ధరలు, కృత్రిమ కొరత వంటి సమస్యలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయని తెలిపారు. డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్, ఎలొనొ ప్రభావం తదితర అంశాలపై అన్ని రాజకీయ పార్టీలతో, సామాజిక నిపుణులతో విస్తృతంగా చర్చించిన తర్వాతే కేంద్ర ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని వి.ఎస్ బోస్ సూచించారు.

ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించేలా భారత్ సమ్మిట్ : మహేశ్వర్ రెడ్డి

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్ : హైదరాబాద్‌లో నిర్వహించిన 'భారత్ సమ్మిట్–2026' వేదికపై యూరోపియన్ సోషలిస్ట్స్ పార్టీ (పిఇఎస్) ప్రధాన కార్యదర్శి జియాకోమో ఫిలిబెక్ చేసిన వ్యాఖ్యలు దేశ సార్వభౌమాధికారాన్ని, భారత ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించే విధంగా ఉన్నాయని బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విదేశీ నాయకుడితో భారత ఎన్నికల వ్యవస్థ, ప్రజా తీర్పును కించపరిచేలా వ్యాఖ్యలు చేయించడం వెనుక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఉన్నారని ఆరోపించారు. విదేశీ నాయకుడు భారత అంతర్గత రాజకీయాలపై విమర్శలు చేస్తుండగా రాహుల్ గాంధీ చప్పట్లు కొట్టడం దేశ ప్రయోజనాలకు విరుద్ధమైన చర్య అన్నారు. సమ్మిట్ నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, దేశ ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

గుజరాత్ వ్యాపారాలకు
హైదరాబాద్ మరో కేంద్రం కావాలి!

పెట్టుబడులతో తెలంగాణకు రండి.. మీ వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకోండి: మంత్రి శ్రీధర్‌బాబు



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/అహ్మదాబాద్: గుజరాత్ పారిశ్రామికవేత్తలు తమ వ్యాపార సామ్రాజ్యాన్ని దక్షిణ భారతదేశానికి విస్తరించుకోవాలని, హైదరాబాద్‌ను రెండో ప్రధాన వ్యాపార కేంద్రంగా మలచుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. గుజరాత్ నుంచి పెట్టుబడులను తరలించడం తమ లక్ష్యం కాదని, అక్కడి వ్యాపారాలకు తెలంగాణను అదనపు అవకాశాల వేదికగా అందించడమే ఉద్దేశమని స్పష్టం చేశారు. డేటా సెంటర్లు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీ, ఎలక్ట్రిక్ వాహనాలు, ఏరోస్పేస్, రక్షణ, ఐటి రంగాల్లో తెలంగాణలో విస్తృత అవకాశాలున్నాయని వివరించారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్–2026 సన్నాహాల్లో భాగంగా ఫిక్కీతో కలిసి అహ్మదాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో ఆయన మాట్లాడారు. ''గుజరాత్ మీ పశ్చిమ భారత వ్యాపార కేంద్రంగా ఉంటే.. హైదరాబాద్‌ను దక్షిణ భారతదేశంలో మరో కేంద్రంగా మలచుకోండి. గుజరాత్‌కు ప్రత్యామ్నాయంగా కాకుండా అదనపు అవకాశంగా తెలంగాణను ఎంచుకోండి'' అని పారిశ్రామికవేత్తలకు సూచించారు.తెలంగాణ ఆర్థిక వ్యవస్థ 189 బిలియన్ డాలర్లకు చేరిందని, గత ఏడాది 10.75 శాతం వృద్ధి నమోదైందని మంత్రి తెలిపారు. తలసరి ఆదాయం జాతీయ సగటు కంటే 1.9 రెట్లు అధికంగా ఉందన్నారు. హైదరాబాద్‌లో దాదాపు 10 లక్షల మంది ఐటీ నిపుణులు, 2,000కు పైగా లైఫ్ సైన్సెస్ సంస్థలు, 500కు పైగా గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు ఉన్నాయని వివరించారు. గుజరాత్ వస్త్రాలు, ఆభరణాలు, సిరామిక్స్, ఆహార ఉత్పత్తులు, ఫర్నిచర్‌కు హైదరాబాద్ పెద్ద వినియోగదారుల మార్కెట్‌గా ఉందని చెప్పారు.

30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీ....

హైదరాబాద్‌కు సమీపంలో 30 వేల ఎకరాలకు పైగా విస్తీర్ణంలో భారత్ ఫ్యూచర్ సిటీని నెట్‌జీరో లక్ష్యంతో అభివృద్ధి చేస్తున్నట్లు శ్రీధర్‌బాబు వెల్లడించారు. డేటా సెంటర్లకు 1,200 ఎకరాలు, ఎలక్ట్రానిక్స్, అధునాతన తయారీకి మరో 1,200 ఎకరాలు, ఇవిలు, ఇంధన నిల్వ వ్యవస్థలకు 800 ఎకరాలకు పైగా కేటాయించినట్లు తెలిపారు. ఎఐ సిటీ, విద్యా కేంద్రంతోపాటు 15 వేల ఎకరాలకు పైగా పచ్చదనానికి కేటాయిస్తున్నామని చెప్పారు. టిజిఐపాస్ ద్వారా భారీ పరిశ్రమలకు 15 రోజుల్లో అనుమతులు మంజూరు చేస్తున్నామని, సుమారు 98 శాతం అనుమతులు నిర్దేశిత గడువులోనే ఇస్తున్నామని పేర్కొన్నారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టే ప్రతి గుజరాత్ కంపెనీకి ప్రత్యేక అధికారిని నియమించి, పరిశ్రమ ప్రారంభమై తొలి విక్రయాలు జరిగే వరకు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్–2047 దార్శనికతలో భాగంగా రాష్ట్రాన్ని సియుఆర్ఇ, పియుఆర్ఇ, ఆర్ఎఆర్ఇగా మూడు ఆర్థిక ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. డిసెంబర్ 7 నుంచి 9 వరకు భారత్ ఫ్యూచర్ సిటీలో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో సుమారు 100 అంతర్జాతీయ ఏరోస్పేస్, రక్షణ రంగ సంస్థల భాగస్వామ్యంతో రక్షా ఎక్స్‌పో నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

2.92 లక్షల మంది విద్యార్థులకు
'తెలంగాణ దర్శిని' యాత్రలు

విద్యా, సాంస్కృతిక విజ్ఞాన పర్యటనలకు
రూ.26.30 కోట్ల వ్యయం

పర్యాటక శాఖ నుంచి రూ.11.69 కోట్లు మంజూరు : మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: పుస్తకాల్లో చదివిన తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ విశేషాలను ప్రత్యక్షంగా చూసి తెలుసుకునే అవకాశాన్ని విద్యార్థులకు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'తెలంగాణ దర్శిని' కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో రెండో తరగతి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న 2,92,286 మంది విద్యార్థులను ఈ కార్యక్రమం ద్వారా చారిత్రక, సాంస్కృతిక, పర్యాటక ప్రాంతాల సందర్శనకు తీసుకెళ్లనున్నారు. ఇందుకోసం పర్యాటక శాఖ వాటాగా రూ.11.69 కోట్ల నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విద్యార్థుల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపదపై అవగాహన పెంపొందించడంతోపాటు, రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల విశిష్టతను క్షేత్రస్థాయిలో పరిచయం చేయడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం. తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ , విద్యా శాఖ సమన్వయంతో యాత్రలను నిర్వహించనున్నాయి. ఒక్కో విద్యార్థికి రోజుకు రూ.900 చొప్పున రవాణా, ఇతర పర్యాటక సేవల కోసం ఖర్చు చేయనున్నారు. ఇందులో సమగ్ర శిక్ష అభియాన్ కింద విద్యాశాఖ రూ.500, పర్యాటక శాఖ రూ.400 భరించనున్నాయి. మొత్తం కార్యక్రమానికి రూ.26.30 కోట్ల వ్యయం అంచనా వేయగా, విద్యాశాఖ వాటా రూ.14.61 కోట్లు, పర్యాటక శాఖ వాటా రూ.11.69 కోట్లుగా నిర్ణయించారు. తెలంగాణకు ఘనమైన చరిత్ర, గొప్ప సాంస్కృతిక వారసత్వం, అపురూపమైన చారిత్రక కట్టడాలు, ఆలయాలు, ప్రకృతి పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. తెలంగాణ దర్శిని ద్వారా విద్యార్థులు ఆయా ప్రాంతాలను ప్రత్యక్షంగా సందర్శించి వాటి చారిత్రక, సాంస్కృతిక ప్రాధాన్యతను తెలుసుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు. పుస్తకాల్లో చదివిన అంశాలను స్వయంగా చూసి తెలుసుకోవడం వల్ల విద్యార్థుల విజ్ఞాన పరిధి విస్తృతమవుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నారు. చరిత్ర, సంస్కృతి, వారసత్వ సంపద పరిరక్షణపై చిన్నతనం నుంచే విద్యార్థుల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. చారిత్రక కట్టడాలు, దేవాలయాలు, మ్యూజియంలు, వారసత్వ ప్రదేశాలు, ప్రకృతి అందాలు విద్యార్థులకు సజీవ పాఠశాలలుగా నిలుస్తాయని, తరగతి గది బోధనకు అనుబంధంగా క్షేత్రస్థాయి పర్యటనలు మరింత ఆసక్తికరమైన అభ్యసన అనుభవాన్ని అందిస్తాయని మంత్రి వివరించారు.

యాదాద్రి విద్యుత్‌తో తెలంగాణ విద్యుత్ రంగం బలోపేతం

- 4,000 మెగావాట్ల పూర్తి సామర్థ్యంతో ఉత్పత్తికి ప్రభుత్వ కార్యాచరణ
- నైనీ, ఎంసిఎల్, ఇసిఎల్ నుంచి నిరంతర బొగ్గు సరఫరాకు పక్కా ఏర్పాట్లు
- రబీ సీజన్‌లో పూర్తి స్థాయి ఉత్పత్తికి టిజి జెన్‌కో సన్నద్ధం

ప్రజాపక్షం న్యూస్ బ్యూరో/హైదరాబాద్: తెలంగాణ విద్యుత్ రంగాన్ని మరింత పటిష్టం చేస్తూ, రాష్ట్ర విద్యుత్ అవసరాలను సమర్థంగా తీర్చే దిశగా ప్రభుత్వం కీలక చర్యలు చేపట్టింది. యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటిపిఎస్)ను పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో అందుబాటులోకి తీసుకురావడంపై ప్రత్యేక దృష్టి సారించింది. మొత్తం 4,000 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఈ భారీ విద్యుత్ ప్రాజెక్టులో ఇప్పటికే నాలుగు యూనిట్లు విజయవంతంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుండగా, ఐదో యూనిట్ కూడా గ్రిడ్‌కు అనుసంధానమైంది. డిసెంబర్‌లో ఐదో యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభం కానుంది. మరోవైపు బొగ్గు సరఫరా వ్యవస్థలోని సాంకేతిక సమస్యలను పరిష్కరించి, రానున్న రబీ సీజన్‌లో ఐదు యూనిట్ల ద్వారా పూర్తి స్థాయిలో 4,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి సంస్థ (టిజి జెన్‌కో) సమగ్ర కార్యాచరణ ప్రణాళికను అమలు చేస్తోంది. రాష్ట్ర ఇంధన శాఖ సమాచారం, సాంకేతిక వివరాల ప్రకారం యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో ఒక్కోటి 800 మెగావాట్ల సామర్థ్యంతో మొత్తం ఐదు యూనిట్లను ఏర్పాటు చేయగా, ఈ ప్రాజెక్టు అనేక సవాళ్లను అధిగమించి ప్రారంభోత్సవ దశకు చేరుకుంది. కోవిడ్ మహమ్మారి, అటవీ అనుమతులు, రైల్వే భూముల సమస్యలతో పాటు పర్యావరణ అనుమతులకు సంబంధించి జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాల కారణంగా పనుల్లో జాప్యం జరిగినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధతో ప్రాజెక్టును తిరిగి వేగవంతం చేసింది.

సాంకేతిక సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ

యాదాద్రి ప్లాంట్‌లో ప్రధాన ఉత్పత్తి వ్యవస్థలైన బాయిలర్, టర్‌బైన్, జనరేటర్‌తో పాటు బూడిద నిర్వహణ, నీటి సరఫరా వ్యవస్థలు సంతృప్తికరంగా పనిచేస్తున్నాయి. అయితే బొగ్గు నిర్వహణ ప్లాంట్‌లోని కొన్ని సాంకేతిక సమస్యలను గుర్తించిన ప్రభుత్వం వాటి పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టింది. ఇందు కోసం బిహెచ్ఈఎల్, టిజి జెన్‌కో సంయుక్త ఉన్నతస్థాయి బృందం యాదాద్రి ప్లాంట్లోనే మకాం వేసి పరిస్థితులను సమీక్షించింది. టిజి జెన్‌కో సిఎండి, బిహెచ్ఈఎల్ డైరెక్టర్ (పవర్) తదితరులు క్షేత్రస్థాయిలో పరిశీలనలు జరిపి, సమస్యల పరిష్కారానికి స్పష్టమైన లక్ష్యాలతో కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు. ఫలితంగా నాలుగు బొగ్గు సరఫరా మార్గాలను పునరుద్ధరించి, ఒక్కో మార్గం ద్వారా గంటకు సగటున 800 టన్నుల చొప్పున మొత్తం 3,200 టన్నుల బొగ్గు సరఫరా చేసే స్థాయికి తీసుకొచ్చారు. దీంతో బొగ్గు సరఫరాలో అంతరాయాలు తగ్గి ప్లాంట్ పనితీరు మెరుగుపడింది.

నిరంతరాయ బొగ్గు సరఫరాకు బహుముఖ వ్యూహం

ప్లాంట్‌కు అవసరమైన బొగ్గు నిరంతరాయంగా అందుబాటులో ఉండేలా ప్రభుత్వం బహుముఖ వ్యూహాన్ని అమలు చేస్తోంది. ఎస్‌సిసిఎల్‌కు చెందిన నైనీ బొగ్గు గని నుంచి రోజుకు 3 నుంచి 4 రేక్‌ల బొగ్గును తరలించే ఏర్పాట్లు చేసింది. ఇప్పటివరకు అక్కడి నుంచి 4.26 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గును యాదాద్రికి ప్లాంట్‌కు తరలించారు. అదేవిధంగా ఎంసిఎల్, ఎస్ఈసిఎల్ సంస్థల నుంచి విండో–II వేలం విధానం ద్వారా 4.6 లక్షల టన్నుల బొగ్గు కొనుగోలుకు ఒప్పందాలు కుదుర్చుకుని, నవంబర్ 4న ఫ్యూయల్ సప్లై అగ్రిమెంట్లు పూర్తి చేశారు. ఈ సంస్థల నుంచి బొగ్గు రవాణా కూడా ప్రారంభమైంది. మరోవైపు కేంద్ర విద్యుత్, బొగ్గు శాఖలతో రాష్ట్ర ప్రభుత్వం, టిజి జెన్‌కో జరిపిన నిరంతర సంప్రదింపులు సత్ఫలితాలనిచ్చాయి. కోల్ ఇండియా అనుబంధ సంస్థలైన ఎంసిఎల్, ఈసిఎల్ నుంచి యాదాద్రి ప్లాంట్‌లోని రెండు యూనిట్లకు ఏడాదికి 7.71 మిలియన్ టన్నుల బొగ్గు సరఫరా చేసేందుకు స్టాండింగ్ లింకేజ్ కమిటీ ఆమోదం తెలిపింది. ఈ దీర్ఘకాలిక సరఫరా ఏర్పాటుతో బొగ్గు పరిమాణం, నాణ్యతకు సంబంధించిన సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించనుంది.



సత్తా చాటిన యాదాద్రి ప్లాంట్

ప్రభుత్వం చేపట్టిన సమన్వయ చర్యలు, టిజి జెన్‌కో అధికారుల కృషి ఇప్పటికే సత్ఫలితాలనిస్తున్నాయి. రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి చరిత్రలోనే నవంబర్ 11న తొలిసారిగా 6,088 మెగావాట్ల ఆల్‌టైమ్ గరిష్ట ఉత్పత్తి నమోదైంది. ఇందులో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ ఒక్కటే 2,754 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసి తన సామర్థ్యాన్ని చాటుకుంది. రాష్ట్ర విద్యుత్ రంగంలో ఇది కీలక మైలురాయిగా నిలిచింది. యాదాద్రి ప్లాంట్ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం మరింత పెరగడంతో పాటు గ్రిడ్ అవసరాలను సమర్థంగా తీర్చేందుకు వీలవుతుంది.

నిర్దేశిత సామర్థ్యంతో పనిచేసేందుకు టిజి జెన్‌కో మరో కీలక అడుగు

బొగ్గు నిర్వహణ ప్లాంట్‌ను కూడా నిర్దేశిత సామర్థ్యంతో పనిచేసేలా తీర్చిదిద్దేందుకు టిజి జెన్‌కో మరో కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా నవంబర్ 18 నుంచి 24 వరకు తొలి బొగ్గు సరఫరా మార్గాన్ని దశలవారీగా పునరుద్ధరణ పనుల కోసం షట్‌డౌన్ చేయనుంది. ఈ సమయంలో మిగిలిన మూడు సరఫరా మార్గాలను నిరంతరాయంగా అందుబాటులో ఉంచి నాలుగు యూనిట్ల ద్వారా 2,000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రణాళిక రూపొందించింది. అవసరమైతే ఎస్ఎలోడిసితో సమన్వయం చేసుకుంటూ ఉత్పత్తిని 1,800 మెగావాట్లకు నియంత్రించేలా ముందస్తు ఏర్పాట్లు చేసింది. విద్యుత్ ఉత్పత్తికి ఆటంకం కలగకుండా మరమ్మతులు నిర్వహించడమే ఈ ప్రణాళిక ప్రత్యేకత. బిహెచ్ఈఎల్, టిజి జెన్‌కో సంస్థలు పిఎం పిఎల్, బిటిఎల్, ఎల్అండ్‌టి అనుబంధ సంస్థల సహకారంతో ఈ పనులను చేపట్టనున్నాయి. కన్వేయర్ బెల్టులు, వైబ్రేటింగ్ గ్రిజ్‌ల ఫీడర్లు, క్రషర్లు, బెల్ట్ ఫీడర్లు, స్టాకర్, రీక్లెయిమర్ తదితర విభాగాల్లో సమగ్ర పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. అవసరమైన విడిభాగాలను ఇప్పటికే సిద్ధం చేశారు. ఈ పనుల అనంతరం గంటకు 2,500 టన్నుల బొగ్గు రవాణా సామర్థ్యాన్ని బిహెచ్ఈఎల్ సంస్థ ప్రదర్శించి నిరూపించాల్సి ఉంటుంది. తొలి మార్గం మరమ్మతులు పూర్తయిన తర్వాత మిగిలిన మార్గాలను కూడా ఇదే తరహాలో దశలవారీగా పునరుద్ధరించనున్నారు.

త్వరలో పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యం

ఒకవైపు బొగ్గు సరఫరా వ్యవస్థను పటిష్టం చేస్తూ, మరోవైపు ఐదో యూనిట్ వాణిజ్య ఉత్పత్తికి సిద్ధమవుతున్న నేపథ్యంలో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ త్వరలోనే పూర్తి స్థాయి ఉత్పత్తి సామర్థ్యంతో అందుబాటులోకి రానుంది. నైనీ, ఎంసిఎల్, ఈసిఎల్ నుంచి దీర్ఘకాలిక బొగ్గు సరఫరా ఏర్పాట్లు, ఆధునికీకరణ చర్యలు

ఘోర రోడ్డు ప్రమాదం..

ఒకరు మృతి,మరొకరి పరిస్థితి విషమం



ప్రజాపక్షం/రాయికల్ : జగిత్యాల జిల్లా రాయికల్ మండలం కుమ్మరిపల్లి గ్రామ శివారులో మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా,మరొకరు తీవ్రంగా గాయపడినట్లు సమాచారం.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కుమ్మరిపల్లి గ్రామానికి చెందిన గంగారెడ్డి తన ద్వి చక్ర వాహనంపై రాయికల్ వైపు వస్తుండగా అదే గ్రామానికి చెందిన మ్యాకల మహేష్ రాయికల్ నుండి కుమ్మరి పెల్లి వెళ్తున్న క్రమంలో ఒకరినొకరు ఢీకొని తీవ్ర గాయాల పాలయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను రాయికల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో మహేష్ మృతి చెందాడు. గాయపడిన గంగారెడ్డిని మెరుగైన చికిత్స నిమిత్తం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. మృతి చెందిన మహేష్ మృతదేహాన్ని జగిత్యాల ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మహేష్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

మహేష్‌గౌడ్‌ను కలిసిన గజ్వేల్ కాంగ్రెస్ నేతలు



ప్రజాపక్షం/గజ్వేల్ : పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ను మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి నేతృత్వంలో గజ్వేల్ కాంగ్రెస్ నేతలు మంగళవారం మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్చం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. నియోజకవర్గంలో నెలకొన్న వివిధ సమస్యలను ఆయన దృష్టికి తెచ్చారు.కాంగ్రెస్ పార్టీ లీగల్ సెల్ నేత సాజిద్ బేగ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మాజీ ఎంపిపి మోహన్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి, కృష్ణారెడ్డి, కుమార్ ఉన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ పాఠశాలకు మెమో జారీ



ప్రజాపక్షం/ముత్తారం : ప్రభుత్వ ఆదేశాలను బేఖాతరు చేస్తూ సెలవు దినమైన రెండో శనివారం నాడు తరగతులు నిర్వహించిన పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం అడవి శ్రీరాంపూర్ గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంపై విద్యాశాఖ చర్యలకు ఉపక్రమించింది.
ఈ విషయంపై ప్రజాపక్షం దినపత్రికలో ప్రభుత్వ పాఠశాలలకు బంద్.. ప్రైవే ట్ పాఠశాలలో యధావిధిగా తరగతులు : అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి మండల విద్యాధికారి హరిప్రసాద్ తక్షణమే స్పందించారు.తన ఆదేశాల మేరకే పాఠశాలను నడుపుతున్నామని సదరు పాఠశాల కరస్పాండెంట్ తప్పుడు ప్రచారం చేయడంపై ఎంఈఓ తీవ్ర ఆగ్రహం వ్య క్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించి పాఠశాలను నిర్వహించడమే కాకుండా,ఉన్నతాధికారుల పేర్లను వాడుకోవడంపై వివరణ కోరుతూ సదరు ప్రైవేట్ పాఠశాల యాజమాన్యానికి ఆయన అధికారికంగా మెమో జారీ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పాఠశాలలపై కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎంఈఓ హరిప్రసాద్ హెచ్చరించారు.

రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి పెట్టాలి

ఎంపి రఘునందన్ రావు



ప్రజాపక్షం/గజ్వేల్: ఎల్ నినో దృష్ట్యా రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై దృష్టి పెట్టాలని మెదక్ ఎంపి రఘునందన్ రావు పేర్కొన్నారు. మంగళవారం గజ్వేల్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డితో కలిసి పత్తి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కొ నుగోలు కేంద్రాల్లోనే విక్రయించి రైతులు ఆర్థికంగా ప్రయోజనం పొందాలని అన్నారు.తక్కువ వర్షపాతంతో దిగుబడి లేక రైతులు ఇబ్బంది పడే పరిస్థితి నెలకొందని, ఈ అంశాలను దృష్టిలో పెట్టుకొని రైతులు జాగ్రత్త పడాలని స్పష్టం చేశారు. రైతులకు ప్రయోజనం ఉండాలనే లక్ష్యంతో పత్తి క్వింటాలుకు రూ 8700 మద్దతు ధర ప్రకటించడంతో రైతుల నుండి ఆనందం వ్యక్తం అవుతుందని వివరించారు. ఆత్మ కమిటీ చైర్మన్ మద్దూరి మల్లారెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షులు శంకర్ ముదిరాజ్, మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, పార్టీ అధికార ప్రతినిధి ప్రసాద్ రావు, పట్టణ బిజెపి అధ్యక్షులు మనోహర్ యాదవ్, వ్యవసాయ అధికారి నాగరాజు, కాటన్ అండ్ గ్రేన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు.

'కంచర్ల'లో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం : మహేందర్ రెడ్డి

ప్రజాపక్షం/వీర్నపల్లి: మండల కేంద్రంలోని కంచర్ల గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సామల్ల దేవరాజు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మమత తిరుపతి యాదవ్, మండల అధ్యక్షులు భూక్య సంతోష్ నాయక్‌లతో కలిసి ఆయన ఈ కేంద్రాన్ని లాంఛనంగా ప్రారంభించారు.రైతులు తమ పంటను దళారులకు విక్రయించి నష్టపోవద్దని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర క్వింటాలుకు రూ.2461 తొ పాటు రూ.500 బోనస్ పొందేలా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అలాగే, రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొన్నందున రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఆరుతడి పంటలైన మొక్కజొన్న, జొన్న, రాగులు, సజ్జలతో పాటు కూరగాయలు, ఆకుకూరలు సాగు చేసి ఆర్థికంగా లాభపడాలని ఆయన కోరారు. కార్యక్రయంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఫణి శివరామకృష్ణ, కేంద్రం నిర్వాహకులు, రైతులు పాల్గొన్నారు.



సిఎం బహిరంగ సభలో..

ఇబ్బందులు తలెత్తొద్దు

ఏర్పాట్లు పరిశీలించిన మంత్రి పొన్నం



ప్రజాపక్షం/ సిద్దిపేట : సిద్దిపేట జిల్లా కేం ద్రంలో ఈనెల 19న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇందిర జీవిత బీమా పథకం ప్రారంభం,. భారీ బహిరంగ సభ నేపథ్యంలో సభ ప్రాంగణాన్ని రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ పరిశీలించారు. సిద్దిపేట బైపాస్ రోడ్డులోని నాగదేవత ఆలయం సమీపంలో ఏర్పా టు చేస్తున్న సభా ప్రాంగణాన్ని సందర్శించి, ఏర్పాట్ల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సభకు భారీ సంఖ్య లో ప్రజలు, ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమ గు అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చే యాలని అధికారులను ఆదేశించారు. సభకు వ చ్చే ప్రజల వా హనాల పార్కింగ్, బారికేడింగ్, లైటింగ్, భద్ర తా ఏర్పాట్లు, జన సమీకరణ, తాగునీరు తదితర మౌలిక సదుపాయాలపై అధికారులకు ప లు సూచనలు చేశారు. సభా వేదిక నిర్మాణంతో పాటు ఇతర పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ నెల 19న సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దేశంలోనే తొలిసారిగా, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని ప్రారంభించనున్నారు. అదే రోజున మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నారు.ప్రజాపాలన ప్రభుత్వం అ ధికారంలోకి వచ్చిన తర్వాత గత మూడేళ్లుగా చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వి వరించడంతో పాటు, భవిష్యత్తులో ప్రజల కోసం చేపట్టబోయే కార్యక్రమాలపై ముఖ్యమం త్రి సభా వేదిక నుంచి ప్రసంగించనున్నారు.సిద్దిపేట జిల్లా కేంద్రంగా నిర్వహిస్తున్న ఈ బహిరం గ సభకు సిద్దిపేటతో పాటు గజ్వేల్, దుబ్బాక, జనగామ, హుస్నాబాద్, మానకొండూర్, సిరిసిల్ల, వేములవాడ, నర్సాపూర్, మెదక్ నియోజకవర్గాలతో పాటు పరిసర ప్రాంతాల నుంచి ప్రజలు భారీ సంఖ్యలో తరలిరానున్నారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ ముఖ్యమంత్రి పాదయాత్ర ప్రారంభమయ్యే ముస్తాబాద్ చౌరస్తాను కమిషనర్ ఆఫ్ పోలీస్ సాధన రష్మీ పెరుమాల్ తో కలసి పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కె. హైమావతి, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, ప్రభుత్వ విప్ వేముల వీరేశం, ఎమ్మెల్సీ శంకర్ నాయక్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడురి శ్రీనివాస్, డిసిస అంక్షారెడ్డి, సిద్దిపేట,దుబ్బాక కాంగ్రెస్ ఇంచార్జి పూజల హరికృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు ముఖ్య నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నూతన పెన్షన్ పత్రాలు అందజేసిన ఎమ్మెల్యే పాడి



ప్రజాపక్షం/జమ్మికుంట : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్లకు సంబంధించి జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలోని 30 వార్డులకు 583, జమ్మికుంట మండల పరిషత్ పరిధిలోని 20 గ్రామాలకు కలిపి మొత్తం 553 నూతన పెన్షన్లు మంజురయ్యాయి. ఈ సందర్భంగా మంగళవారం జమ్మికుంటలోని ఎంపిఆర్ గార్డెన్‌లో నిర్వహించిన చేయూత నూతన పెన్షన్ల మంజూరు ఉత్తర్వుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి, ఆర్డీవో జల కుమారిలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ మొలుగు ప్రశాంత్ కుమార్ సభాధ్యక్షత వహించారు. జమ్మికుంట పట్టణంలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఆర్డీవో జల కుమారి నాయక్‌వాడి, మున్సిపల్ చైర్మన్, కమిషనర్ జి.మల్లిఖార్జున స్వామి చేతులమీదుగా మంజూరు ఉత్తర్వులు అందజేశారు. అదేవిధంగా జమ్మికుంట మండల పరిషత్ పరిధిలోని 20 గ్రామాల లబ్ధిదారులకు ఎమ్మెల్యేతోపాటు ఆర్‌డిఒ, గ్రామ సర్పంచులు, ఎంపిడివో ఆర్. పద్మావతిలు మంజూరు ఉత్తర్వులు అందజేశారు. ఫంక్షన్‌హాల్ లోని ఏర్పాట్లను ఎంపిడివో, మున్సిపల్ కమీషనర్‌లు సమన్వయంతో చేపట్టారు. మున్సిపల్ మేనేజర్ జి.రాజిరెడ్డి, వైస్ చైర్మన్ మహమ్మద్ ముంతాజ్ అలీ, వార్డు కౌన్సిలర్లు, వార్డు అధికారులు, మున్సిపల్ సిబ్బంది, ఎంపిఒ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

పింఛన్ల సభలో పొలిటికల్ రచ్చ!

ఎంపి ఎమ్మెల్యే సమక్షంలో పోలీసుల లాఠీఛార్జి

ప్రజాపక్షం/చేర్యాల: సిద్దిపేట జిల్లా చేర్యాల రేణుక గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన నూతన పింఛన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం రాజకీయ రగడకు వేదికైంది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొమ్మూరి ప్రశాంత్ రెడ్డి రాకతో ఇరు పార్టీల కార్యకర్తలు పోటాపోటీ నినాదాలు చేశారు. ఎమ్మెల్యే ప్రసంగిస్తున్న సమయంలో కూడ ఇరు పార్టీల కార్యకర్తల ఆదేఠీరును కొనసాగించడం వాగ్వాదం ముదరడంతో పోలీసులు లాఠీఛార్జి చేశారు. పరిస్థితి సద్దుమణగకపోవడంతో ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డిలు మాట్లాడుతున్న మధ్యలోనే గొడవ జరుగుతుండడంతో సభనుంచి వెళ్లిపోయారు.అధికారులు లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేసే ఏర్పట్లు చేశారు.



ఉపాధిహామీ కూలీల ధర్నా అవాస్తవం

పని ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో మాట్లాడిన అధికారులు



ప్రజాపక్షం/ముత్తారం : ముత్తారం మండలం పోతారం గ్రామ శివారులో జరుగుతున్న ఉపాధి హామీ పనులలో 70 మంది కూలీల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేయకుండానే ఇంటికి పంపించారని,దీంతో వారు ఎంపిడిఒ కార్యాలయం ముందు ధర్నా చేశారంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని గ్రామ సర్పంచ్ ఊట్ల చరణ్, పంచాయతీ కార్యదర్శి సతీష్ ఖండించారు. మంగళవారం ఉపాధి హామీ టెక్నికల్ అసిస్టెంట్ మహేష్తో కలిసి వారు పనులు జరుగుతున్న ప్రదేశాన్ని సందర్శించి కూలీలతో నేరుగా మాట్లాడారు.సోమవారం ఒక మేట్ సెల్‌ఫోన్‌లో సిగ్నల్ అంతరాయం కలగడం వల్ల కొందరు కూలీలకు మస్టర్లు నమోదు కాలేదని తెలిపారు.అయితే,ఏ ఒక్క కూలీకి కూడా నష్టం జరగకుండా చూస్తామని సోమవారమే వారికి నేరుగా హామీ ఇచ్చామని స్పష్టం చేశారు.తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూలీలను ప్రశ్నించగా, అసలు ధర్నా గురించి తమకు ఏమీ తెలియదని కూలీలు తేల్చి చెప్పినట్లు సర్పంచ్, కార్యదర్శి మరియు టెక్నికల్ అసిస్టెంట్ వివరించారు. ప్రస్తుతం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతున్న ఫోటోలు, ఎంపి డిఒ కార్యాలయం ముందు ధర్నా చేస్తున్నట్లు చూ పిస్తున్న చిత్రాలు గత మూడు నెలల క్రితం నా టివని వారు స్పష్టం చేశారు.పని ప్రదేశంలో గానీ, ఎంపిడిఒ కార్యాలయం ముందు గానీ కూలీలు ధర్నా చేయలేదని,ఇదంతా కేవలం దుష్ప్రచారం మాత్రమేనని వారు తేల్చి చెప్పారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి : చిలువేరు



ప్రజాపక్షం/రామగిరి : భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి,వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలంగాణ భవన నిర్మాణ రంగాల కార్మికసంఘం (బిఎన్ ఆర్‌కెఎస్)రాష్ట్ర అధ్యక్షుడు దరిపల్లి చంద్రం తెలిపారు.సిద్దిపేట జిల్లా గ్రం థాలయ సంస్థ చైర్మన్‌గా ఎన్నికైన దరిపల్లి చంద్రంను భవన నిర్మాణ కార్మిక సమైక్య సంఘం పెద్దపల్లి జిల్లా కార్యవర్గ సభ్యులు మంగళవారం మర్యా దపూర్వకంగా కలిశారు.జిల్లా అధ్యక్షుడు చిలువేరు స్వామి, ఉపాధ్యక్షుడు తిరునహరి రాజు ఆధ్వర్యంలో కార్యవర్గ సభ్యులు ఆయన కార్యాలయానికి వెళ్లి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. జిల్లాలోని భవన నిర్మాణ రంగ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,వాటి ద్వారా కార్మికులకు కలుగుతున్న ప్రయోజనాలపై రాష్ట్ర అధ్యక్షుడితో స్వామి చర్చించారు. అర్హులైన ప్రతి కార్మికుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని,కార్మికుల సమస్యల పరిష్కారానికి సంఘం తరఫున ప్రత్యేక చొరవ చూపాలని కోరారు.దీనిపై స్పందించిన దరిపల్లి చంద్రం మాట్లా డుతూ. జిల్లా పర్యటనలో భాగంగా నవంబర్ 26న పెద్దపల్లికి విచ్చేయ నున్నట్లు తెలిపారు.ఈ పర్యటనలో కార్మిక సంఘం నాయకులు, భవన నిర్మాణ కార్మికులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలను నేరుగా తెలుసుకుంటానని పేర్కొన్నారు.కార్మికుల సంక్షేమం,సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి శంకర్, కార్యదర్శి కుమ్మం లక్ష్మీనారాయణ,ప్రచార కార్యదర్శి ఇటి సుధాకర్,కార్యవర్గ సభ్యులు మల్యాల రాజయ్య,రాచర్ల చంద్రమౌళి, గడ్డం శంకర్, కుమార్, నర్సయ్య, పాల్గొన్నారు.

విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



ప్రజాపక్షం/గంగాధర : అర్హులైన లబ్ధిదారులందరికీ విడతలవారీగా ఇందిరమ్మ ఇండ్లు, సంక్షేమ పథకాలు తప్పకుండా అందజేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే డా.మేడిపల్లి సత్యం అన్నారు. షానగర్ గ్రామంలోని ఫంక్షన్ హాల్‌లో మంగళవారం చేయూత పెన్షన్ లబ్ధిదారులకు మంజూరి పత్రాలు అందజేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక చొప్పదండి నియోజకవర్గంలో మొదటి విడతలో 3500 ఇండ్లను రెండో విడతలో 3500 ఇండ్లను మంజూ రు చేశామని అన్నారు. దేశంలో ఎక్కడాలేని విధంగా ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. ఆడ బిడ్డల సంక్షేమం కోసం ఆర్‌టిసి బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించామని ఆర్థిక స్వాలంబన కోసం వడ్డీ లేని రుణాలు అందిస్తున్నామని వివరించారు. ఈనెల 19న ఇందిరమ్మ జయంతి సందర్భంగా కుటుంబంలోని పెద్ద మరణిస్తే రూ.5 లక్షల భీమా సౌకర్యం పథకం ప్రవేశపెడుతున్నామని అన్నారు. ఈఅడిషనల్ కలెక్టర్ అశ్విని వాకడే, సింగిల్ విండో చైర్మన్ కోల రమేశ్, మండల ప్రత్యేక అధికారి రాజేశ్వరి, సర్పంచులు మోయిస్, గాదే మధుకర్ రెడ్డి, అనంతరెడ్డి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల డబ్బులను కాజేస్తున్న దళారులు

ఎఐటియుసి ప్రధాన కార్యదర్శి కడారి రాములు



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : జిల్లాలో లేబర్ కార్డులు, లేబర్‌లకు వచ్చే ఇన్సూరెన్స్‌ను కార్మికులకు రాకుండా కొంతమంది దళారీలు, అధికారులు, కార్మికుల డబ్బులు కాజేస్తున్నారని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద సుదర్శన్ ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు ఆరోపించారు. మంగళవారం సిపిఐ కార్మిక భవనం సుభాష్‌నగర్‌లో సమావేశం నిర్వహించి వారు మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ఫైళ్లను పూర్తి చేసి కార్మికులకు బెన్‌ఫిట్స్ అందించాలని కోరారు. లేనిపక్షంలో కార్మికుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. ఎఐటియుసి నాయకులు చంద్రయ్య, సదానందం పాల్గొన్నారు.

'సర్' సర్వే డబ్బు రాదవని తహసీల్దార్‌కు వినతి

ప్రజాపక్షం /రాయికల్ : రాయికల్ మండలానికి చెందిన బి ఎల్ ఓ లు సర్ ప్రక్రియ సర్వే డబ్బు రాదవని కోరుతూ తహసీల్దార్ నాగార్జునకు మంగళవారం వినతి పత్రం అందజేశారు. 25–06–2026 రోజున సర్ సర్వే ప్రారంభించి 100శాతం పూర్తి చేశామని దీనికి సంబంధించిన డబ్బులు ఇప్పటి వరకు రాయికల్ మండల బి ఎల్ ఒ లకు రాలేదని తెలిపారు. మేడిపల్లి మండలం బి ఎల్ ఓ లకు గత నెల క్రితమే డబ్బులు వచ్చాయని రాయికల్ మండల వాళ్ళకు డబ్బులు రాకపోవడానికి కారణం తెలియదని మీరు చొరవ చూపి మాకు డబ్బులు వచ్చే విధంగా మాకు వినతిపత్రంలో కోరారు. బిఎల్‌ఒలు పాల్గొన్నారు.

జియోకోమో ఫిలిటెక్ వ్యాఖ్యలపై సిపికి ఫిర్యాదు



ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ : హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్2026లో పార్టీ ఆఫ్ యూరోపియన్ సోషలిస్ట్స్ సెక్రటరీ జనరల్ ఇటలీకి చెందిన విదేశీ ప్రతినిధి జియకోమో ఫిలిటెక్ చేసిన రాజకీయ వ్యాఖ్యలపై కరీంనగర్ జిల్లా బిజెపి తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత అంతర్గత రాజకీయ వ్యవహారాల్లో విదేశీ ప్రతినిధి జోక్యం చేసుకోవడం తగదని ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మంగళవారం జిల్లా బిజెపి అధ్యక్షుడు సాయిని మల్లేశం ఆధ్వర్యంలో పోలీస్ కమీషనర్‌కు ఫిర్యాదు చేశారు. భారత్ సమ్మిట్‌లో జియోకోమో ఫిలిటెక్ బహిరంగంగా ఓట్ చోర్ గద్దీ చోడ్ అనే రాజకీయ నినాదాన్ని ప్రస్తావించి దానిని ఓటు దొంగ నీ సీటును వదిలి వెళ్లు అని అనువదించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. భారత భూభాగంపై నిర్వహించిన కార్యక్రమంలో విదేశీ రాజకీయ సంస్థకు చెందిన కీలక ప్రతినిధి దేశ అంతర్గత రాజకీయ అంశాలపై ప్రసంగించడం అభ్యంతకరమని తెలిపారు. జియోకోమో ఫిలిటెక్ ఏ కేటగిరీ వీసాపై భారత్‌కు వచ్చారు ఆయన పాల్గొన్న రాజకీయ కార్యకలాపాలు వీసా నిబంధనలకు అనుగుణంగా ఉన్నాయా అనే అంశాలపై విచారణ జరపాలని కోరారు. ఫిర్యాదులో డిమాండ్ చేశారు. బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు గుజ్జ శ్రీనివాస రావు, మాడ వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులు గుగ్రాల వెంకట్ రెడ్డి, ఎర్రబెల్లి సంపత్ రావు, నరసింహారాజు, కోల అశోక్, వివిధ మోర్చాల అధ్యక్షులు మోతె గంగారెడ్డి, సంఘ నరేశ్, రమావత్ శ్రీనివాస్ నాయక్, సమీ ఫర్వేజ్, సోషల్ మీడియా కన్వీనర్ వినోద్ పాల్గొన్నారు.

'మల్లన్నపేట'కు నూతన సింగిల్ విండో మంజూరు

మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌కు గ్రామస్తుల కృతజ్ఞతలు



ప్రజాపక్షం/గొల్లపల్లి : జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలంలోని మల్లన్నపేట గ్రామంలో నూతన ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) ఏర్పాటుకు మార్గం సుగమమైంది. గ్రామంలో సింగిల్ విండో ఏర్పాటు చేయాలని భీమ సంతోష్ చేసిన ప్రయత్నాలు ఫలించాయి. జిల్లాలో 12 నూతన సింగిల్ విండోలను ఏర్పాటు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో లో మల్లన్నపేట గ్రామానికి చోటు లభించింది. రైతులకు సహకార సంఘాల ద్వారా అందించే ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు నూతన సింగిల్ విండోల ఏర్పాటుకు చర్యలు చేపట్టాయి. ఇందులో భాగంగా గొల్లపల్లి మండలంలో ఒక నూతన సింగిల్ విండోను ఏర్పాటు చేయాలని నిర్ణయించడంతో మండలంలోని పలు గ్రామాల నాయకులు తమ గ్రామాల్లో ఏర్పాటు చేయాలంటూ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు సమర్పించారు.గ్రామాల రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని భీమ సం తోష్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.అంతేకాకుం డా గ్రామంలో ప్రసిద్ధి చెందిన శ్రీ మల్లికార్జున స్వామి ఆలయం ఉండటంతో ఈ ప్రాంతానికి ఆ ధ్యాత్మిక ప్రాధాన్యత కూడా ఉందని వివరించారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో లో మల్లన్నపేటకు చోటు దక్కడంతో గ్రామస్తుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. గ్రామంలో నూతన సింగిల్ విండో ఏర్పాటుకు కృషి చేసిన మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌కు గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఖేలో ఇండియా క్రీడా పోటీల లోగో, మస్కట్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/సంగారెడ్డి : తెలంగాణ రాష్ట్రంలో డిసెంబర్ 11 నుంచి 22 వ తేదీ వరకు నిర్వహించనున్న ఖేలో ఇండియా క్రీడా పోటీలకు సంబందించి రూపొందించిన అధికారిక లోగో, మస్కట్‌ను రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా, కలెక్టర్ ప్రతీక్ జైన్ సంగారెడ్డిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ క్రీడాకారుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంతో పాటు జాతీయ స్థాయిలో ప్రతిభ కలిగిన క్రీడాకారులను ప్రొత్సహించేందుకు ఖేలో ఇండియా వంటి క్రీడా పోటీలు, దోహదపడతాయని పేర్కొన్నారు. యువత క్రీడలపై ఆసక్తి పెంపొందించుకొని జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా ఇటువంటి కార్యక్రమాలు ఉపయోగపడతాయని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ ఖేలో ఇండియా క్రీడా పోటీల ప్రాధాన్యతను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు క్రీడల పట్ల యువతలో అవగాహన ఆసక్తి పెంపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ పాండు, జిల్లా యువజన, క్రీడల అధికారి అఖిలేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకంపై అవగాహన ఉండాలి

అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్: ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలులో భాగంగా క్షేత్రస్థాయి అధికారులు పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు ఆదేశించారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా దరఖాస్తుల నమోదు ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. మంగళవారం సాయం త్రం కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి సంబంధిత క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పథకం అమలు, దరఖాస్తుల నమో దు విధానంపై సమీక్షించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, బీమా దరఖాస్తులను పూర్తి వివరాలతో, అత్యంత జాగ్రత్తగా నమో దు చేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల పేర్లు, నామినీ వివరాలు, నామినీ వాటా, ఆధార్, రేషన్ కార్డు వివరాలు తదితర సమాచారాన్ని తప్పులు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలన్నారు.దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించరాదని,ప్రతి వివరాన్ని క్షుణ్ణంగా ధ్రువీకరించుకోవాలని ఆదేశించారు.పథకానికి సంబంధించి ఏవైనా సందేహాలు ఉంటే వెంట నే ఉన్నతాధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని, నమోదు ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లకు అస్కారం లేకుండా బాధ్యతాయుతంగా విధు లు నిర్వహించాలని స్పష్టం చేశారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరేట్ నుంచి సిపిఒ గంగారెడ్డి, ఇడిఎం నదీం,అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

కుంటాల జలపాతానికి దారి కనిపించేనా?

ప్రజాపక్షం/నేరడిగొండ: ఆదిలాబాద్ జిల్లాలోని ప్రముఖ పర్యాటక కేంద్రాలైన కుంటాల, పొచ్చెర జలపాతాలకు వెళ్లేదారి తెలియక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి వెంట ఉన్న సూచిక బోర్డులు పెయింట్ ఊడిపోయి అక్షరాలు కనిపించక పోవడంతో దారి తప్పి కిలోమీటర్ల మేర వెతకాల్సి వస్తోందని వాపోతున్నారు. అటవీ, పర్యాటక శాఖ అధికారులు స్పందించి వెంటనే నూతన సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని పర్యాటకులు కోరుతున్నారు.



సమాచార హక్కు చట్టంపై అధికారులకు శిక్షణ



ప్రజాపక్షం / మెదక్ : ప్రభుత్వ పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించేందుకు సమాచార హక్కు చట్టంపై అధికారులకు అవగాహన కల్పిస్తున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ తెలిపారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులకు రెండు రోజుల ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటిరోజు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం సామాన్య పౌరులకు ఎంతో శక్తివంతమైన హక్కు అని పేర్కొన్నారు. దరఖాస్తుదారులు కోరిన సమాచారాన్ని చట్ట నిబంధనల ప్రకారం నిర్ణీత గడువులోగా ఖచ్చితత్వంతో అందించాలని అధికారులకు సూచించారు. సాధారణ సమాచారాన్ని 30 రోజుల్లోగా, ప్రాణం లేదా వ్యక్తిగత స్వేచ్ఛకు సంబంధించిన సమాచారాన్ని 48 గంటల్లోగా అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంసిఆర్‌హెచ్‌ఆర్‌డి ప్రతినిధి శంకర్‌తో పాటు వివిధ ప్రభుత్వ శాఖల పౌర సమాచార అధికారులు, సహాయ పౌర సమాచార అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బిసిల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని వినతి

ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ : రాష్ట్ర ప్రభుత్వం బిసిల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని జాతీయ బిసి హక్కుల పోరాట సమితి నాయకులు మంగళవారం మంచిర్యాల జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆ వినతిపత్రంలో పలు డిమాండ్లను చేశారు. నామినేటెడ్ పదవులలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పిస్తు చట్టం చేయాలని, బిసిల సామాజిక రక్షణ భద్రతకై బిసి యాక్టు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎంబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, లక్ష కోట్లతో బిసి సబ్ ప్లాన్ ఏర్పాటు చేయాలని, స్థానిక సంస్థల బిసి రిజర్వేషన్లను ఎబిసిడి గ్రూపులుగా వర్గీకరించాలని కాంటాక్టు పారిశ్రామిక రంగాలలో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు శాఖపురి భీంసేన్, జిల్లా కార్యదర్శి పెద్దన్న, చంద్రకాంత్, ఎండి లతీఫ్, చలిమల అంజయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సామాజిక భద్రతే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి దామోదర్ రాజనర్సింహా



ప్రజాపక్షం/సంగారెడ్డి : సమాజంలోని ప్రతి కుటుంబానికి సామాజిక భద్రత కల్పించడం నాణ్యమైన విద్య మెరుగైన వైద్య సేవలు అందించడం ద్వారా ప్రజల జీవన ప్రమానాలను పెంపొందించడమే ప్రజా ప్రభుత్వ ప్రదాన లక్ష్యమని రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సామాజిక భద్రత కల్పించాలనే సంకల్పంతో ప్రభుత్వం చేయూత ఫించన్లను మంజూరు చేస్తోందని తెలిపారు. సోమవారం సంగారెడ్డి ఎక్స్ రోడ్‌లోని పీఎస్ గార్డెన్స్‌లో నిర్వహించిన సంగారెడ్డి నియోజకవర్గస్థాయి నూతన చేయూత పింఛన్ల మంజూరి పత్రాల పంపిణీ కార్యక్రమానికి మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్థానిక ప్రజాప్రతినిధులు, కలెక్టర్ జైన్‌తో కలసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంబించారు. సంగారెడ్డి, సదాశివపేట మున్సిపాలిటీలతో పాటు కంది, కొండాపూర్, సదాశివపేట, సంగారెడ్డి మండలాలకు చెందిన నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కొత్తగా 4.50 లక్షల చేయూత పింఛన్లను ప్రభుత్వం మంజూరు చేసిందని తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో 18,591 నూతన పింఛన్లు మంజూరు కాగా సంగారెడ్డి నియోజవర్గంలో 3,917 మందికి పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు, ఒంటరి మహిళలు, కల్లుగీత చేనేత కార్మికులకు చేయూత పింఛన్లు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు గౌరవప్రదమైన జీవనానికి అండగా నిలుస్తాయని పేర్కొన్నారు. నూతనంగా పించన్లు మంజూరైన లబ్ధిదారులు బ్యాంకు ఖాతాల్లో ఈనెల 19 వ తేదీన పింఛన్ నగదు జమ చేస్తున్నట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం మరింత బలోపేతం కావాలన్నా సమాజంలో జవాబుదారీతనం పెరగాలన్నా ప్రతి పౌరుడికి విద్య ఎంతో అవసరమని మంత్రి అన్నారు. సంగారెడ్డి వైద్య కళాశాలలకు 18 పీజీ సీట్లు మంజూరయ్యాయని సంగారెడ్డి, అందోల్, ప్రాంతాల్లో నర్సింగ్ కళాశాలలను ఏర్పాటు చేశామని తెలిపారు. జిల్లాలోని ప్రజలకు అవసరమైన వైద్య చికిత్సల్లో 90 శాతం వరకు జిల్లా పరిధిలోనే అందుబాటులోకి తీసుకురావాలన్నది ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఏ ఒక్క పౌరుడు వైద్య సామాజిక భద్రత విషయంలో అభద్రతకు గురికాకుండా అవసరమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

మహిళా సాధికారతకు విద్యే పునాది

మహిళలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధించి స్వయంసమృద్ధి దిశగా ఎదగాలని మంత్రి పిలుపు నిచ్చారు. ఆడపిల్లలకు ఉన్నత విద్యతో పాటు నైపుణ్య ఆదారిత విద్యను ఆందించాలని పోటీ ప్రపంచంలో ఆత్మవిశ్వాసంతో పాటు రాణించేలా వారిని తీర్చిదిద్దాలని తల్లిదండులకు సూచించారు. సమానత్వ భావనతో మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగేందుకు ప్రభుత్వం ప్రోత్సహం అందిస్తుందని తెలిపారు. అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నామని మంత్రి తెలిపారు. జిల్లాలో ప్రతి నియోజకవర్గానికి సుమారు 5 వేల ఇళ్లను కేటాయించినట్లు వెల్లడించారు. అద్దె ఇళ్లలో నివసిస్తున్న పేద కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు, అందేలా చర్యలు తీసుకుంటామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ప్రతీక్‌జైన్, శాసనసభ్యులు చింతా ప్రబాకర్, టిజిఐఐసి మాజీ చైర్‌పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంజయ్య, సంగారెడ్డి, సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్లు, కూన వనిత, అంజమ్మ, అదనపు కలెక్టర్ పాండు,ఆర్‌డిఒ రాజేందర్, డిఆర్‌డిఎ ఎపిడి సూర్యారావు, సంగారెడ్డి మున్సిపల్ కమిషనర్, శ్రీనివాస్ రెడ్డి, సదాశివరెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఆయా మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఒలు, సర్పంచ్‌లు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి అండగా ఎమ్మెల్యే వేముల

ప్రజాపక్షం/బాల్కొండ : బాల్కొండ మండల కేంద్రానికి చెందిన మహ్మద్ ఖాజా వెన్నెముక సంబంధిత అనారోగ్యంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయన వైద్య చికిత్స నిమిత్తం మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి రూ.2 లక్షల ఎల్‌ఒసి మంజూరు చేయించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తన నివాసంలో మహ్మద్ ఖాజా కుటుంబ సభ్యులకు ఎల్‌ఒసి మంజూరు పత్రం కాపీని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అందజేశారు. ఈ సందర్భంగా మహ్మద్ ఖాజా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న తమలాంటి పేద కుటంబానికి వైద్య చికిత్స కోసం రూ.2 లక్షల ఎల్‌ఒసి మంజూరు చేయించి అండగా నిలిచిన ఎమ్మెల్యే వేములకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అభివృద్ధికి కేరాఫ్ కాంగ్రెస్ ప్రభుత్వం

ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



ప్రజాపక్షం/రామాయంపేట: అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. మంగళవారం పట్టణంలోని బాలాజీ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన పింఛన్ పత్రాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అథితిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్ పత్రాలను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి కేవలం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టం చేశారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కుంటుపడిన అభివృద్ధి కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మెరుగుపడిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు, సన్నబియ్యం, ఏకకాలంలో రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు బందు, కొత్త పింఛన్లు అమలు చేస్తున్నట్లు ప్రకటించారు. రామాయంపేట పరిసర ప్రాంతాల విద్యార్థుల కోసం 25 ఎకరాల్లో రూ.2పందల కోట్లతో యంగ్ ఇండియా స్కూల్ ఇలా చెప్పుకుంటూ పోతే అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. అంతకు ముందు మున్సిపల్ చైర్‌పర్సన్ గజవాడ లావణ్య నాగరాజు మాట్లాడుతూ రామాయంపేట అభివృద్ధికి మరో రూ.వంద కోట్ల నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బండారి మహేందర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మెన్ పోచమ్మల నవనీత గణేష్,కౌన్సిలర్లు, గజవాడ నాగరాజు, సందీప్, రంజిత్, స్వప్నకుమార్, శ్యామల స్వామి, శంకర్‌గౌడ్, కో అప్షన్ సభ్యులు యాదగిరి, రాధభవాని, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మానె గల్ల రామకిష్టయ్య, సర్పంచ్‌లు వెంకట్‌రామిరెడ్డి, బక్కయ్యగారి యాదగిరి, స్రవంతి రాజేందర్, తార్యానాయక్, గీతాంజలి దానియల్, నవీన్‌గౌడ్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎంపిడిఒ షాజిలోద్దిన్, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి

నేరస్తులకు శిక్షలు పడేలా దర్యాప్తు

ఎస్‌పి జానకి షర్మిల



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : జిల్లాలో నేరాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టడంతో పాటు ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు నిర్వహించి బాధితులకు సత్వర న్యాయం అందించాలని ఎస్‌పి జానకి షర్మిల పోలీస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం నిర్మల్ జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ నేర సమీక్షా సమావేశంలో పోలీస్ స్టేషన్ల పని తీరు, నమోదైన కేసులు, పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణ, ప్రజా భద్రత అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ అండర్ ఇన్వెస్టిగేషన్ కేసుల దర్యాప్తులో జాప్యం లేకుండా చూడాలని,నిందితుల అరెస్టులు పెండింగ్‌లో ఉన్న కేసులను గుర్తించి త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. హత్యలు, ఆస్తి సంబంధిత నేరాలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, ఎస్‌సి, ఎస్‌టి కేసుల దర్యాప్తునకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. దర్యాప్తులో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ఎస్‌పి సూచించారు. గుర్తుతెలియని లింకులను తెరవడం, ఒటిపిలు,బ్యాంకు వివరాలను ఇతరులకు తెలియజేయడం,నకిలీ పెట్టుబడి ఆఫర్ల పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు.సైబర్ మోసానికి గురైన బాధితులు వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయాలని ప్రజలకు తెలియజేయాలన్నారు.గంజాయి,ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిరంతర నిఘా కొనసాగించాలని,ఆస్తి నేరాల నియంత్రణకు బీట్ వ్యవస్థను బలోపేతం చేసి రాత్రి గస్తీని ముమ్మరం చేయాలని అధికారులకు సూచించారు. నేర సమీక్ష అనంతరం ఏ ఆర్ హెడ్‌క్వార్టర్స్‌లోని పోలీస్ వాహనాలను ఎస్‌పి తనిఖీ చేశారు. వాహనాల స్థితిగతులు, నిర్వహణ, అందుబాటులో ఉన్న పరికరాలను పరిశీలించారు.వాహనాలను ఎల్లప్పుడూ విధులకు సిద్ధంగా ఉంచాలని, అవసరమైన మరమ్మతులను చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో భైంసా ఎఎస్‌పి సాయి కిరణ్, నిర్మల్ డి ఎస్‌పి శ్రీనివాస్,జిల్లాలోని సిఐలు,ఎస్‌ఐలు,సైబర్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్,సైబర్ క్రైమ్ యూనిట్, ఐటి కోర్, సిసిటిఎన్ఎస్, సిసిటివి, ఫింగర్ ప్రింట్ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'మిషన్ సంకల్ప'పై అవగాహన

సిపి సాయి చైతన్య



ప్రజాపక్షం / నిజామాబాద్ అర్బన్ : జిల్లాలో ఏడాదికి రోడ్డు ప్రమాదాల్లో 340 మంది చనిపోతున్నారని, ప్రతి విద్యా సంస్థలో డ్రగ్స్, సైబర్, మహిళా భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అన్నారు. మైనర్ డ్రైవింగ్‌పై జిల్లాలోని పాఠశాలలు, కళాశాలలు, మెడికల్ కళాశాలల్లో డ్రగ్స్, సైబర్ నేరాలు, రోడ్డు ప్రమాదాలు, మహిళల భద్రతపై మిషన్ సంకల్ప్ పేరుతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కమిషనరేట్ మిని కాన్ఫరెన్సు హాల్‌లో నిజామాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన మిషన్ సంకల్ప కార్యక్రమానికి సిపి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యా సంస్థల ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులతో భవిష్యత్తు కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా డ్రగ్స్ సైబర్ నేరాలు మైనర్ డ్రైవింగ్ తదితర అంశాలపై చర్చించారు. డ్రగ్స్ నుంచి యువతను కాపాడాలి. డ్రగ్స్‌వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్ఫరిణామాలపై ప్రతి విద్యాసంస్థలో అవగాహన సదస్సులు నిర్వహించాలి. ఈవ్ టీజింగ్ వేధింపులు, షీటీమ్స్ సేవలపై అవగాహన కల్పించాలని, మహిళలు నిర్భయంగా చదువుకునే, ఉద్యోగం చేసుకునే వాతావరణం కల్పించాలన్నారు. ప్రతివారం ఒక రోజు ప్రత్యేకంగా మైనర్ డ్రైవింగ్‌పై తనిఖీలు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, తల్లిదండ్రులు మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు.ప్రతి విద్యాసంస్థ ప్రధాన ద్వారం వద్ద డ్రగ్స్, సైబర్ రోడ్డు భద్రత, మహిళల రక్షణ పోస్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కార్యక్రమంలో అదనపు డిసిపి ఎన్.శుభం ప్రకాష్, తెలంగాణ యూనివర్సిటీ రిజిస్ట్రార్ యాదగిరి, గిరిరాజ్ కళాశాల ప్రిన్సిపాల్ పి. రామ్మోహన్ రెడ్డి, ఎన్ఎస్‌సి జనరల్ సెక్రెటరీ డా. కవితారెడ్డి, ట్రాఫిక్ ఎసిపి ప్రకాష్, ఎసిపి మస్తాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

కన్నీటి మంటల్లో కర్షకుడి కష్టం

సాగునీరు లేక ఎండిన వరి పొలాలు

కన్నబిడ్డలా పెంచిన పైరుకు నిప్పు పెట్టిన అన్నదాతలు



ప్రజాపక్షం / దండేపల్లి/ మంచిర్యాల: పచ్చని పైరుతో కళకళలాడాల్సిన పొలం బీటలు వారింది. కంకి వేసి గింజ పట్టాల్సిన వరి కర్రలు నీటి తడి లేక నిలువునా ఎండిపోయాయి. ఆరుగాలం చెమటోడ్చి, అప్పుల భారాన్ని భుజాన వేసుకుని కంటికి రెప్పలా కాపాడుకున్న పంట కళ్లముందే కాలిబూడిదవుతుంటే ఆ రైతుల గుండె పగిలింది. చేతికొచ్చే దశలో పంట ఎండిపోవడాన్ని తట్టుకోలేని అన్నదాతలు, తమ చేతులతో తామే ఆ పైరుకు నిప్పు పెట్టి కన్నీటి చితి పేర్చారు. దండేపల్లి మండలం నర్సాపూర్ గ్రామంలో మంగళవారం ఆవిష్కృతమైన ఈ విషాద దృశ్యం చూపరుల హృదయాలను కలచి వేసింది. వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న నర్సాపూర్ గ్రామానికి చెందిన సిరిపురం మల్లిఖార్జున్, సిరిపురం తిరుపతి, గొల్లపెల్లి సత్తయ్య, తోట్ల సత్తయ్య ఎంతో ఆశతో వరి సాగు చేపట్టారు. నాట్లు వేసిన నాటి నుంచి పంటను కన్నబిడ్డలా చూసుకున్నారు. ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చుల కోసం తెలిసిన చోటల్లా అప్పులు చేసి పెట్టుబడి పెట్టారు. పంట ఏపుగా పెరుగుతుండటంతో ఈసారి తమ కష్టాలు తీరుతాయని కలలు కన్నారు. అంతా సవ్యంగా సాగుతుందనుకున్న తరుణంలో సాగునీటి రూపంలో విధి వెక్కిరించింది. పంట కీలక దశకు చేరుకున్న సమయంలో నీరు అందక పొలాలు పూర్తిగా నెర్రెలు బారాయి. పచ్చగా ఉండాల్సిన చేలు పసుపుపచ్చగా మారి నిలువునా ఎండిపోయాయి. పంటను కాపాడుకునేందుకు ఆ నలుగురు రైతులు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. కళ్లముందే పంట ఎండిపోతుండటం, మరోవైపు తెచ్చిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక వారి మనసు వికలమైంది. ఇక చేసేదేమీ లేక తీవ్ర మనస్తాపంతో ఎండిన వరి పొలాలకు నిప్పు పెట్టి తమ ఆక్రోశాన్ని వెళ్లగక్కారు. కష్టపడి పెంచిన పంటను కళ్లముందే కాల్చుకోవాల్సిన దుస్థితి రావడం అక్కడి వారందరినీ కంటతడి పెట్టించింది.

ప్రభుత్వమే ఆదుకోవాలి

సాగునీటి కోసం తాము పడుతున్న గోసను పట్టించుకునే నాథుడే కరువయ్యారని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు కళ్లు తెరిచి గ్రామంలో నెలకొన్న సాగునీటి సమస్యను తక్షణమే పరిష్కరించాలని కోరుతున్నారు. చేతికొచ్చే పంటను కోల్పోయి అప్పుల ఊబిలో కూరుకుపోయిన తమను ప్రభుత్వం ఆదుకుని, పంట నష్ట పరిహారం అందించాలని సిరిపురం మల్లిఖార్జున్, సిరిపురం తిరుపతి, గొల్లపెల్లి సత్తయ్య, తోట్ల సత్తయ్య వేడుకుంటున్నారు.

ఇందిరమ్మ టవర్స్‌కు విశేష స్పందన

కలెక్టర్ ఇలా త్రిపాఠి



ప్రజాపక్షం/నిజామాబాద్ : నగరంలోని నాగారం ప్రాంతం ఆర్‌జికె కాలనీలో తెలంగాణ హౌసింగ్ బోర్డు ఆధ్వర్యంలో నిర్మించనున్న ఇందిరమ్మ టవర్స్‌లో ఫ్లాట్ల కేటాయింపు కోసం ప్రభుత్వం చేపట్టిన దరఖాస్తుల స్వీకరణకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని కలెక్టర్ ఇలా త్రిపాఠి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పాలక సంస్థ పరిధిలో నివసిస్తున్న అర్హులైన నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు అందుబాటు ధరలో స్వంత ఇంటిని కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని గుర్తు చేశారు. నగరంలోని ఆర్‌జికె కాలనీలో 480 ఫ్లాట్ల కేటాయింపునకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నామన్నారు. ప్రతి ఫ్లాట్ రిజిస్ట్రేషన్ 512 చ।। అడుగులు కాగా ఒక్కో ఫ్లాట్‌పై ప్రభుత్వం రూ.5 లక్షల సబ్సిడీ అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వ సబ్సిడీ మినహాయించి లబ్ధిదారుడి వాటాగా తాత్కాలికంగా రూ.3.50 లక్షలు నిర్ణయించబడిందని, ఫ్లాట్ల నిర్మాణానికి అవసరమైన స్థలం ఖర్చును ప్రభుత్వమే భరిస్తుందని వివరించారు. అర్హత కలిగిన దరఖాస్తుదారులను ముందుగా ఐడి వెరిఫికేషన్ ద్వారా గుర్తించి అనంతరం లాటరీ విధానంలో ఫ్లాట్ల కేటాయింపు చేపడుతామని కలెక్టర్ తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో సొంత ఇల్లు లేదా ప్లాటు లేని వారు, కుటుంబ వార్షిక ఆదాయం రూ. 6లక్షలకు మించని వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఒక కుటుంబం నుంచి ఒకే దరఖాస్తుకు అవకాశముంటుందని తెలిపారు. ఇప్పటివరకు దరఖాస్తు చేసుకుని అర్హులైన నగర ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డిసెంబర్ 5 లోగా మీ సేవా కేంద్రాల ద్వారా లేదా అధికారిక మీ సేవా వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి: పోలీసులు



ప్రజాపక్షం /దిలావర్ పూర్ : మండలంలోని కంజర్ గ్రామంలో డ్రగ్స్ దుష్ప్రభావాలపై గ్రామ ప్రజలకు పోలీసులు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్యంపై పడే దుష్ప్రభావాలు,భవిష్యత్తుపై వాటి ప్రభావం గురించి వివరించారు.ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు డ్రగ్స్‌కు సంబంధించిన చట్టపరమైన అంశాలను తెలియజేస్తూ,మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు.సమాజంలో డ్రగ్స్ రహిత వాతావరణం ఏర్పడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని,డ్రగ్స్‌కు సంబంధించిన సమాచార

చెడు అలవాట్లకు దూరం

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి దేవిమానస



ప్రజాపక్షం/ ఖమ్మంఅర్బన్: చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి పి. దేవిమానస విద్యార్థులకు తెలిపారు. మంగళవారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డాన్ (డ్రగ్ అవేర్‌నెస్ అండ్ వెల్‌నెస్ నావిగేషన్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరంలోని రోటరీ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి దేవిమానస మాట్లాడుతూ విద్యార్థులు, బాలల హక్కులు, రక్షణ చట్టాలపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక అనర్థాల గురించి విద్యార్థులకు వివరించారు. విద్యార్థి దశ నుంచే చెడు అలవాట్లు, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవర్చుకోవాలన్నారు. డ్రగ్స్‌కు నో చెప్పండి ఉజ్వల భవిష్యత్తుకు ఎస్ చెప్పండి అని విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్య రద్దు ఆలోచనను విరమించుకోవాలి

ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మనోజ్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : ఇంటర్మీడియట్ విద్యా వ్యవస్థను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బురా మనోజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గిరిప్రసాద్ భవన్‌లో ఎఐఎస్ఎఫ్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బురా మనోజ్ పాల్గొని మాట్లాడుతూ రాష్ట్రంలో దశాబ్దాలుగా కొనసాగుతున్న ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని రద్దు చేసి పాఠశాల విద్యాశాఖలో విలీనం చేయడమంటే పేద విద్యార్థులను విద్యకు దూరం చేయడమేనని ఆయన తెలిపారు. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాల విద్యలో అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ఇంటర్ విద్య రద్దుపై హడావుడి నిర్ణయాలతో ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలహీనపర్చవద్దని కోరారు. ఇంటర్ విద్య రద్దుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వడంతో పాటు విద్యార్థులకు, అధ్యాపకుల భవిష్యత్తులకు భరోసా ఇవ్వాలన్నారు. జాతీయ విద్యా విధానం పేరుతో విద్యా కేంద్రీకరణ, కార్పొరేటీకరణ, ప్రైవేటీకరణను ప్రోత్సహించవద్దన్నారు. ఇంటర్ విద్యా వ్యవస్థ రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి శివానాయక్, జిల్లా నాయకులు పవన్, హేమంత్, గోపి, నరేందర్, సురేష్, పాల్గొన్నారు.

అర్హులైన పేద కుటుంబానికి సంక్షేమ పథకాలే లక్ష్యం: పాయం



ప్రజాపక్షం/బూర్గంపాడు: అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని పినపాక ఎంఎల్ఏ, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఎంపిడిఒ జమలారెడ్డి అధ్యక్షతన మంగళవారం నిర్వహించిన నూతన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొని లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. గత పదేళ్లుగా పెన్షన్లకు నోచుకోని అర్హులకు నేడు మంజూరు కావడం సంతోషకరమని, మండల వ్యాప్తంగా 846 మందికి కొత్తగా పెన్షన్లు మంజూరయ్యాయని తెలిపారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు పెన్షన్లు ఆర్థిక భరోసా కల్పిస్తాయని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంత, రాజకీయ భేదాలు లేకుండా అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో 11 మందికి జైలు శిక్ష

ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 11 మందికి జైలు శిక్షవిధించడంతో పాటు మరో 31 మందితో కలిపి మొత్తంగా రూ.70వేల జరిమానాను దమ్మపేట జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ భవాని తీర్పు వెలువరిచారు. వివరాల ప్రకారం అశ్వారావుపేట పోలీస్ సర్కిల్ పరిధిలో మధ్యం సేవించి వాహనాలు నడుపుతూ పలువురు పట్టుబడ్డారు. ఈ వ్యవహారంలో మొత్తం 42 మందికి న్యాయస్థానం శిక్షలు విధించగా 11 మందికి జైలు శిక్ష, మరో 31 మందికి జరిమానా వేశారు. జైలు శిక్ష పడిన 11 మందిలో ఏడుగురికి మూడు రోజుల చొప్పున మరో నలుగురికి రెండు రోజుల చొప్పున శిక్ష పడింది. జరిమానా పడ్డ 31 మందిలో ఎనిమిది మందిలో ఒక్కొక్కరికి రూ.3వేల చొప్పున మరో 23 మందిలో ఒక్కొక్కరికి రూ.2వేల చొప్పున జరిమాన పడింది. మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరిత్యా నేరమని అలా వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటాయని తద్వారా అమాయకుల ప్రాణాలు బలైపోతాయని చెప్పారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

హామీల అమలులో కాంగ్రెస్ వైఫల్యం

బిఆర్ఎస్ నేతలు వెంకటవీరయ్య, కమల్ రాజ్

ప్రజాపక్షం/ ఖమ్మం : హామీల అమలులో కాంగ్రెస్ పార్టీ ఘోరంగా వైఫల్యం చెందిందని కనీసం పది శాతం హామీలను కూడా అమలు చేయలేకపోయిందని మాజీ శాసన సభ్యులు సండ్ర వెంకటవీరయ్య, జెడ్పి మాజీ ఛైర్మన్ కమల్‌రాజులు తెలిపారు. 120 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలతో అరచేతిలో స్వర్గం చూపిందని వారు ఆరోపించారు. మంగళవారం బిఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఎకరాకు రూ. 15వేల రైతు భరోసా, రూ. 500లకే గ్యాస్ సిలెండర్, ఉచిత కరెంటు వంటి ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదన్నారు. ఇచ్చిన హామీలను సంపూర్ణంగా అమలు చేయడానికి ప్రయత్నించాలన్నారు. మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నాయకులు బెల్లం వేణుగోపాల్, పగడాల నాగరాజు, ముత్యాల సత్యనారాయణ, పోట్ల శ్రీనివాస్, మంకెన రమేష్ పాల్గొన్నారు.

ధనార్జనే ధ్యేయంగా వైద్య సేవలు



- కనీస నిబంధనలు పాటించని ఆసుపత్రులు
- పట్టించుకోని వైద్య ఆరోగ్యశాఖ
- వసతులకు మంగళం... రోగులను పీల్చిపిప్పి చేయడమే లక్ష్యం
- వైద్య ఆరోగ్య శాఖ తీరుపై ప్రజల్లో అసంతృప్తి, ఆవేదన

ప్రజాపక్షం/ ఖమ్మం : ఖమ్మం వైద్య హబ్‌గా తయారైంది. హైదరాబాద్ మహా నగరం తర్వాత ఆ స్థాయిలో ఖమ్మం ఆసుపత్రులు వైద్య సేవలు అందిస్తున్నాయి. అనేక మంది నిపుణులు వివిధ రోగాలకు సంబంధించి అత్యుత్తమ వైద్యాన్ని అందిస్తూ రోగుల ప్రాణాలు కాపాడుతున్నారు. ఇదే సమయంలో వైద్యాన్ని వ్యాపారంగా మలుచుకుని దోపిడీకి పాల్పడడం ద్వారా మొత్తం వైద్య రంగానికి కళంకం తీసుకు వస్తున్నారు. వైద్యంతో పాటు సేవా రంగాల్లోనూ తాము ముందు వరుసలో ఉంటామంటూ పలువురు వైద్యులు సామాజిక సేవలు అందిస్తున్నారు. కానీ అతి కొద్ది మంది వ్యవహరిస్తున్న తీరు మొత్తం వ్యవస్థను భ్రష్టు పట్టించడమే గాక ఆసుప్రతికి వెళ్లి వైద్యం చేయించుకోవాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. వైద్య ఆరోగ్యశాఖ ఏ రోజైనా ఒక ప్రైవేటు ఆసుపత్రిని సందర్శించి రోగికి వచ్చిన జబ్బు ఏమిటి ఆ ఆసుపత్రి అందించిన వైద్యం ఏమిటి రాసిన వైద్య పరీక్షలు ఏమిటి అందుకు వసూళ్లు చేసింది ఎంత అన్న దానిపై కనీస విచారణ లేదు. వైద్య ఆరోగ్యశాఖ కూడా ప్రైవేటు ఆసుపత్రుల యాజమాన్యాల చేతిలో కీలుబొమ్మగా మారింది. వసతులు లేని ఆసుపత్రుల్లో వసతుల కోసం ఏమైనా చర్యలు తీసుకున్నారా అంటే అది లేదు. ఎల్లప్పుడు మామూళ్ల మత్తులో జోగే ఫైర్ సేఫ్టీ అధికారులు ఆసుపత్రిని కనీసం పరిశీలించకుండానే ఫైర్ సేఫ్టీ ధృవీకరణ ఇచ్చేస్తున్నారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. ఇప్పటికే పలు నగరాల్లో అగ్ని ప్రమాదాలతో బహుళ అంతస్తుల భవనాల్లో, ఆసుపత్రుల్లో పలువురు ప్రాణాలు కోల్పోతున్న అధికారుల్లో మాత్రం చలనం ఉండడం లేదు.

తీరు మార్చుకోని వైద్య ఆరోగ్యశాఖ :

ఖమ్మం ఆసుపత్రిలో రోగులు ప్రాణాలు కోల్పోవడం వారి బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రుల ముందు ఆందోళన చేయడం పరిపాటిగా మారింది. ఆందోళన ప్రారంభం కాగానే తొలుత పోలీసులు ఆ తర్వాత సెటిల్‌మెంట్ బ్యాచ్‌లు రంగంలోకి దిగడం, రోగి బంధువులకు ఎంత, పోలీసులకు ఎంత, సెటిల్‌మెంట్ బ్యాచ్‌కు ఎంత అన్నది నిర్ణయిస్తూ మొత్తం వ్యవహారాన్ని తప్పుదారి పట్టిస్తున్నారు. చాలా సందర్భాల్లో రోగికి ఇచ్చారు సరే మా సంగతేంటి అని సెటిల్‌మెంట్ బ్యాచ్‌లు యాజమాన్యాలను బెదిరించడంతో పాటు రోగుల బంధువులకు సమస్యలు సృష్టించిన సందర్భాలు అనేకం. ఎక్కడో ఒక చోట ఇటువంటి ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. వైద్యం వికటించి ప్రాణాలు కోల్పోవడమో లేక సరైన వైద్యాన్ని సకాలంలో అందించలేకపోవడం వల్లనో ఇటువంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. కొన్ని సందర్భాలలో ప్రాణాలు పోతాయని తెలిసినా కాసుల కోసం ఆసుపత్రుల్లో చేర్చుకోవడం కొన్ని గంటలు, రోజులు వైద్యం అందించినట్లు భ్రమింపజేసి డబ్బులు గుంజే ప్రయత్నంలో కూడా ఇటువంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఇటువంటి ఆసుపత్రులపై చర్యలు తీసుకోకపోవడం ఇరు వర్గాలు రాజీపడ్డాయి మాకెందుకు అన్న ధోరణిలో అటు పోలీసులు, ఇటు వైద్య ఆరోగ్యశాఖ వ్యవహరించడం ఈ పరిస్థితికి కారణమవుతుంది. మారిన ఆహారపు అలవాట్లు, వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో పెరిగిన అనారోగ్య పరిస్థితులను సొమ్ము చేసుకుంటున్న ఈ ఆసుపత్రులపై చర్యలు తీసుకోక పోతే మూడొంతుల సంపాదన వైద్యానికే ఖర్చయే పరిస్థితి. సూపరింటెండెంట్ల పర్యవేక్షణలో ఉన్న వైద్య ఆరోగ్యశాఖ ఇప్పటికైనా మత్తు వీడి అక్రమ పద్ధతుల్లో ధనార్జనే ధ్యేయంగా వ్యవహరిస్తున్న ఆసుపత్రులపై ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. వైద్య ఆరోగ్యశాఖ పనితీరుపై తీవ్ర ఆవేదన, అసంతృప్తిని ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. దానిని సరిదిద్దుకోవాల్సిన బాధ్యత ఆ శాఖాధికారులదే.

రవికుమార్‌కు సిపిఐ ఘననివాళి



ప్రజాపక్షం/బోనకల్: మండలంలోని రాపల్లి గ్రామానికి చెందిన సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు, గ్రామీణ వైద్యులు ఏనుగు రవికుమార్(45) మంగళవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహాన్ని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు తోల రామాంజనేయులు, ఏనుగు గాంధీలు పార్టీ పతాకాన్ని కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రవికుమార్ మృతి పార్టీకి, గ్రామానికి తీరని లోటని అన్నారు. ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకునిగా, పార్టీ మండల కార్యవర్గ సభ్యునిగా కీలక పాత్ర పోషించరన్నారు. నివాళులర్పించిన వారిలో మాజీ ఎంపిటిసి, సిపిఐ సీనియర్ నాయకులు కొంగర రామారావు, మండల కార్యవర్గ సభ్యులు కొంగర కృష్ణయ్య, బ్రాహ్మణపల్లి ఉపసర్పంచ్ ఏలూరి రమేష్, సిపిఎం మండల నాయకులు రాఘవరావు, సిపిఐ గ్రామ శాఖ కార్యదర్శి ఏనుగు కృష్ణయ్య, తోట నాగకృష్ణ, ఆకెన పవన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏనుగు జనార్ధన్, బ్రాహ్మణపల్లి పిఏసిఎస్ చైర్మన ఏనుగు నాగేశ్వరరావు, స్వాతంత్ర సమరయోధులు ఏనుగు జానయ్య, పిఏసిఎస్ సిఈఓ నారగాని వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

ఇందిరమ్మ బీమా అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు

- అర్హులైన ప్రతి కుటుంబానికీ రూ.5లక్షల జీవిత బీమా
- రేషన్ కార్డు లేకున్నా నమోదుకు అవకాశం
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ దివాకర టిఎస్



ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు ఖమ్మం జిల్లాలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. ఈ పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి ఐదు లక్షల జీవిత బీమా భద్రత లభిస్తుందన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ పి. శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నవంబర్ 19 నుంచి నెల రోజుల పాటు జిల్లాలో ప్రతి గ్రామం, మున్సిపల్ వార్డులలో ప్రత్యేక క్యాంపులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రతి జనవాసంలో వారం రోజుల పాటు కొనసాగేలా, ప్రతి బృందం కనీసం నాలుగు క్యాంపులు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. ప్రతి క్యాంపులో 200 మంది వేచి ఉండేలా టెంట్లు, కుర్చీలు, తాగునీరు, విద్యుత్, ఇంటర్నెట్ సౌకర్యాలతో పాటు ఐదు కౌంటర్లు, ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. డప్పు చాటింపు ప్రజాప్రతినిధుల ద్వారా క్యాంపుల తేదీలపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి (18 నుంచి 59 ఏళ్ల వయస్సు) పేరిట ఈ బీమా వర్తిస్తుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి రోజు సాయంత్రం 4.30 గంటల లోపు నమోదు వివరాల నివేదికను సమర్పించాలని ఆదేశించారు.

ఖేలో ఇండియా యూత్ గేమ్స్‌కు ఏర్పాట్లు

సర్దార్ పటేల్ స్టేడియాన్ని పరిశీలించిన కలెక్టర్

ఎనిమిదవ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ నిర్వహణకు సర్దార్ పటేల్ స్టేడియంలో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ దివాకర టిఎస్ అదనపు కలెక్టర్ డా।। పి.శ్రీజ, ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న అభివృద్ధి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రూ. 3.12 కోట్ల వ్యయంతో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ప్రధాన భవనం ప్రవేశ ద్వారం నుంచి మెయిన్ గేటు వరకు బిటి రోడ్డు నిర్మాణం, వాకింగ్ ట్రాక్ లెవలింగ్, పార్కింగ్ ప్రాంతంలో చిప్స్ వేయడం, స్టేడియం ప్రాంగణంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అథ్లెట్లు, కార్యాలయ గదులకు పెయింటింగ్, తలుపులు, కిటికీల అమరిక, ఎలక్ట్రిక్ పనులు, టాయిలెట్ మరమ్మతులు, గీజర్ల ఏర్పాటుతో సిటింగ్ గ్యాలరీల వద్ద షెడ్లు నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఓ సునీల్‌కుమార్, మున్సిపల్ ఈఈ కృష్ణలాల్, హార్టికల్చర్ అధికారిణి అనితశ్రీ, నాగజ్యోతి, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ జయచందర్ పాల్గొన్నారు.

ఏళ్లనాటి ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం

- కూనంనేని సమన్వయంతో రైల్వే భూముల అప్పగింత పూర్తి
- ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి
- కొత్తగూడాన్ని ఆధునిక వ్యాపార కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- మేయర్ మూడ్ గణేష్
- రాకపోకలు సులభతరం
- ఎస్‌కే సాబీర్ పాషా



ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం/చుంచుపల్లి: కొత్తగూడెం పట్టణంలోని హేమచంద్రాపురం రోడ్డు విస్తరణకు అవసరమైన రైల్వే భూముల అప్పగింత ప్రక్రియ ఎట్టకేలకు పూర్తయింది. సుమారు 15 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్య పరిష్కారానికి కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు సహకారంతో ఎంపి రామసహాయం రఘురామిరెడ్డి మంగళవారం కొత్తగూడెం రైల్వేస్టేషన్ వద్ద సుమారు 5500 చదరపు గజాల రైల్వే భూమిని రెవెన్యూ శాఖకు అప్పగించారు. దీనికి ప్రతిగా ఖమ్మంలో రాష్ట్రప్రభుత్వానికి చెందిన 4500 చదరపు గజాల భూమిని రైల్వేశాఖకు కేటాయించారు. ఈ రోడ్డు విస్తరణతో రైల్వేస్టేషన్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యను తగ్గి రాకపోకలకు సులభతరం కానుంది. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎంపి మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ రైల్వే అధికారులు జిల్లా యంత్రాంగం సహకారంతో ఎంఎల్ఏ కూనంనేని ప్రత్యేక చొరవతో సమస్య పరిష్కరం అయిందన్నారు. అనంతరం మేయర్ మూడ్ గణేష్ మాట్లాడుతూ కొత్తగూడెంలోని ఐదు ప్రధాన రహదార్లను అభివృద్ధి చేసి ఆధునిక పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సెంట్రల్ లైటింగ్ రహదారుల విస్తరణ పట్టణ సుందరీకరణకు ప్రాధాన్యతనిస్తున్నట్లు చెప్పారు. అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా మాట్లాడుతూ ఈ రహదారుల అభివృద్ధితో పట్టణంలోని ప్రధాన ప్రాంతాల మధ్య రాకపోకలు సులభతరం అవడంతో పాటు వాణిజ్య కార్యకలాపాలు మరింత విస్తరించేందుకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వేణుగోపాలరావు కొత్తగూడెం ఆర్డిఓ మధు తహసీల్దార్ పుల్లయ్య రైల్వే రీజనల్ ఇంజనీర్ శశాంక్ డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య స్థానిక ప్రజాప్రతినిధులు వివిధ రాజకీయ పార్టీల నాయకులు రైల్వేశాఖ సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

శోధా యాజమాన్యం నిర్లక్ష్యం వీడాలి

ఒబి కార్మికుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలి

సమ్మెను విరమింపజేయడంలో శోధా కంపెనీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరిని వీడాలని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె. సాబీర్ పాషా డిమాండ్ చేశారు. సింగరేణి కొత్తగూడెం ఏరియా పరిధిలోని వెంకటేష్‌ఖని కోల్‌మైన్ (వికెసిఎం) ఓపెన్‌కాస్ట్ ఒబి కాంట్రాక్ట్ కార్మికులు కార్మిక సంఘాల జెఏసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహార దీక్షా శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించి కార్మికులకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో శోధా కంపెనీ యాజమాన్యంతోపాటు సింగరేణి యాజమాన్యం కూడా తగిన చొరవ చూపకపోవడం విచారకరమన్నారు. కార్మికులకు రావాల్సిన బోనస్, పెండింగ్ వేతనాలు, ఇతర చట్టబద్ధమైన హక్కులను వెంటనే కల్పించాలని, విధుల నుంచి తొలగించిన కార్మికులను తిరిగి పనిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికుల సహనాన్ని పరీక్షించకుండా వెంటనే చర్యలు జరిపి సమస్యలను పరిష్కరించాలని సూచించారు. ఒబి కార్మికులు చేస్తున్న న్యాయమైన పోరాటానికి సిపిఐ, ఎఐటియుసి సంపూర్ణ మద్ధతుగా నిలుస్తాయని, కార్మికుల హక్కుల సాధన కోసం నిరంతరం అండగా ఉంటాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మేయర్ మూడ్ గణేష్, కంచర్ల జమలయ్య, ఎఐటియుసి నాయకులు జె.గట్టయ్య, మార్షల్, యూసఫ్, భూక్యా శ్రీను, నేరెళ్ల రమేష్, బండి నర్సింహా, బోయిన విజయ్‌కుమార్, గడ్డం సతీష్, మోహన్, కార్మిక సంఘాల జెఏసి నాయకులు, ఒబి కార్మికులు పాల్గొన్నారు.

లాడ్జీలో యువకుల మధ్య ఘర్షణ

తీవ్ర గాయాలతో ఒకరు మృతి

ప్రజాపక్షం/భద్రాచలం: రామాలయం సమీపంలోని ఓ ప్రైవేటు లాడ్జీలో యువకుల మధ్య చోటు చేసుకున్న ఘర్షణ ఒకరి మరణానికి దారితీసింది. ఈ దాడిలో అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన తెల్లం శరత్ (25)తీవ్రగాయల పాలై మృత్యువాత పడ్డాడు. మృతుని తండ్రి తెల్లం రవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరు యువకులపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం అర్ధరాత్రి పట్టణంలోని ఓ ప్రైవేటు లాడ్జీలో ముగ్గురు యువకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. అది తీవ్ర ఘర్షణకు దారి తీయడంతో యువకులు ఒకరిపై ఒకరు భౌతిక దాడి చేసుకున్నారు. ఈ ఘటనలో శరత్‌కు అత్యంత తీవ్రమైన గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులతో పాటు పోలీసులు అక్కడికి చేరుకుని శరత్‌ను హుటాహుటిన స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే శరత్ మృతి చెందినట్లు ధృవీకరించారు. యువకుని ఆకస్మిక మృతితో అతని స్వగ్రామమైన తొట్టిపంపులో తీవ్ర విషాద ఛాయలు అలుముకున్నాయి. ప్రమేయం ఉంది అనే కోణంలో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

నాటుసారా స్థావరాలపై ఎక్సైజ్ మెరుపుదాడులు

మూడు గ్రామాల్లో దాడులు,

1,200 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం



ప్రజాపక్షం/దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలో నాటుసారా తయారీ స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు మంగళవారం విస్తృత దాడులు నిర్వహించారు. లవిజ్జాపురం, చింతగుప్ప, జిన్నెలగూడెం గ్రామాల్లో చేపట్టిన ఈ దాడుల్లో 20 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని, తయారీకి సిద్ధంగా ఉంచిన 1,200 లీటర్ల చక్కెర పానకాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటనలకు సంబంధించి నాలుగు కేసులు నమోదు చేశారు. ఖమ్మం డిప్యూటీ కమిషనర్ వి సోమిరెడ్డి ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఏ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ నల్లమల శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ దాడులు చేపట్టినట్లు భద్రాచలం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బాదావత్ కృష్ణయ్య తెలిపారు. నాటుసారా తయారీ, విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని ప్రజలను కోరారు. ఈ దాడుల్లో జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఏ శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ సూపరింటెండెంట్ నల్లమల శ్రీనివాస్, భద్రాచలం ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ బి కిష్టయ్య, కొత్తగూడెం జిల్లా టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ పి రమాదేవి, భద్రాచలం ఎస్ఐ ఏ సీతారామరాజు, మణుగూరు ఎస్ఐ ఎం విజయ్‌భాస్కర్, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

సారూ.. ఇదేం తీరు?

వైరా మున్సిపాలిటీ అధికారుల రూటే వేరు

సిఫారసులను పట్టించుకోని ఇంజనీరింగ్ శాఖ



ప్రజాపక్షం/ ఖమ్మం : వైరా మున్సిపాలిటీ అధికారుల రూటే సఫరేటు. ప్రతి రోజు ఏదో ఒక వివాదంలో తలదూర్చడం, రాజకీయ నాయకులను తలదన్నే రీతిలో రాజకీయాలు చేయడం ఇక్కడి అధికారులకు అలవాటే. ఇప్పుడు మున్సిపాలిటీ పరిధిలోని ఇంజనీరింగ్ శాఖ ఆ పాత్రను పోషిస్తుంది. వివిధ వార్డుల్లో పనుల నిమిత్తం వచ్చే ప్రజాప్రతినిధుల సిఫారసులను పట్టించుకోకుండా వారికి అనుకూలమైన వారు, మాజీలు, అధికార పార్టీ నేతలకు ప్రాధాన్యతనిస్తున్నారన్న ఆవేదన ప్రస్తుత కౌన్సిలర్లలో వ్యక్తమవుతుంది. కొందరు కౌన్సిలర్లు చెప్పిన పని కాదని మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగం ఆ వార్డులతో సంబంధం లేని లేదా ఎటువంటి బాధ్యతల్లో లేని వ్యక్తుల మాటలను పరిగణలోకి తీసుకుని పనులను నిలుపుదల చేస్తున్నారు. మున్సిపల్ ఇంజనీరింగ్ శాఖపై గతంలో పలు ఆరోపణలు వచ్చాయి. అయినా వారి వైఖరి మారడం లేదు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రజలు ఎన్నుకున్న కౌన్సిలర్ల సిఫారసులకు విలువ లేకపోతే ఇక కౌన్సిలర్లుగా కొనసాగడం ఎందుకన్న భావన, ఆవేదన కౌన్సిలర్లలో వ్యక్తమవుతుంది. మున్సిపల్ ఛైర్ పర్సన్, ఇతర ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని ఇంజనీరింగ్ శ

దోషులకు బెయిల్‌పై కోర్టు కెళతా: బిల్కిస్ బానో

- బిల్కిస్ బానో కేసులో దోషులకు జీవితఖైదు నిలిపివేయడంపై కాంగ్రెస్ వ్యాఖ్య



న్యూఢిల్లీ: ఇద్దరు నిందితులపై కేసు కొట్టివేసి, బెయిల్ ఇచ్చిన అంశాన్ని కోర్టు తనకు చెప్పలేదని, బెయిల్ మంజూరును కోర్టులోనే సవాల్ చేస్తానని బిల్కిస్ బానో మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. 2002 గుజరాత్ అల్లర్ల సమయంలో బిల్కిస్ బానోపై సామూహిక అత్యాచారం చేశారు. ఆమె కుటుంబంలోని 14 మందిని హత్య చేసిన కేసులో ఇద్దరు దోషులకు సుప్రీంకోర్టు బెయిల్ మంజూరు చేసింది. బిపిన్ చంద్ర జోషి, ప్రదీప్ మోర్ధియాల జీవిత ఖైదు శిక్షను తాత్కాలికంగా నిలిపివేస్తూ జస్టిస్ సుంద్రేశ్, జస్టిస్ వరాలే ధర్మాసనం గత నెల 28న ఉత్తర్వులిచ్చింది. అయితే సోమవారం ఆ ఇద్దరికీ సుప్రీం కోర్టు బెయిల్ మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం బిల్కిస్ బానో ... ఆ నాటి భయాలు మళ్లీ తనకు కలుగుతున్నట్లు చెప్పింది. ఇది నమ్మకలేక పోతున్నానని, రెండోసారి కోర్టు ఆదేశాలు ఇచ్చిందని, తనకు చెప్పకుండా కోర్టు ఈ పనిచేసిందని అన్నారు. ఇన్నాళ్లు పోరాడిన న్యాయం ఇప్పుడు మళ్లీ సడలిపోతున్నట్లు అనిపిస్తోందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. తన కోసం, తన కుటుంబం కోసం, తన పిల్లల కోసం భయం వేస్తోందన్నారు. న్యాయ వ్యవస్థపై నమ్మకం పోతుందన్న భయం కలుగుతుందని బిల్కిస్ అన్నారు. ఆదేశాలు ఇవ్వడానికి ముందు ఎందుకు కోర్టు తన అభిప్రాయాన్ని తెలుసుకోలేదని ఆమె ప్రశ్నించారు.

ముస్లిం మహిళ కావడం వల్లే మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుంది

బిల్కిస్ బానో సామూహిక అత్యాచార కేసులో ఇద్దరు దోషుల జీవిత ఖైదు శిక్షలను సుప్రీంకోర్టు నిలిపివేయడంపై కాంగ్రెస్ స్పందించింది. దీనివల్ల ఆమె మరోసారి అవమానానికి గురవుతున్నారని, మహిళగా ఉండటం, అందులోనూ ముస్లిం మహిళగా ఉండటం వల్లనే ఆమె ఈ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోందని కాంగ్రెస్ పేర్కొంది. ఈ కేసులో ఇద్దరు దోషులకు బెయిల్ లభించిన తర్వాత, తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండానే ఈ నిర్ణయం తీసుకున్నారని బిల్కిస్ బానో ఒక ప్రకటనలో తెలిపారని కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం అధిపతి పవన్ ఖేరా పేర్కొన్నారు. 'ఆమె ఈ బెయిల్‌ను సవాలు చేయనున్నట్లు కూడా ప్రకటించారు. ఆమెపై జరిగిన క్రూరమైన, భయంకరమైన నేరం సరిపోనట్లుగా, ఇప్పుడు ఆమె మరోసారి అవమానాన్ని, మానసిక వేదనను అనుభవించాల్సి వస్తోంది. మహిళగా ఉండటం, పైగా ముస్లిం మహిళగా ఉండటం వల్లనే ఆమె ఈ మూల్యాన్ని చెల్లించుకోవాల్సి వస్తోంది అని పవన్ ఖేరా ఎక్స్ వేదికగా వ్యాఖ్యానించారు.

విధాన రూపకల్పన, పాలనలో...

మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలి

- లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా పిలుపు



న్యూఢిల్లీ : విధాన రూపకల్పన, పాలనలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత పెంచాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన ఇక్కడ విధాన సౌధలో కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్ల (సిడబ్ల్యుపి) భారత పార్లమెంటేరియన్ల ప్రాంతీయ సదస్సును ప్రారంభించిన అనంతరం సదస్సును ఉద్దేశించి ప్రసంగించారు. ప్రజాస్వామ్య సంస్థలను బలోపేతం చేయడానికి, ఎన్నికైన మహిళా ప్రతినిధులకు డిజిటల్ సాధికారత కల్పించి, వారికి ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), సాంకేతిక నైపుణ్యాలను అందించాల్సిన అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. పంచాయతీల నుంచి మొదలు పార్లమెంట్ వరకూ మహిళా ప్రతినిధుల సామర్థ్యాలను పెంపొందించడానికి, తద్వారా పరిపాలనలో పారదర్శకత, జవాబుదారీతనం ఉండేలా చూసేందుకు ఒక సంస్థాగత చట్రాన్ని ఏర్పాటు చేయాలని ఓం బిర్లా పిలుపునిచ్చారు. 'మహిళలు ఇకపై కేవలం భాగస్వాములు మాత్రమే కాదు. వారు ప్రతీ విషయంలోనూ నాయకులుగాఉన్నారు. ప్రజాస్వామ్య సంస్థలు, విధాన రూపకల్పన, చట్టాల రూపకల్పన, ముఖ్యమైన అంశాలపై చర్చలలో వారి భాగస్వామ్యం మరింత బలమైన ప్రజాస్వామ్యాన్ని నిర్మించడానికి ఖచ్చితంగా సహాయపడుతుంది'అని బిర్లా అన్నారు. సాంకేతికత, కృత్రిమ మేధ, మానవ కార్యకలాపాలలోని ప్రతీ రంగాన్ని మారుస్తున్నాయని, వాటిని బాధ్యతాయుతంగా ఉపయోగించినప్పుడు పరిపాలన, ప్రజాసేవల పంపిణీ, ఎన్నికైన ప్రతినిధులు, పౌరుల మధ్య సమాచార మార్పిడిని గణనీయంగా మెరుగుపరచగలవని ఆయన అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడానికి, పర్యవేక్షణా యంత్రాంగాలను బలోపేతం చేయడానికి, పరిపాలనలో పారదర్శకత తీసుకురావడానికి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లు, అభివృద్ధిచెందుతున్న సాంకేతికతలను ఉపయోగించుకునేలా మహిళా ప్రతినిధులకు శిక్షణ ఇవ్వాలని లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా సూచించారు. అలాగే, మహిళా ఎంపీలు, శాసనసభ్యులతో ఏఐ, టెక్నాలజీపై ఒక ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించాలని కూడా ఆయన సూచించారు. మినీ పార్లమెంట్‌లుగా పనిచేసే పార్లమెంటరీ కమిటీలు ప్రభుత్వాలకు సిఫార్సులు చేయడం ద్వారామహిళల సమస్యలను పరిష్కరించడంలో, వారి సామాజిక, ఆర్థిక సాధికారతను ప్రోత్సహించడంలో ముఖ్యమైన పాత్ర పోషించాయని బిర్లా అన్నారు. భారతదేశాన్ని 'ప్రజాస్వామ్యానికి తల్లి' అభివర్ణిస్తూ, ఆయన అనుభవ మంటపం నాటి దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలను ప్రస్తావిస్తూ క్రీ.శ. 12 వ శతాబ్దానికి చెందిన సంఘ సంస్కర్త, కవి బసవేశ్వరునితో సంబంధం కలిగి ఉందన్నారు. బసవేశ్వరుడు కుల శ్రేణులు, లింగ అసమానత, మత ఛాందసవాదాన్ని సవాల్ చేశాడని, ఆయన లింగాయత శాఖకు పునాది వేశారని చెప్పారు. పంచాయతీలు, మున్సిపాలిటీల నుంచి రాష్ట్ర శాసనసభలు, పార్లమెంట్ వరకూ ప్రజాస్వామ్య సంస్థలలో మహిళల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కామన్వెల్త్ మహిళా పార్లమెంటేరియన్ల (సిడబ్ల్యుపి) భారతదేశ రీజియన్ చైర్‌పర్సన్ ఎంపి దగ్గుబాటి పురంధేశ్వరి మాట్లాడుతూ మహిళా సాధికారతను కేవలం ప్రభుత్వ పదవుల్లో ఉన్న మహిళల సంఖ్యతో కాకుండా, శాసనపరమైన చర్చలలో అర్థవంతంగా పాల్గొనడం, విధాన నిర్ణయాలను ప్రభావితం చేయడం, అధ్యక్షత వహించడం వంటి వారి సామర్థ్యం ద్వారా కూడా కొలవాలని పేర్కొన్నారు. మహిళా రాజకీయ ప్రాతినిధ్యాన్ని బలోపేతం చేయడంలో నారీశక్తి వందన్ అధినియమ్, 2023 ఒక మైలురాయి అని పురంధేశ్వరి అభివర్ణించారు. కర్ణాటక ముఖ్యమంత్రి డికె.శివకుమార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడానికి, మహిళా రిజర్వేషన్లు, నిర్ణయాలు తీసుకోవడంలో అధిక భాగస్వామ్యం అవసరమని అన్నారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ కల్పించే 73,74వ రాజ్యాంగ సవరణల ద్వారా మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంపొందించడంలో వరుస ప్రభుత్వాలు, నాయకులు చేసిన కృషిని ముఖ్యమంత్రి శివకుమార్ ప్రధానంగా ప్రస్తావించారు.

వంతెన పైనుంచి లోయలోకి దూసుకెళ్లిన బస్సు

- ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం
- 9 మంది మృతి, 25 మందికి గాయాలు



న్యూతెహ్రీ/రిషికేశ్: ఉత్తరాఖండ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. తెహ్రీ గర్వాల్ జిల్లాలో మంగళవారం తెల్లవారుజామున 34 మంది ప్రయాణికులతో వెళ్తున్న బస్సు, రోడ్డు పక్కన ఉన్న ఇనుప రెయిలింగ్‌ను బద్దలు కొట్టుకుని సుమారు 100 మీటర్ల లోతైన లోయలోకి పడిపోయింది. ఈ ప్రమాదంలో తొమ్మిది మంది మరణించగా, మరో 25 మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ ఈ ప్రమాద బాధితుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.తెహ్రీ గర్వాల్ ఎస్ఎస్పి శ్వేత చౌబే తెలిపిన వివరాల ప్రకారం, ఈ బస్సు హరిద్వార్ నుండి 34 మంది ప్రయాణికులతో తెల్లవారుజామున 3.15 గంటలకు బయలుదేరింది. ఉదయం 4.50 గంటల ప్రాంతంలో, గులార్ వంతెన సమీపంలో బస్సు అకస్మాత్తుగా గులార్ గాడ్ నది లోయలోకి పడిపోయింది. ఈ బస్సు హరిద్వార్ నుండి జోషిమఠ్‌కు వెళ్తుండగా ఘటన సంభవించింది. ఎన్‌డిఆర్‌ఎఫ్ ఇన్‌స్పెక్టర్ కవీంద్ర సింగ్ సజ్వాన్ మాట్లాడుతూ సుమారు 60 మంది ప్రభుత్వ సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారని తెలిపారు. ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే, 30 మంది సభ్యులతో కూడిన ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందం, ముని కి రేతి పోలీస్ స్టేషన్ సిబ్బంది, ఉత్తరాఖండ్ అగ్నిమాపక శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకున్నారు. సహాయక సిబ్బంది మొదట తీవ్రంగా గాయపడిన ప్రయాణికులను బయటకు తీసి రిషికేశ్‌లోని ఎయిమ్స్ ఆసుపత్రికి తరలించారు, ఆ తర్వాత మిగిలిన క్షతగాత్రులను కూడా తరలించారు. మరణించిన వారి మృతదేహాలను ఆసుపత్రిలోని మార్చురీకి తరలించారు. బస్సు రోడ్డు పక్కన ఉన్న ఇనుప రెయిలింగ్‌ను బద్దలు కొట్టుకుని లోతైన లోయలోకి పడిపోయిందని సజ్వాన్ పేర్కొన్నారు. ఇది నేలపై ముందు భాగంతో బలంగా ఢీకొనడంతో, వాహనం ముందు భాగం తీవ్రంగా దెబ్బతిన్నది. ఎయిమ్స్ రిషికేశ్ పిఆర్ఓ శ్రీలోయ్ మొహంతి మాట్లాడుతూ, 25 మంది ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని, తొమ్మిది మంది మరణించినట్లు ధృవీకరించారని తెలిపారు.

క్లెయిమ్ చేయని నిధుల పంపిణీ కోసం...

రూ.3లక్షలకు పైగా క్లెయిమ్స్ ప్రాసెస్

- 'సుప్రీం'కు కేంద్రం వెల్లడి



న్యూఢిల్లీ : మరణించిన వ్యక్తుల చట్టబద్ధ వారసులకు బ్యాంకులు, పోస్ట్ ఆఫీసులు, మ్యూచ్‌వల్ ఫండ్స్, బీమా సంస్థల ద్వారా క్లెయిమ్ చేయని నిధులను పంపిణీ చేయడానికి కేంద్రం ఒక పారదర్శక యంత్రాంగాన్ని అవలంభించిందని, ఈ ఏడాది మార్చి వరకు మూడు లక్షలకు పైగా క్లెయిమ్‌లను ప్రాసెస్ చేసిందని కేంద్రం మంగళవారం సుప్రీంకోర్టుకు తెలిపింది. మరణించిన వారి ఖాతాలలో ఉన్న బ్యాంక్ ఖాతాలు, బీమా డిపాజిట్లు, పోస్ట్ ఆఫీస్ నిధుల గురించిన సమాచారాన్ని అందించే కేంద్రీకృత డేటాబేస్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ జర్నలిస్ట్ సుచేతా దలాల్ దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)పై జస్టిస్ విక్రమ్‌నాథ్, ఆర్. మహదేవన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ తన తీర్పును రిజర్వ్ చేసింది. కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ , రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ), సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబి) పలు పార్టీలు, దలాల్‌ను ఈ విషయంలో తమ లిఖితపూర్వక వాదనలను దాఖలు చేయాలని అది కోరింది. కేంద్రం, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ తరపున అదనపు సొలిసిటర్ జనరల్ ఎన్. వెంకటరామన్ మాట్లాడుతూ, అటువంటి విధులను నిర్వర్తించడం తమకు తప్పనిసరి అని, వెబ్‌సైట్‌లో అన్ని వివరాలను పొందుపరుస్తూ తాము పారదర్శక విధానాన్ని అవలంభించామని తెలిపారు.'ఇప్పటివరకు, మార్చి 2026 నాటికి 3లక్షలకు పైగా క్లెయిమ్‌లు ప్రాసెస్ చేయబడ్డాయి. అటువంటి క్లెయిమ్‌లలో కేవలం 10శాతం మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి' అని ఆయన సమర్పించారు. ఏప్రిల్ 18, 2026 నాటికి రూ.6,453 కోట్ల విలువైన క్లెయిమ్ చేయని ఆర్థిక ఆస్తులు వాటి నిజమైన యజమానులకు విజయవంతంగా తిరిగి అప్పగించబడ్డాయని ఆయన తెలిపారు. కంపెనీల చట్టం ప్రకారం, ప్రతీకంపెనీ క్లెయిమ్ చేయని డిపాజిట్ల గురించి వెల్లడించాల్సిన బాధ్యతను కలిగి ఉందని అదనపు సొలిసిటర్ జనరల్ (ఎఎస్‌జి) తెలిపారు. ఆయన ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఇపిఎఫ్), డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ ఫండ్ (డిఇఎవ్ఎఫ్)లను ప్రస్తావిస్తూ ఐఇపిఎఫ్ అథారిటీ పోర్టల్ ద్వారా కంపెనీలు చేసిన వెల్లడింపులను (డిస్‌క్లోజర్స్) ప్రజలు పొందవచ్చని తెలిపారు.పోర్టల్‌లో సుమారు 30 బ్యాంకులు నమోదు చేసుకున్నాయని ఎఎస్‌జి వివరించారు.క్లెయిమ్ చేయని డిపాజిట్లలో 90శాతం పోర్టల్ ద్వారా అందుబాటులో ఉన్నాయని వెంకటరామన్ చెప్పారు. పిటిషనర్ తరపున హాజరైన న్యాయవాది ప్రశాంత్ భూషణ్ మాట్లాడుతూ ఈ పిటిషన్, బ్యాంకు డిపాజిట్లు, సెక్యూరిటీలు, బీమా పాలసీలు, ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలు (పిఎఫ్) ఖాతాలనే నాలుగు వర్గాల ఆర్థిక ఆస్తులకు సంబంధించినదని సమర్పించారు. సరైన దిశలో కొన్ని చర్యలు తీసుకున్నప్పటికీ, మూడవ కేటగిరీ బీమా పాలసీలకు సంబంధించి ఎలాంటి సమర్థవంతమైన చర్యలు చేపట్టనందున అవి సరిపోవని ఆయన వాదించారు. ఆర్‌బిఐ పోర్టల్ యూజర్లను కోరుతుందని ప్రశాంత్ భూషణ్ వాదించారు. వ్యక్తిగత బ్యాంకులు, సంస్థలను ఆశ్రయించమని వారిని కోరడం కాకుండా, చట్టబద్ధ వారసులు తమకు తెలియని ఆర్థిక ఆస్తులను కనుగొనేలా చేయడమే దీని లక్ష్యమని భూషణ్ నొక్కిచెప్పారు. వాదనలు విన్న అనంతరం, ఈ పిటిషన్‌పై ఉత్తర్వులు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది. మార్చి 17న, మరణించిన వ్యక్తుల బ్యాంకుల ఖాతా వివరాలను ఎందుకు వెల్లడించలేకపోయారని కేంద్ర ప్రభుత్వాన్ని, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బిఐ)ని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. వారసుల విషయంలో ప్రభుత్వం ఒక విధానాన్ని రూపొందించాలని పిటిషన్‌లో పేర్కొన్నారు.

బిజెపి, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల

హృదయాల నిండా విషమే

- ప్రేమను వ్యక్తపరిచేందుకు అది వారిని అడ్డుకుంటోంది : రాహుల్



న్యూఢిల్లీ : బిజెపి, ఆర్ఎస్ఎస్‌పై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విరుచుకుపడ్డారు. భయం, కోపం, ద్వేషం బిజెపి, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో ఒక వలలా అల్లుకుపోయాయని, ఇది వారిని ప్రేమను వ్యక్తపరచకుండా అడ్డుకుంటోందని పేర్కొన్నారు. 'భోజన సమయంలో అమ్మ, నాన్న ఒడిలో కూర్చునేది' అని రాహుల్ చేసిన వ్యాఖ్యలపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఆయన ఘాటుగా స్పందించారు. పార్వతీ దేవి శివుని ఒడిలో కూర్చుని ఉన్న 12వ శతాబ్దపు ఆలయ శిల్పానికి సంబంధించిన ఫోటోను కూడా రాహుల్ గాంధీ సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పంచుకున్నారు. 'భయం, కోపం, ద్వేషం అనేవి బిజెపి, ఆర్ఎస్ఎస్ మద్దతుదారుల హృదయాల్లో ఒక వలలా అల్లుకుపోయాయి. ఇవి వారిని ప్రేమను అనుభవించకుండా, వ్యక్తపరచకుండా ఆపుతున్నాయి' అని ఆయన పేర్కొన్నారు. ఒక నిజమైన హిందువుగా, వారిని ఈ వల నుండి విముక్తులను చేయడం తన బాధ్యత అని, తద్వారా వారు కూడా తమ జీవితాల్లో ప్రేమ, అనుబంధం ఇచ్చే అద్భుతమైన సౌందర్యాన్ని, ఆనందాన్ని అనుభవించగలరని, సత్యం శివం సుందరం అని రాహుల్ అన్నారు. సోమవారం నాడు, తన తల్లి సోనియా గాంధీ రాసిన 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' అనే జ్ఞాపకాల పుస్తకాన్ని ఆవిష్కరించే కార్యక్రమంలో, రాహుల్ గాంధీ తన తల్లిదండ్రుల మధ్య ఉన్న గాఢమైన అనుబంధం గురించి వివరించారు. ప్రతి భోజన సమయంలో 'నాన్న ఉండేవారు, ఆయన ఒడిలో అమ్మ కూర్చునేది' అని ఆయన చెప్పారు. 'అప్పట్లో ఇది చాలా సాధారణమైన విషయమని నేను భావించేవాడిని. అందుకే స్నేహితుల ఇళ్లకు వెళ్ళినప్పుడు, వారి తల్లిదండ్రులు ఒకరి ఒడిలో ఒకరు కూర్చోకపోవడాన్ని చూసి, 'ఏంటిది? మీ అమ్మ మీ నాన్న ఒడిలో ఎందుకు కూర్చోవడం లేదు?' అని అడిగేవాడిని' అని ఆయన గుర్తుచేసుకున్నారు. ఆ తర్వాత, అదంతా ఒక్కసారిగా చిన్నాభిన్నం కావడం చూశాం. కాలక్రమేణా కాదు, అకస్మాత్తుగా... మా కుటుంబానికి ప్రధాన ఆధారం (ఇందిరా గాంధీ) కాల్చి చంపబడటం, ఆపై మా అతిపెద్ద ఆధారం (రాజీవ్ గాంధీ) బాంబు దాడిలో ముక్కలైపోవడం చూశాం' అని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ చేసిన ఈ వ్యాఖ్యలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ విమర్శలు గుప్పించారు. ఆ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియో క్లిప్‌ను షేర్ చేస్తూ, 'క్షమించండి మేడమ్, మీ జీవితంలో ఇంతటి ప్రత్యేకమైన రోజున కూడా ఆయన మిమ్మల్ని ఇబ్బంది పెట్టకుండా ఉండలేకపోయారు. దేశం ఎప్పుడో ఆయన గురించి తెలుసుకుంది. కనీసం ఇప్పుడైనా మీరు గ్రహిస్తారని ఆశిస్తున్నాను; ఈ 'ప్రొడక్ట్'ను ఎన్నిసార్లు లాంచ్ చేసినా, మళ్లీ మళ్లీ లాంచ్ చేసినా ప్రయోజనం లేదు' అని అన్నారు. సోషల్ మీడియాలో కొంతమంది రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యను విమర్శించగా, మరికొందరు ఆయన నిజాయితీగా మాట్లాడారని సమర్థించుకున్నారు.

దాడికి ముందే రెక్కీ... సిసిటివిలో ఉగ్ర కదలికలు

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో భద్రతా బలగాలపై దాడులకు పాల్పడిన ఉగ్రవాదుల కదలికలు సిసిటివి కెమెరాల్లో రికార్డయ్యాయి. లష్కరే తోయిబా కమాండర్ మహమ్మద్ లతీఫ్ భట్, అతడి సహాయకుడు ఉమర్ నిసార్ దార్ కలిసి దాడికి ముందు వివిధ ప్రాంతాల్లో రెక్కీ నిర్వహించినట్లు పోలీసులు గుర్తించారు. కుల్గాం జిల్లాలో ఈ నెల 11న సీఆర్‌పీఎఫ్ బలగాలపై జరిగిన దాడికి ముందు రోజు వీరిద్దరూ అనుమానాస్పదంగా సంచరించినట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా బయటపడింది. దర్యాప్తు సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం... ఈ నెల 10న లతీఫ్ భట్, ఉమర్ నిసార్ దార్ కలిసి కుల్గాం జిల్లాలోని మీర్ బజార్, అఖ్రాన్, హబ్లిష్, కిలామ్ ప్రాంతాల్లో తిరిగారు. భద్రతా బలగాల కదలికలను గమనించడంతో పాటు దాడులకు అనువైన ప్రాంతాలను గుర్తించేందుకు రెక్కీ నిర్వహించారు. ఈ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సిసిటివి కెమెరాల ఫుటేజీని పరిశీలించగా ఆ ఇద్దరి కదలికలు బయటపడ్డాయి. దాడి అనంతరం వారు అక్కడి నుంచి పారిపోయిన దశ్యాలు కూడా రికార్డయ్యాయని అధికారులు తెలిపారు. ఈ నెల 11న అఖ్రాన్ ప్రాంతంలోని సిఆర్‌పిఎఫ్ చెక్‌పోస్ట్‌పై వీరిద్దరూ దాడి చేసినట్లు దర్యాప్తు సంస్థలు పేర్కొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురు సీఆర్‌పీఎఫ్ సిబ్బంది గాయపడ్డారు. కాల్పుల అనంతరం నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. 16న కుల్గాంలో లతీఫ్ భట్, ఉమర్ నిసార్ దార్‌ను భద్రతా బలగాలు గుర్తించడంతో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్‌కౌంటర్‌లో లతీఫ్ భట్ మృతి చెందగా, ఉమర్ నిసార్ దార్ మాత్రం గాయాలతో అక్కడి నుంచి తప్పించుకున్నాడు. అతడి కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలిస్తున్నాయి.

అభిషేక్ బెనర్జీకి కలకత్తా హైకోర్టు షోకాజ్

కోల్‌కతా: తృణమూల్ కాంగ్రెస్ (టిఎమ్‌సి) ఎంపి అభిషేక్ బెనర్జీకి కలకత్తా హైకోర్టు మంగళవారం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. కోర్టుపై చేసిన వ్యాఖ్యలు, సామాజిక మాధ్యమంలో పెట్టిన పోస్టు ప్రాథమికంగా క్రిమినల్ కోర్టు ధిక్కరణ కిందకు వస్తాయని పేర్కొంది. నోటీసులు జారీ చేసిన తేదీ నుంచి 15 రోజుల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించింది. అభిషేక్ బెనర్జీ భద్రతను పున:సమీక్షించాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి స్పష్టం చేసింది. బిజెపి అధికారంలోకి వచ్చిన మరుసటి రోజే అభిషేక్ బెనర్జీకి ఉన్న జెడ్ ప్లస్ భద్రతను ఎక్స్ కేటగిరీకి తగ్గించిన వ్యవహారంపై జస్టిస్ కష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 7న ఆయన పెట్టిన పోస్టును పరిశీలించారు. అభిషేక్ బెనర్జీ క్రిమినల్ కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని, న్యాయపాలనలో జోక్యం చేసుకునేలా ఫేస్‌బుక్ పోస్టు ఉందని జడ్జి వ్యాఖ్యానించారు. ఎందుకు శిక్ష విధించరాదో చెప్పాలన్నారు. ఇందుకు 15 రోజుల సమయం ఇస్తూ నోటీసులు జారీకి ఆదేశించారు. తదుపరి విచారణను డిసెంబర్ 8కి వాయిదా వేశారు.

కేజ్రీవాల్‌పై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం



న్యూఢిల్లీ: ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌తో పాటు ఆ పార్టీకి చెందిన ఇతర నేతలను మంగళవారం ఢిల్లీ హైకోర్టు హెచ్చరించింది. నేరపూరిత కోర్టు ధిక్కరణ కేసులో స్పందించకపోవడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. మరింత జాప్యం జరిగితే ఊరుకునేది లేదని కోర్టు తన హెచ్చరికలో పేర్కొంది. జస్టిస్ స్వరణ కాంత శర్మపై సోషల్ మీడియాలో ఆప్ నేతలు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీ లిక్కర్ కేసు వాదనల సమయంలో జస్టిస్ శర్మను లక్ష్యంగా చేసుకుని ఆప్ నేతలు పోస్టులు పెట్టారు. ఆ అంశంలో ఆప్ నేతలపై క్రిమినల్ కేసు నమోదైంది. తన తాజా ఉత్తర్వుల్లో మరో వదు వారాల్లోగా ఆప్ నేతలు వివరణ ఇవ్వాలని కోర్టు పేర్కొంది. కోర్టును సరదా తీసుకుంటున్నారని ఆప్ నేతలను తప్పుపట్టింది. వదు వారాల్లోగా వివరణ ఇవ్వకుంటే, కేసును ముగించేస్తామని, ఆ కేసులో స్పందించే హక్కు కోల్పోతారని వెల్లడించింది.

ఎస్ఐఆర్‌పై 'ఇండియా' పిటిషన్

విచారణకు 'సుప్రీం' అంగీకారం

న్యూఢిల్లీ: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సహా ఇండియా ఐక్య సంఘటన నేతలు దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు మంగళవారం అంగీకరించింది. ప్రధాన న్యాయవర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతత్వంలోని ధర్మాసనం ఈ కేసును డిసెంబరు 9వ తేదీకి వాయిదా వేసింది. వాస్తవానికి ఈ పిటిషన్ మంగళవారం విచారణకు రావాల్సి ఉంది. అయితే, మధ్యాహ్న భోజన విరామం కోసం ధర్మాసనం వెళ్లాల్సి ఉండటంతో, భారత ఎన్నికల సంఘం (ఈసీఐ) తరపున హాజరైన సీనియర్ న్యాయవాది హరీష్ సాల్వే, అన్ని పిటిషన్లను విచారించడానికి తగినంత సమయం ఉంటుందా అని ప్రశ్నించారు. మధ్యాహ్నం వేళ ఇప్పటికే ఒక ప్రత్యేక ధర్మాసనం ఏర్పాటు చేయబడి ఉందని, దీంతో విచారణను మరో తేదీకి వాయిదా వేయాలని ధర్మాసనాన్ని కోరారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) నిర్ణయాల ప్రక్రియపై కేంద్ర ఎన్నికల సంఘాన్ని (ఈసీఐ) 48 ప్రశ్నలు అడిగేందుకు అనుమతించాలని కోరుతూ వారు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. 'సర్వీస్ ఇన్ఫర్మేషన్ రిపోర్ట్' (ఎస్ఐఆర్) నిర్వహణకు సంబంధించి... ఎన్నికల సంఘం అక్టోబరు 26న దాఖలు చేసిన అఫిడవిట్‌లో పేర్కొన్న అంశాల వాస్తవికతపై ఈ ప్రశ్నలు ఉన్నాయి. సుమారు 13 కోట్ల మంది ఓటర్లను తొలగించిన ఎస్ఐఆర్ ప్రక్రియ ఈసీఐ ఏకగ్రీవ నిర్ణయమని ఆ అఫిడవిట్‌లో పునరుద్ఘాటించారు.

కర్రెగుట్టల్లో మావోయిస్టుల భారీ డంప్ గుర్తింపు

భద్రాచలం: చత్తీస్‌గఢ్, తెలంగాణ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో మావోయిస్టులకు సంబంధించిన భారీ డంప్ బయటపడింది. బీజాపూర్ జిల్లా పూజారి కాంకేర్ వద్ద కర్రెగుట్టల్లో తెలంగాణ పోలీసులు దీనిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల నుంచి గ్రేహౌండ్స్ బలగాలతో పోలీసులు అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. స్వాధీనం చేసుకున్న డంప్‌లో 300కు పైగా బ్యారెల్ గ్రనేడ్ లాంచర్లు (బీజీఎల్) ఉన్నాయి. చర్ల పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు మాట్లాడుతూ తెలంగాణ పోలీసులు ఇంత పెద్ద ఎత్తున బీజీఎల్స్ స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారని చెప్పారు. డీఎస్పీ అరుణ్‌కుమార్, సీఐ రాజువర్మ, సీఆర్పీఎఫ్ 141 ఏసీ విక్రమ్ రంజన్, ఎస్సై నర్సిరెడ్డి పాల్గొన్నారు.

సిపిఐ మరింత బలోపేతం కావాలి


- జమ్మూకశ్మీర్ సమితి స

ధ్వంసమైన క్రిమియా కీలక బ్రిడ్జి



కీవ్: రష్యా–రష్యా ఆక్రమిత క్రిమియాను అనుసంధానం చేసే అత్యంత కీలక మైన అతిపెద్ద రైల్–కమ్–రోడ్ బ్రిడ్జిని తీవ్రస్థాయిలో ధ్వంసం చేసినట్లు ఉక్రేన్ అధ్యక్షుడు జెలెన్స్కీ చెప్పారు.ఇటీవలి వారాల్లో తమ సైన్యం చేసిన ఒక అసా ధారణమైన ఆపరేషన్‌గా ఆయన అభివర్ణించారు.దీనిని కెర్చ్ బ్రిడ్జి అని కూడా పిలిచే ఈ వంతెనలోని ఒక భాగం కింద నీళ్ళలో కుప్పకూలిపోయిందని చెప్పారు.రాకపోకలకు అనువుగా లేదన్నారు.దీనికి సంబంధించిన వీడి యోలు,ఫొటోలను సోషల్ మీడియా ద్వారా ఆయన షేర్ చేశారు.రష్యన్ సైని కులు రాకపోకలు చేయడానికి ఇప్పుడు పెద్ద సమస్య వస్తుందని,ఇది తమ మంచికేనని అన్నారు. తమ సైన్యాలు ఏడు దశల్లో ఈ ఆపరేషన్ నిర్వహించా యని,రాడార్‌లను,ఎలక్ట్రానిక్ వార్‌ఫేర్ వ్యవస్థలను క్రమంగా పనిచేయకుంచే శామని,తర్వాత ఈ వంతెనను ధ్వంసం చేశామని చెప్పారు.మరోవైపు కీవ్ నగర మేయర్ విటాలీ క్లిచ్‌కోవ్ మాట్లాడుతూ,మంగళవారం తెల్లవారకముందే రష్యా చేసిన దాడుల తర్వాత ద్నిప్రో నదిపై నిర్మించిన రెండు ముఖ్యమైన వంతెనలపై రాకపోకలను నిలిపివేసినట్లు చెప్పారు.

జెఫ్రీ ఎప్‌స్టీన్‌ను జైల్లో హత్యచేశారు!



వాషింగ్టన్: లైంగిక నేరాలకు పాల్ప డిన జెఫ్రీ ఎప్‌స్టీన్ విచారణ నిమిత్తం జైలులో ఉన్న సమయంలో ఆత్మహత్య చేసుకోలేదని,ఆయన హత్యకు గుర య్యారని ఫోరెన్సిక్ నిపుణుడు ఒకరు సంచనల ప్రకటన చేశారు.2019 ఆగస్టు పదో తేదీన ఎప్‌స్టీన్ జైలులోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు వార్తలు వెలువడ్డాయి.డోనాల్డ్ ట్రంప్ సహా ప్రపంచవ్యాప్తంగా అనేకమంది రాజ కీయ ప్రముఖులు,రాచకుటుంబాలను సెక్స్ రొంపిలోకి దింపిన నీచ దళారిగా ఆయన ముద్రవేసుకు న్నారు.ప్రొఫెసర్ మైఖేల్ ఫ్రీమన్ బిబిసి న్యూస్‌నైట్ ఇంటర్వ్యూలో మాట్లా డుతూ,వైద్యాధికారి నివేదికను పరీక్షించిన తర్వాత,ఆయనను వెనుక నుండి ఒక తాడుతో గొంతు నులిమి హత్య చేశారని బలమైన సాక్ష్యాలు కనిపిస్తున్నాయని,అదే తాడును బంక్ బెడ్‌కు వేలాడదీసి ఉండవచ్చునని తాను నమ్ముతున్నట్లు చెప్పారు.ఐతే 2019లో ఆయన మృతదేహాన్ని పరీ క్షించిన అధికారి మాత్రం,ఆయన మరణం హత్య అయితే ఆత్మరక్షణకు సంబంధించిన గాయాలు ఎక్కడా కనిపించలేదని ధృవీకరించారు.ఐతే ఎప్‌స్టీన్ సోదరుడు మార్క్ ఎప్‌స్టీన్ అందించిన వైద్య నివేదికలను ఫోరె న్సిక్ నిపుణుడు ఫ్రీమన్ పరిశీలించారు.''దీని వెనుక కుట్ర సిద్ధాంతం ఉందని భావిస్తున్నారా?'' అని ప్రశ్నించగా,అందరినీ పరిశీలించని వ్వండి,తర్వాత నిర్ధారిస్తారు,నాకు సమయం ఉంటుంది''అన్నారు.

చైనా సూపర్ కంప్యూటర్‌కు పరల్డ్ ర్యాంకింగ్



చికాగో: చైనా తన దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన ''లైన్‌షైన్'' సూపర్ కంప్యూటర్‌కు ప్రపంచ అగ్రశ్రేణి ర్యాంకింగ్ లభించింది.చికా గోలో జరిగిన హై పెర్‌ఫార్మెన్స్ కంప్యూటింగ్,నెట్‌వర్కింగ్, స్టోరేజీ, అనాలిసిస్‌పై ఏర్పాటు చేసిన ఎస్‌సి–26 అంతర్జాతీయ సదస్సులో లైన్‌షైన్ ప్రపంచ అగ్రశ్రేణి ర్యాకింగ్ దక్కించుకుంది. గడచిన జూన్‌లో మొదటిసారి ఈ టాప్–500 అగ్రశ్రేణి ర్యాకింగ్ సొంతం చేసుకుంది.ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన ఈ సూపర్ కంప్యూటర్‌ను షెన్‌జెన్‌లోని నేషనల్ సూపర్ కంప్యూటింగ్ సెంట ర్‌లో ఏర్పాటు చేసింది.ఇది సెకనుకు 2.198 ఎక్స్‌ఫ్లాప్స్ వేగంతో పని చేస్తుంది.అంటే సెకనుకు రెండు క్వింటిలియన్లపైగా గణాంకాలను పూర్తిచేయగలదు. ఇందులో మొత్తం 1.37 కోట్లకు పైగా కోర్లు ఉన్నాయి. 90 క్యాబిన్స్‌లో ఏర్పాటు చేసిన ఈ వ్యవస్థ 42.2 మెగా వాట్ల విద్యుత్‌ను ఉపయోగించుకుంటుంది.చైనా తన 15వ పంచవర్ష ప్రణాళికలో కంప్యూటింగ్ మౌలిక సదుపాయాల విస్తరణ,వనరుల అభివృద్ధికే అత్యధిక ప్రాధాన్యత ఇచ్చింది.

కోస్టారికా జర్నలిస్టుహత్య: నిరసన ప్రదర్శన




శాన్‌జోస్: లాటిన్ అమెరికా దేశం కోస్టారికాలో సీనియర్ జర్నలిస్టు కామిలో రోడ్రిగ్జ్ (51)హత్యకు గుర య్యారు.రాజధాని శాన్‌జోస్ శివారుప్రాంతంలో సోమ వారం మధ్యాహ్న సమ యంలో ఒక ప్రధాన రహదా రిపై భారీగా ట్రాఫిక్ నిలిచి ఉన్న సమయంలో ఆయనను హత్యచేశారని రెడ్‌క్రాస్ సంస్థ ప్రకటించిందిదేశాధ్యక్షుడు లారా ఛెర్నాం డెజ్ ఒక వీడియో సందేశంలో ఈ దాడిని ఖండించారు.దేశంలో భావప్రక టనాస్వేచ్ఛపై జరిగిన దాడిగా ఆయన పేర్కొన్నారు.ఇదే జాతీయ రహదా రిపై 2001లో రేడియో నిర్మాత,జర్నలిస్టు పార్మెనియో మెదీనాను కాల్చి చంపారు.2013నుండి దేశంలో హింసాకాండ పెరిగింది.మాదక ద్రవ్య వ్యాపారులు,స్మగ్లర్లు,రాజకీయనాకులు చేస్తున్న చర్యలపై వార్తలు ప్రచురి స్తున్నందుకుగాను హత్యకు గురయ్యారు.దీంతో అనేకమంది జర్నలిస్టులు వీధుల్లోకి వచ్చి నిరసన ప్రదర్శన చేశారు.రోడ్రిగ్జ్‌కు న్యాయం చేశా యని,దోషులను శిక్షించాలని వారు డిమాండ్ చేశారు.గడచిన 25 సంవ త్సరాలలో కోస్టారికాలో జర్నలిస్టులపై ఇలాంటి ఘోరమైన చర్యలకు ఎవరూ పాల్పడలేదు.మధ్య అమెరికాలో అత్యంత శాంతియుతమైన,స్థిర మైన ప్రజాస్వామ్యదేశంగా పేరొందిన కోస్టారికాలో ఇటీవల మాదక ద్రవ్యాల స్మగ్లర్ల హింస పెరిగింది.

విఫలమైన బ్రెగ్జిట్: ఇయుతో మళ్లీ సంబంధాలు

- బ్రిటన్ ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ కీలక ప్రకటన
- బ్రెగ్జిట్‌వల్ల బ్రిటన్ ఏకాంతవాసంలోకి వెళ్ళింది
- నాటో అనైక్యతకోరే శత్రువులకు కావాల్సింది ఇదే

లండన్: యూరోపియన్ యూనియన్‌తో సంబం ధాలు తెంచుకుని బ్రెగ్జిట్ (బయటకు రావడం) చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని బ్రిటన్ ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ మొదటిసారి ప్రక టించారు. లండన్ ఫైనాన్సియల్ డిస్ట్రిక్ట్‌లో జరిగిన లార్డ్ మేయర్ విందులో ఆయన మాట్లాడుతూ, బ్రెగ్జిట్ వైఫల్యాన్ని అంగీకరించాల్సిన సమయం ఆస న్నమైందన్నారు.27 దేశాల యూరోపియన్ యూని యన్ కూటమితో సంబంధాల పునఃప్రతిష్ఠాపనకు ఆయన ప్రతిజ్ఞ చేశారు. బ్రెగ్జిట్ జరిగిన పదేళ్ళకా లంలో ప్రపంచంలో మనస్థానం క్షీణించిందని అన్నారు. వచ్చే శుక్రవారం బ్రస్సెల్స్‌లో జరిగే బ్రిట న్–ఇయు సమావేశానికి ముందుగా బర్న్‌హాం ఈ ప్రసంగం చేశారు. బ్రస్సెల్స్ సమావేశంలో ఆహారం, పానీయాలు, ఇంధనం, వాణిజ్య ఒప్పందంతోపాటు యూరప్ దేశాల యువకులను పరిమితస్థాయిలో పనిచేసేందుకు కూడా అనుమతించే ఒప్పందాలపై చర్చించి ఖరారు చేస్తారని భావిస్తున్నారు.లార్డ్ మేయర్ విందులో ఆయన గంభీర ప్రసంగం చేసినప్పు టికీ,ఈ విషయంలో మళ్ళీ బర్న్‌హామ్ కూడా ప్రజాభి ప్రాయ సేకరణకు వెళ్ళే అవ కాశాలు కనిపిస్తున్నాయి. అంటే ఆయన కూడా ఈ ప్రక్రి యను సాగదీసే అవకాశం ఉంది. బ్రిటన్ పొందినదానికంటే ఎక్కువ కోల్పోయిందని లార్డ్ మేయర్ విందులో బర్న్‌హాం చెప్పారు.దశాబ్దకాలపు గందర గోళానికి అంతం పలకడానికే బ్రిటన్ తిరిగి ప్రపంచ వేదికపైకి వచ్చిందన్నారు.



యూరప్‌కు, బ్రిటన్‌కు మధ్య మళ్లీ సంబంధాలు అభివృద్ధిచేసి అనుసంధాన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. ప్రజాభిప్రాయ సేకరణ ద్వారా యూరోపియన్ యూనియన్ నుండి బ్రిటన్‌దేశం వైదొలగి బయటకు రావడాన్ని బ్రెగ్జిట్‌గా పిలిచారు. ఇయులో ఉమ్మడిగా కొనసాగడంవల్ల బ్రిటన్‌లో నిరుద్యోగం పెరిగిందని, ఉద్యోగావకాశాలు యూరోపియన్ దేశాలకు వెళ్ళిపోతున్నాయని గగ్గోలు చెలరేగడంతో 2016లో ఆనాటి ప్రధాన మంత్రి డేవిడ్ కామెరాన్ సారథ్యంలో జనాభి ప్రాయసేకరణ జరిగింది. తర్వాత ఏడో ప్రధానమంత్రిగా వచ్చిన బర్న్‌హామ్, ''బ్రెగ్జిట్ ఇయు నుండి బ్రిటన్ విడిపో వడాన్ని చక్రవర్తికి 'మోసపూరిత దర్జీలు కుట్టి ధరింపజేసిన మాయా దుస్తులు'' కథ(హాన్స్ క్రిష్టియన్ ఆండర్సన్ జానపద కథ)కథతో పోల్చి చూపించారు. ఈ కథలో రాజు గారు మాయా దుస్తులతో ఊరేగు తుంటే ఆయన నగ్నంగా ఉన్నాగానీ ప్రజలు నిజం చెప్పడానికి ఇష్టపడరు. కానీ ఒక చిన్నపిల్లవాడు రాజును గేలిచేయడంతో ఆయన సిగ్గుతో అంతఃపురానికి పరుగులు తీస్తాడు. కాగా, ప్రస్తుతం పునరుద్ధరించిన అంతర్జాతీయ సహ కారయుగం నేపథ్యంలో గడచిన పది సంవత్సరా లలో బ్రిటన్ సంపాదించిన అనుభవంతో నాయ కత్వం వహించే బాధ్యతలు చేపట్టేందుకు బ్రిటన్ ప్రస్తుతం మంచిస్థితిలో నిలబడి ఉందని బర్న్‌హాం చెప్పారు. బ్రెగ్జిట్‌వల్ల బ్రిటన్ ఏకాంతవాసంలోకి వెళ్ళిపోయిందని, నాటోలో అనైక్యతను కోరుకున్న రష్యాకు కావాల్సింది ఇదేనని అన్నారు. ఒక బలహీ నమైన యూరప్‌ను రష్యా కోరుకుందని ఆయన అన్నారు. ఐతే ఆ తర్వాత సొంతపార్టీలోనే ఆయన ప్రకటనపై ఆందోళన వ్యక్తమైంది.

బహ్రైన్‌లో అమెరికా రాడార్ వ్యవస్థ ధ్వంసం

- ఐఆర్‌జిసి ప్రకటన: ట్రంప్ తీవ్ర హెచ్చరిక
- హోర్మూజ్‌లో అడ్డదారులు ప్రోత్సహించొద్దు
- షరతులు ఒప్పుకుంటేనే జలసంధి తెరుస్తాం: ఇరాన్ ప్రతిహెచ్చరిక

దుబాయ్: బహ్రైన్‌లో అమెరికాకు ఉన్న స్థావరా లపై దాడులు చేసినట్లు ఇరాన్ ఐఆర్‌జిసి సైనిక వర్గాలు మంగళవారం ప్రకటించాయి.అమెరికా రాడార్ వ్యవస్థను ధ్వంసంచేశామని చెప్పాయి. కాగా బహ్రైన్‌లో పేలుడు శబ్దాలు వినిపించి నట్లు ప్రత్యక్ష సాక్ష్యులు చెప్పారు.ఐతే అమెరికా సెంట్‌కామ్ వర్గాలు ఈ ప్రకటనను ఖండిం చాయి.తమ రాడార్ వ్యవస్థను ఇరాన్ దెబ్బతీ యలేదని పేర్కొంది.కైతే ఐఆర్‌జిసి డ్రోన్లను కూల్చివేసినట్లు బహ్రైన్ పేర్కొంది.పశ్చిమాసి యాలో మళ్ళీ ఉద్రిక్తతలు పెంచవద్దని ఇరు పక్షాలూ సంయమనం పాటించాలని ఖతార్ ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది. మధ్యవర్తిత్వం చేస్తు న్న ఖతార్ ప్రతినిధులు నిర్దిష్ట ప్రకారం ఇరాన్ ప్రతినిధులతో సమావేశమయ్యేందుకు సిద్ధమవు తున్నారు.మరోవైపు ఇరాన్ కూడా హోర్మూజ్ జలసంధిలో తమ దళాల నిఘా తప్పించుకునేందుకు అడ్డదా రులను ప్రోత్సహించవద్దని అమెరి కాను ఇరాన్ ఐఆర్‌జిసి హెచ్చరిం చింది.తమ కళ్ళుకప్పి వాణిజ్య నౌకలు చమురు, ఇతర సరుకు లను తీసుకువెళ్ళాలనుకుంటే సముద్ర మందుపాతరల బారిన పడి ధ్వంసమవుతాయని,ఇప్పటికే



అనేక డజన్ల నౌకలు మంటల్లో దగ్ధమయ్యాయని తెలియజేసింది. ఈ పరిణామాలపై ట్రంప్ స్పందిస్తూ, ఇరాన్ పదే పదే చేస్తున్న యుద్ధ హెచ్చరికలను తీవ్రంగా పరిగణిస్తామని అన్నా రు. అమెరికా స్థావరాలపై దాడులు చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సి వస్తుందన్నారు. మరోవై పు ఇరాన్ సైనిక దళాల బ్రిగేడియర్ జనరల్ మహ్మద్ అక్రమినియా బందర్ అబ్బాస్‌లోఓ జ రిగిన ఒక సభలో మాట్లాడుతూ, హోర్మూజ్ జల సంధిపై తమ సాయుధ బలగాలకు పూర్తి పట్టు ఉందని, జలసంధితమ అధీనంలో ఉందని చె ప్పారు. ఇరాన్ చెప్పిన ఏడు షరతులను అంగీక రిస్తేనే హోర్మూజ్ జలసంధిని తిరిగి రాకపోకలకు తెరుస్తామని అన్నారు.అమెరికా మళ్ళీ దాడి చేస్తే ఈసారి యుద్ధం భౌగోళిక సరిహద్దులు దాటి వెళుతుందని, చాలా తీవ్రంగా స్పందిస్తామని అక్రమినియా అన్నారు. యూరప్‌లో ఉన్న అమె రికా స్థావరాలపై దాడులు చేస్తామని ఇరాన్ ఇప్పటికే హెచ్చరికలు చేసింది. ఇజ్రాయెల్ జియోనిస్టు పాలకుల రెచ్చగొట్టే ప్రకటనలకు లొంగిపోయి దాడులు చేయవద్దని అక్రమి నియా కోరారు. మరోసారి ట్రంప్‌ను మోసగించి యుద్ధంలోకి లాగాలని జియోనిస్టులు కోరుకుం టున్నారన్నారు. ఈ తప్పులు పునరావృతం చేస్తే ట్రంప్ పశ్చాత్తాపడతారని హెచ్చరించారు ఇ రాన్ పార్లమెంటు స్పీకర్ మహ్మద్ ఘాలిబాఫ్ ఒక ప్రకటన చేస్తూ, పౌరస్థావరాలపై క్షిపణి దాడులు చేస్తామన్న అమెరికా తన ప్రకటనలను సమర్థించుకుంటున్నదని, అదే జరిగితే తాము కూడా అదేవిధంగా స్పందిస్తామని అన్నారు.

సహకారంతోనే ఇండో–పసిఫిక్ భవిష్యత్తు

- ఆసియాన్ సదస్సులోమోదీ ప్రకటన
- శాంతి, స్థిరత్వ సాధనకు తొమ్మిది ప్రతిపాదనలు
- భవిష్యత్‌కోసం భారత్–ఆసియాన్ ఉమ్మడి దిశానిర్దేశం

మనీలా: ఇండో–పసిఫిక్‌లో దేశాల భవిష్యత్ సంబంధాలు సహకారంపైనే ఆధారపడి ఉన్నా యని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. ఫిలిప్పీన్స్ రాజధాని మనీలాలో ఆసియాన్ (ఆ గ్నేయ ఆసియా దేశాల కూటమి)లో ఉన్న 11 దేశాల నాయకుల సమావేశంలో మంగళవారం మోదీ మాట్లాడుతూ, ఇండో–పసిఫిక్‌లో దేశాల సంబంధాలు, భవిష్యత్తు సహకారంపై మాత్రమే ఆధారపడి ఉంటుంది తప్ప పోటీపై కాదని అన్నారు.ఈ ప్రాంతంలో చైనా ప్రాబల్యం పెరగ డంతో ఆసియాన్ దేశాలమధ్య దక్షిణ చైనా సముద్ర ప్రధాన జలమార్గంలో వివాదాలు పెరు గుతున్న సమయంలో జరిగిన ఈ సదస్సు ప్రాధాన్యత సంతరిం చుకుంది.ఈ వివాదాలను దీర్ఘకాలిక ప్రాతిపదికపై పరిష్కరించు కోవడానికి మోదీ తన ప్రసంగంలో తొమ్మిది ప్రతిపాదనలు చేశారు.ఆసియాన్ దేశాల నావికులకు భద్రత కల్పించేం దుకు,దీర్ఘకాలిక అనుసంధానంతో సముద్ర ప్రణాళిక,ఆసియాన్ దేశాలకు చెందిన పర్యాటకులకు ఉచితంగా ఇ–చీసాలు కూటమి ద్వారా జారీ చేయడం,గనుల తవ్వకాలు,కీలకమైన ఖనిజవనరులపై లైనెన్సులు మంజూరు చేయడం,పౌర అణు ఇంధన రంగంలో సాంకేతికతను పరస్పరం బదిలీ చేసుకోవడా నికి ఒక నిబంధనలతో కూడా చట్టబద్ధ చట్రాన్ని రూపొందించు కోవడం వంటి ప్రతిపాదనలు మోదీ ఈ సదస్సు ముందు ఉంచారు.ఆసియాన్ దేవబూలతో భారతదేశం ఎంతో గొప్ప అనుబంధం కలిగి ఉందని,దానికి తమ దేశం ప్రాధాన్యత ఇస్తుం దని చెప్పారు.భారత్–ఆసియాన్ ఇరు పక్షాలు ఈ ప్రాంతంతో పాటు దీనిని అధిగమించినస్థాయిలో శాంతి, సుస్థిరత, దార్శనిక తలతో కలిసి పనిచేయాలని కోరుకుంటున్నట్లు చెప్పారు.



ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం అనిశ్చిత పరిస్థితులు నెలకుని ఉన్నా యని,ఈ దశలో భాగస్వామ్యానికి ఎంతో ప్రాధాన్యత ఏర్పడిం దని చెప్పారు.భారతదేశం పాటిస్తున్న ఈస్ట్ పాలసీ ద్వారా ఇరు పక్షాల సంబంధాల పునరుద్ధరణలో ఎంతో ప్రోత్సాహం లభిం చిందని చెప్పారు. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో ఆసియాన్ కూటమి ఎంతో శక్తిమంతమైనదని,ప్రభావశీలమైనదని, ఎంతో ప్రాధాన్యత ఉందనిఇందులో చైనా, భారత్, జపాన్, ఆస్ట్రేలియా దేశాలు కూడా సంభాషణల భాగస్వాములుగా ఉన్నాయ న్నారు.''గడచిన కొద్ది సంవత్సరాలుగా ప్రపంచం సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది,ఒకదాని తర్వాత మరొక సంక్షోభం వస్తోంది,అందువల్ల ఇప్పుడు ప్రపంచానికి శాంతి అవసరం ఎంతో ఉంది,స్థిరత్వం కావాలి,దార్శనికత ముఖ్యం''అని చెర ప్పారు.ఈ పూర్వరంగంలో, ఈ ఏడాది ఈ శిఖరాగ్ర సదస్సు, ''మన భవిష్యత్తును మనదే ముందుకు నడిపించుకుందాం''అనే ఇతివృత్తానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.భారతదేశంతో కలి పితే ఆసియాన్ కూటమి ప్రపంచంలోనే నాలుగోవంతు జనాభా ఉంటుందని,అందువల్ల పోటీ ద్వారా కాకుండా,సహకారం ద్వారా భవిష్యత్తును తీర్చుదిద్దుకుందామని మోదీ అన్నారు.

భారత్–ఆసియాన్ ఇరు పక్షాలకు గొప్ప సామర్థ్యాలు ఉన్నాయి, వీటిని సాధించడానికి ఉమ్మడి ఆలోచన ఉంది,అందువల్ల కలిసి మనం ఈ ప్రాంతాన్ని శాంతి,సుస్థిరతలకు ఒక ప్రతిబింబంగా తీర్చిదిద్దుదాం'' అన్నారు.

సాంకేతికతను కలిసి సృష్టిద్దాం

ఈ ప్రాంతంలో సాంకేతికతను అభివృద్ధిచేయాల్సిన ఆవశ్యక తను మోదీ ఆసియాన్ సదస్సులో ఉద్ఘాటించారు. భవిష్యత్ ప్రపంచ నిర్మాణంకోసం సాంకేతికత కావాలని,అందువల్ల భార త్–ఆసియాన్ ఇరు పక్షాలు కేలo సాంకేతిక పరిజ్ఞానాన్ని కొను గోలు చేసే వినియోగదారులుగానే ఎప్పటికీ ఉండిపోకూడదని, ఇరుపక్షాలు కలిసి మన ప్రాంతదేశాల ప్రజలను సాంకేతిక నైపు ణ్యంగల సృష్టికర్తలుగా తీర్చిదిద్దుదామని చెప్పారు. ఆసియాన్‌కు ఎంతో బలంతోపాటు లక్ష్యసాధన పట్టుదల కూడా ఉందని,ఈ దృష్ట్యా కలిసి శాంతి,సుస్థిరతలను ఈ ప్రాంతంలో సాధించి చూపించాలన్నారు. ''భారతదేశ వృద్ధి–ఆసియాన్ ప్రగతి ఈ రెండూ ఎంతో లోతైన పరస్పర అనుసంధానంతో కూడుకున్న వని మనం బలంగా విశ్వసిస్తున్నాం, రాబోయే సంవత్సరాలలో ఆసియాన్ దేశాలు 2045ను దార్శనిక లక్ష్యంగా చేసుకోవాలని, భారతదేశం 2047ను వికసిత్ భారత్ లక్ష్యంగా నిర్దేశించుకుం దని, ఈ విధంగా ఆశయాలను పరస్పరం ఒకరిపై మరొకరు ఆధారపడి నెరవేర్చేకుందామన్నారు. వైపరీత్యాల నిర్వహణతో పాటు ముందస్తు హెచ్చరికలు జారీ చేసుకోవడం, కృత్రిమ ఉప గ్రహాల ద్వారా సమాచారాన్ని పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం, వాతావరణ వ్యవస్థకు సంబంధించిన విషయాలను పంచుకో వడం, ఉమ్మడి విన్యాసాలు చేయడం, మానవతాసహాయాన్ని ఉమ్మడిగా విస్తరించడం వంటి చర్యలను పెంపొందించాలని ప్రతిపాదించారు.

గడచిన 12 సంవత్సరాలుగా భారత్–ఆసియాన్ ఇరు పక్షాలు భాగస్వామానికి కొత్త ఊపు ఇచ్చాయని, మన భవిష్యత్తును మనమే తీర్చిదిద్దుకోవాలని అన్నారు. ఇక ఇప్పటినుండీ ఇరుప క్షాలు మన భవిష్యత్తుకు కొత్త దిశామార్గాన్ని నిర్దేశించాలన్నారు. ఈ విధంగా మోదీ ఇప్పటివరకూ ఆసియాన్ నాయకులతో 13వ సారి సమావేశమయ్యారు. 2014 నుండి ఆయన ఆసియాన్ సద స్సులలో ఇరుపక్షాల ఉమ్మడి సమన్వయాన్ని ప్రతిపాదిస్తు న్నారు.ప్రజలమధ్య అనుసంధానాన్ని బలోపేతం చేసేందుకు 100కు పైగా చొరవలు తీసుకున్నామని, సుమారుగా 200 ప్రాజెక్టులను ప్రారంభించడంలో సత్వర ప్రభావం కనిపించిం దని అన్నారు.ఈనాడు భారత్–ఆసియాన్ దేశబూలమధ్య ప్రత్యక్ష విమాన సేవలు కొనసాగుతున్నాయని, పర్యాటకరంగం కూడా బాగా వృద్ధి చెందుతున్నదని చెప్పారు. ఇరు పక్షాల సంబంధాలలో 2027వ సంవత్సరం ఎంతో ప్రత్యేకమైనదని, ఇరు పక్షాలమధ్య సంబంధాలకు 35 సంవత్సరాలు పూర్తయిం దని, వ్యూహాత్మక భాగస్వామ్యం కూడా ఐదు సంవత్సరాలు పూర్తయిందని చెప్పారు. 1992లో భారత్–ఆసియాన్ మధ్య సంబంధాలకు సంభాషణలు ప్రారంభమయ్యాయి. 2012 నాటికి వ్యూహాత్మక భాగస్వామ్యం ఏర్పడింది.

ఎన్‌ఒసి ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి మంగళవారం భేటీ అయ్యారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు నిర్మాణం పూర్త యిందని, ఛత్తీస్‌గఢ్‌లో భూసేకరణ, పరిహారం, పునరా వాసానికి అవసరమైన నిధులను నిబంధనల ప్రకారం చెల్లించేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధంగా ఉందని సిఎం తెలిపారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా ఎన్‌ఒసిని త్వరగా జారీ చేయాలని రేవంత్ రెడ్డి కోరారు. మిగిలిన అనుమతుల ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని సిఎం విజ్ఞప్తి చేశారు.

సమ్మక్క సాగర్ ప్రాజెక్టును తొలుత కాంతనపల్లి వద్ద ప్రతిపాదించారు. ఆ ప్రాంతంలో 11,408 ఎకరాల భూమి ముంపునకు గురయ్యే అవకాశం ఉందని అంచనా వేశారు. 17 ఆదివాసీ గ్రామాలు, భద్రతా మౌలిక సదుపాయాలపై ప్రభావం పడుతుందని గుర్తిం చారు. ముంపును తగ్గించేందుకు బ్యారేజీ నిర్మాణ ప్రాంతాన్ని తుపాకులగూడెంకు మార్చారు. ఐఐటి ఖరగ్‌పూర్ అధ్యయనం ప్రకారం, పూర్తి స్థాయి నీటి మట్టం వద్ద ఛత్తీస్‌గఢ్‌లో సుమారు 33 ఎకరాలు ముంపునకు గురవుతుంది. భారీ వరదల సమయంలోనూ ప్రభావిత ప్రాంతం 100 ఎకరాలకు మించదు. అధ్యయనం కోసం ఛత్తీస్‌గడ్ ప్రభుత్వం కోరిన రూ.9.883 కోట్లను తెలంగాణ ప్రభుత్వం ఏప్రిల్‌లోనే చెల్లించింది. ఐఐటి ఖరగ్‌పూర్ తన నివేదికను జూలై 30వ తేదీన ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వానికి సమర్పించింది. ములుగు జిల్లా తుపాకుల గూడెం వద్ద సమ్మక్క సాగర్ బ్యారేజీ నిర్మాణం పూర్త యింది. పూర్తి స్థాయి నీటి మట్టం +83 మీటర్ల వద్ద దీని నిల్వ సామర్థ్యం 6.94 టిఎంసిలు. కరువు ప్రభావిత, వెనుకబడిన, గిరిజన ప్రాంతాల సాగు, తాగునీటి అవస రాలకు గోదావరి జలాలను వినియోగించాలనేది ఈ ప్రాజెక్టు లక్ష్యమని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియ జేసింది.

రెరా జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

పాటించడంలో విఫలమైతే, రెరా చట్టం, 2016లోని సెక్షన్ 63 ప్రకారం అదనపు భారీ జరిమానాలు, కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని తెలంగాణ రెరా సంబంధిత నిర్మాణ సంస్థలను తీవ్రంగా హెచ్చరించింది.

తక్షణమే ఫ్లాట్ అప్పగించాలని ఆదేశం

మియాపూర్‌లోని 'అరైన్ ఎమరాల్డ్' ప్రాజెక్టులో ఫ్లాట్ నంబర్ 502ను కొనుగోలుదారుకు తక్షణమే అప్పగిం చాలని 'అరైన్ ఇన్‌ఫ్రా' సంస్థను రెరా ఆదేశించింది. కొనుగోలుదారు రూ.6.58 లక్షల బకాయిలు చెల్లించా లంటూ బిల్డర్ చేసిన వాదనను అథారిటీ తోసిపుచ్చింది. ఆ బకాయిలకు సంబంధించి విక్రయ ఒప్పందంలో కానీ, రిజిస్టర్డ్ సేల్ డీడ్‌లో కానీ ఎటువంటి ఆధారాలు లేవని స్పష్టం చేసింది.

ఎన్‌విఎం ఆదిత్య హోమ్స్ : హెచ్‌ఎండిఎ అనుమతులు తీసుకోకుండా, ప్రాజెక్టు నిర్మాణం చేపట్టకుండా ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడినందున కొనుగోలుదారు చెల్లించిన రూ.27.16 లక్షలను వడ్డీతో సహా వాపసు చేయాలని స్పష్టం చేసింది.

భువంతేజ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్: కొనుగోలుదారుల నుంచి అడ్వాన్స్‌లు వసూలు చేసి, ప్రాజెక్టు నిర్మాణాన్ని మధ్య లోనే నిలిపివేసినందున రూ.26 లక్షలను వడ్డీతో సహా తిరిగి చెల్లించాలని ఆదేశించింది.

శ్రీ ఆదిత్య స్క్వేర్స్ : నిర్మాణంలో జాప్యం జరగడంతో పాటు, కొనుగోలుదారు బుకింగ్ రద్దు చేసుకున్నా నగదు వాపసు హామీని నిలబెట్టుకోకపోవడంతో రూ.17 లక్ష లను వడ్డీతో సహా చెల్లించాలని ఆదేశాలు జారీ చేసింది.

బివిఆర్ ఇన్‌ఫ్రా డెవలపర్స్ : ఒప్పందం ప్రకారం ఫ్లాట్ రిజిస్ట్రేషన్ పూర్తి చేయకపోవడం, ఇచ్చిన రీపేమెంట్ చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో రూ.7 లక్షలను వడ్డీతో సహా తిరిగి ఇవ్వాలని స్పష్టం చేసింది.

వాసవి రియల్టర్స్ ఎల్‌ఎల్‌పి : ప్రాజెక్టు నిర్మాణ జాప్యం కారణంగా ఫ్లాట్ అప్పగించడంలో విఫలమైనందున, కొనుగోలుదారు చెల్లించిన రూ.49.50 లక్షలపై 2025 ఫిబ్రవరి 7 నుంచి ఫ్లాట్‌ను అప్పగించే వరకు ఏటా 10.85 శాతం వడ్డీ చెల్లించాలని ఆదేశించింది.

భూ ప్రకంపనలు

(మొదటి పేజీ తరువాయి)

వినిపించాయని, ఇళ్లలోని పైకప్పులు సైతం కంపించినట్లు అనిపించిందని స్థానికులు వెల్లడించారు. మణుగూరు పట్టణంతో పాటు పలు ఇతర ప్రాంతాల ప్రజలు కూడా తమ ప్రాంతాల్లో ప్రకంపనలు అనుభూతి చెంది నట్లు చెబుతున్నారు. బ్లాస్టింగ్ సమయం కాక పోవడం మరింత సందేహాలకు తావిస్తోంది. మణుగూరు ప్రాంతం సింగరేణి బొగ్గు గనులు, ఓపెన్‌కాస్ట్ ప్రాజెక్టులు, అండర్ గ్రౌండ్ మైన్స్‌కు కేంద్రంగా ఉంది. సాధార ణంగా మైనింగ్ కార్యకలాపాల్లో బ్లాస్టింగ్‌లు జరిగినప్పుడు పరిసర ప్రాంతాల్లో ప్రకంప నలు అనుభూతి చెందే అవకాశం ఉంటుంది. అయితే స్థానికులు చెబుతున్న ప్రకారం ఈ ప్రకంపనలు చోటుచేసుకున్న సమయంలో బ్లాస్టింగ్ సమయం కాదని తెలుస్తోంది

ముగిసిన ధోనీ శకం..

ఐపిఎల్‌కు మహీ రిటైర్‌మెంట్

కెప్టెన్‌గా చెరగని రికార్డ్



భారత క్రికెట్ దిగ్గజం మహేంద్ర సింగ్ ధోనీ ప్రస్థానం ముగిసింది. 19 ఏళ్ల సుదీర్ఘ ఐపిఎల్ కెరీర్‌కు వీడ్కోలు పలికిన ధోనీ.. మెంటార్‌గా తన రెండో ఇన్నింగ్స్ ప్రారంభించేందుకు సిద్ధమయ్యాడు. 6 ఏళ్ల క్రితమే అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ధోనీ.. ఐపిఎల్‌లో కొనసాగి అభిమానులను అలరించాడు. ఇప్పుడు బ్యాట్ వదిలేసి.. ఆటగాళ్లకు పెద్దన్న పాత్ర పోషించేందుకు రెడీ అయ్యాడు. 19 ఏళ్ల తన ఐపిఎల్ కెరీర్‌లో 17 సీజన్ల పాటు సిఎస్‌కెకు ధోనీ ప్రాతినిధ్యం వహించాడు. ఆ రెండేళ్లు(2016, 2017) కూడా సిఎస్‌కెను లీగ్ నుంచి నిషేధం విధించడంతో రైజింగ్ స్టార్స్ పుణేకు ఆడాడు. అరంగేట్ర ఐపిఎల్ నుంచి సిఎస్‌కెకు సారథిగా వ్యవహరించిన ధోనీ ఐదు టైటిళ్లతో పాటు రెండు ఛాంపియన్స్ లీగ్ ట్రోఫీలతో సిఎస్‌కెను సక్సెస్‌ఫుల్ టీమ్‌గా నిలబెట్టాడు.

కూల్ కెప్టెన్సీతో..ఈ టోర్నీ చరిత్రలోనే అత్యంత విజయవంతమైన వికెట్ కీపర్, బ్యాటర్లలో ఒకడైన ధోనీ.. తన కూల్ కెప్టెన్సీతో మ్యాచ్‌లను ముగించే సామర్థ్యంతో అభిమానులను ఆకట్టుకున్నాడు. ఐపిఎల్ రిటెన్షన్ గడువు ముగియడానికి మూడు గంటల ముందు ధోనీ రిటైర్మెంట్ వార్త వెలువడటంతో అభిమానులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. ధోనీ రిటైర్మెంట్ నేపథ్యంలో అతని ఐపిఎల్ కెరీర్‌కు సంబంధించిన హైలైట్స్, రికార్డులు ఇవి.

ఐదు టైటిళ్లు.. 10 ఫైనల్స్..

చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్‌గా ధోనీ ఐదు టైటిళ్లు అందించాడు. 2010, 2011, 2018, 2021, 2023 సీజన్లలో విజేతగా నిలబెట్టాడు. 16 సీజన్ల లో సిఎస్‌కెకు సారథ్యం వహించిన ధోనీ.. 10 సీజన్లలో ఫైనల్‌కు చేర్చాడు. అరంగేట్ర ఐపిఎల్ సీజన్ 2008 ఫైనల్లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడిన సిఎస్‌కె.. 2012, 2013, 2015, 2019 సీజన్ల లోనూ తృటిలో టైటిల్ చేజార్చుకుంది.

2010, 2011 సీజన్లలో వరుసగా రెండు టైటిళ్లు గెలిచిన సిఎస్‌కె ఈ ఘనత సాధించిన తొలి జట్టుగా రికార్డ్ సాధించింది. రోహిత్ శర్మతో కలిసి అత్యధిక టైటిళ్లు గెలిచిన కెప్టెన్‌గా ధోనీ నిలిచాడు. ధోనీ సారథ్యంలో సిఎస్‌కె 12 సార్లు ప్లే ఆఫ్ చేరింది. రైజింగ్ పుణే సూపర్ జెయింట్స్ జట్టు తరఫున కూడా ధోనీ ఐపిఎల్ 2017 ఫైనల్ ఆడాడు.

కెప్టెన్‌గా ధోనీ రికార్డ్..

సిఎస్‌కె కెప్టెన్‌గా ధోనీ పలు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. 235 ఐపిఎల్ మ్యాచ్‌లలో జట్టును నడిపించిన అతను.. అత్యధిక మ్యాచ్‌లకు సారథ్యం వహించిన ఆటగాడిగా నిలిచాడు. ఇందులో 136 విజయాలు అందించాడు. ఐపిఎల్ చరిత్రలోనే మరే కెప్టెన్ ఈ రికార్డ్ సాధించలేదు. రైజింగ్ పుణే సూపర్ జెయింట్ తరఫున 14 మ్యాచ్‌లకు ధోనీ సారథ్యం వహించాడు. ఇందులో 5 విజయాలు అందించాడు.

బ్యాటర్‌గా. 5,439 పరుగులు..

కెప్టెన్‌గానే కాకుండా బ్యాటర్‌గానూ ధోనీ అద్భుతమైన రికార్డ్స్ నెలకొల్పాడు. 278 మ్యాచ్‌లలో 38.30 సగటు, 137.45 స్ట్రైక్‌రేట్‌తో 5439 పరుగులు చేశాడు. ఇందులో అత్యధిక స్కోర్ 84 నాటౌట్ కాగా.. 24 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. తన ఐపిఎల్ కెరీర్‌లో ధోనీ 375 ఫోర్లతో పాటు 264 సిక్స్‌లు కొట్టాడు.

కీపర్గా 200 డిస్మిసల్స్..

వికెట్ కీపర్‌గా ధోనీ 205 ఔట్లలో పంచుకున్నాడు. ఇందులో 158 క్యాచ్‌లతో పాటు 47 స్టంపింగ్స్ ఉన్నాయి. 200 డిస్మిసల్స్ మైలురాయి అందుకున్న ఏకైక వికెట్ కీపర్‌గా ధోనీ నిలిచాడు. 2010, 2014లో ఛాంపియన్స్ లీగ్ టైటిల్స్ అందించాడు.

సిఎస్‌కెకు ఐకాన్ ప్లేయర్‌గా అభిమానుల ప్రేమను సొంతం చేసుకున్నాడు. ధోనీ లేనిది సిఎస్‌కె లేదని ఆ జట్టు ఓనర్ అన్నాడంటేనే అతని పాపులారిటీ సొంతం చేసుకోవచ్చు. ఈ క్రమంలోనే ఆటగాడిగా తప్పుకున్న ధోనీకి మెంటార్‌గా సిఎస్‌కె మేనేజ్‌మెంట్ బాధ్యతలు అప్పగించింది.

బాలుర క్రికెట్ లీగ్‌లో బాలిక జ్ఞానశ్రీ సంచలనం..

అజేయంగా 69 పరుగులు

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: బాలురతో పోటీపడి బ్యాట్ ఝుళిపించిన బాలిక జ్ఞానశ్రీ అండర్–16 క్రికెట్ లీగ్‌లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. తెలంగాణ క్రికెట్ అసోసియేషన్ (టిసిఎ) నిర్వహిస్తున్న అండర్–16 బాలుర స్టేట్ లీగ్ ఫేజ్2లో సంగారెడ్డి జట్టు తరఫున బరిలోకి దిగిన ఆమె 69 పరుగులతో అజేయంగా నిలిచి తన ప్రతిభను చాటుకుంది. సోమవారం వన్ ఛాంపియన్ క్రికెట్ గ్రౌండ్‌లో ఖమ్మం జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జ్ఞానశ్రీ రాణించడంతో సంగారెడ్డి 31 పరుగుల తేడాతో విజయం సాధించింది. తొలుత సంగారెడ్డి 20 ఓవర్లలో ఒక వికెట్‌కు 166 పరుగులు చేయగా, లక్ష్య ఛేదనలో ఖమ్మం 7 వికెట్లకు 135 పరుగులకే పరిమితమైంది. మూడు వికెట్లు తీసిన సాయి ప్రద్యుమ్నకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది. ఇతర మ్యాచ్‌ల్లో వికారాబాద్ జట్టు నాగర్‌కర్నూల్‌పై 6 వికెట్ల తేడాతో, రంగారెడ్డి జట్టు గజ్వేల్‌పై 5 వికెట్ల తేడాతో విజయం సాధించాయి. మరో పోరులో నాగర్‌కర్నూల్ 7 పరుగుల తేడాతో మహబూబ్‌నగర్‌ను ఓడించింది.




బాలుర లీగ్‌లో జ్ఞానశ్రీకి అవకాశం కల్పించడం ద్వారా ప్రతిభకు లింగభేదం లేదనే సందేశాన్ని టిసిఎ చాటింది.

వ్యవస్థను ప్రశ్నించడం అవసరం



స్త్రీ విముక్తి ఉద్యమాన్ని కేవలం మహిళలకు సమాన హక్కులు కల్పించాలనే రాజకీయ పోరాటంగా చూడటం దాని విస్తృత అర్థాన్ని కుదిస్తుంది. నిజానికి ఇది సమాజం సహజం, సాధారణం, ఇలాగే ఉండాలి అని భావించే అనేక విలువలను, నియమాలను, అధికార సంబంధాలను ప్రశ్నించే మేధో ప్రక్రియ. కుటుంబం, వివాహం, లైంగికత, చట్టం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలు, విద్య, మతం వంటి వ్యవస్థలు స్త్రీ జీవితాన్ని ఎలా ప్రభావితం చేస్తున్నాయో విశ్లేషించడం ఇందులో భాగం. స్త్రీలపై అసమానత కేవలం చట్టాల్లోనే ఉండదు. అది రోజువారీ జీవితంలోని అలవాట్లు, భాష, సామాజిక అంచనాలు, కుటుంబ పాత్రలు, ఉద్యోగ విభజనలోనూ కనిపిస్తుంది. అందువల్ల చట్టపరమైన సంస్కరణలు అవసరమైనప్పటికీ, అవి ఒక్కటే విముక్తిని తీసుకురావు. సమాజం స్త్రీని చూసే విధానం మారాలి. అంటే, స్త్రీ విముక్తి అనేది హక్కుల సాధనతో పాటు అర్థాల పునర్నిర్మాణం కూడా. స్త్రీవాద ఆలోచన మొదట సిద్ధాంత గ్రంథాల నుంచి పుట్టలేదు. అది రోజువారీ అనుభవాల నుంచి బలపడింది. బాలికలకు కుటుంబం విధించే నియమాలు, విద్యలో ఎదురయ్యే పరిమితులు, వివాహంపై ఒత్తిడి, ఉద్యోగాల్లో వివక్ష, గృహహింసకు విలువ ఇవ్వకపోవడం వంటి అనుభవాలు వ్యక్తిగత సమస్యలుగా కనిపించవచ్చు. కానీ అనేక మంది మహిళలు ఇలాంటి అనుభవాలను ఒకే సారి ఎదుర్కొన్నప్పుడు అవి వ్యక్తిగత సమస్యలు కాకుండా సామాజిక నిర్మాణాల ఫలితాలని స్పష్టమవుతుంది. ఈ అవగాహనకే వ్యక్తిగతం రాజకీయమే అనే స్త్రీవాద భావన ప్రాధాన్యం ఇచ్చింది. అయితే అన్ని మహిళల అనుభవాలు ఒకేలా ఉండవు. వర్గం, కులం, జాతి, మతం, ప్రాంతం, లైంగికత వంటి అంశాలు స్త్రీల జీవితాలను భిన్నంగా ప్రభావితం చేస్తాయి. అందువల్ల స్త్రీ అనే వర్గాన్ని ఒకే అనుభవంగా చూడటం కూడా కొత్త సరళీకరణకు దారి తీస్తుంది. ఆధునిక స్త్రీవాద ఆలోచన ఈ భిన్నత్వాన్ని గుర్తించి, వివిధ సామాజిక గుర్తింపులు పరస్పరం ఎలా ప్రభావితం చేస్తాయో పరిశీలిస్తోంది. స్త్రీల రక్షణకు చట్టపరమైన హక్కులు అత్యంత అవసరం. కానీ స్త్రీవాద దృష్టిలో చట్టం పూర్తిగా తటస్థమైన వ్యవస్థ కాదు. సమాజంలో ఉన్న అధికార సంబంధాలు చట్టాల రూపకల్పనను కూడా ప్రభావితం చేస్తాయి. ఎవరి హక్కులను గుర్తించాలి, ఎవరిని రక్షించాలి, ఏ ప్రవర్తనను నేరంగా పరిగణించాలి అనే నిర్ణయాలు సామాజిక విలువలతో ముడిపడి ఉంటాయి. ఇక్కడ ఒక ముఖ్యమైన విరోధం కనిపిస్తుంది. స్త్రీలను హింస నుంచి రక్షించడానికి చట్టం అవసరం. అదే సమయంలో, చట్టం స్త్రీని ఎప్పటికీ బాధితురాలు అనే గుర్తింపులో బంధిస్తే ఆమె స్వేచ్ఛ, నిర్ణయాధికారం, వ్యక్తిత్వం వెనుకబడే ప్రమాదం ఉంది. అందు కే రక్షణ, స్వేచ్ఛ రెండిం టినీ సమతుల్యం చేయాలి. రక్షణ స్త్రీ స్వయంప్రతిపత్తికి ప్రత్యామ్నాయం కాకూడదు. స్త్రీ శరీరాన్ని సమాజం ఎలా చూస్తుందనే ప్రశ్న కూడా ఇక్కడ కీలకం. సినిమాలు, ప్రకటనలు, మీడియా, ప్రజా సంస్కృతి స్త్రీ శరీరాన్ని ఆకర్షణకు సంబంధించిన వస్తువుగా చూపించే సందర్భాలు అనేకం. దీనిని స్త్రీవాద సిద్ధాంతం పురుష దృష్టిగా విశ్లేషించింది. అయితే ప్రేక్షకులు కేవలం స్వీకర్తలు మాత్రమే కారని కూడా గుర్తించాలి. స్త్రీలు తమను తాము ఎలా చూస్తారో, ఇతరులు తమను ఎలా ప్రతినిధ్యం చేస్తున్నారో ఎలా ప్రశ్నిస్తారో కూడా అర్థం చేసుకోవాలి. అందువల్ల దృశ్య సంస్కృతిని ఒక ఏకదిశా ప్రక్రియగా కాకుండా, అర్థాల కోసం జరిగే నిరంతర పోరాటంగా చూడడం అవసరం. లైంగికత విషయంలోనూ ఇదే సంక్లిష్టత కనిపిస్తుంది. లైంగిక హింసను ప్రశ్నించడం అత్యవసరం. అదే సమయంలో స్త్రీల లైంగిక కోరిక, ఆనందం, ఎంపిక, స్వయంప్రతిపత్తికి కూడా స్థానం ఉండాలి. స్త్రీని కేవలం హింసకు గురయ్యే వ్యక్తిగా చూపించడం ఆమె స్వతంత్రతను తగ్గిస్తుంది. అయితే ఎంపిక అనే భావనను కూడా ప్రశ్నించాలి. ఒక మహిళ తీసుకున్న నిర్ణయం నిజమైన స్వేచ్ఛా నిర్ణయమా, లేక ఆర్థిక, కుటుంబ, సామాజిక ఒత్తిళ్ల ప్రభావమా? ప్రతి సందర్భానికి ఒకే సమాధానం ఉండదు. ఈ సంక్లిష్టతను అంగీకరించడమే స్త్రీవాద విశ్లేషణలో ముఖ్యమైన లక్షణం. హక్కులు, గుర్తింపుల విషయంలోనూ ఇలాంటి ఉద్రిక్తత కనిపిస్తుంది. రాజకీయ పోరాటాలకు స్త్రీ అనే వర్గం అవసరం. చట్టాలు కూడా హక్కులను నిర్వచించడానికి స్పష్టమైన వర్గాలను కోరుతాయి. కానీ స్త్రీల అనుభవాలు ఒకేలా ఉండవు. కులం, వర్గం, జాతి, లైంగికత వంటి గుర్తింపులు పరస్పరం ముడిపడి ఉంటాయి. హక్కులను సాధించాలి, అదే సమయంలో హక్కుల పరిధిని విస్తరించాలి. రక్షణ అవ ప్రతిధ్వని సరం, కానీ రక్షణ మాత్రమే... గాలి పేరుతో స్వేచ్ఛను లో తేలియాడుతున్న పరిమితం పొగవాసనతో కలిసిపోయిం చేయకూ ది. ఆమె తిరిగి ఇంటికి వచ్చేసరికి, దదు. చొక్కాపై రక్తం, కళ్లలో నిశ్శబ్దం. తుపాకిని తండ్రి చేతిలోపెట్టి, ఒక్క మాట కూడా చెప్పకుండా ఉదయపు వెలుగులోకి నడిచిపోయింది. 'కాచీస్ కౌంటీ' మీదుగా ప్రయాణించి నవాళ్లు ఆమెను ఇంకా అక్కడే చూశారు. నోరా వాలంటైన్ అడవిలో పుట్టింది, అగ్నిలావెలిగింది. నోరా వంటి కొంతమంది దేవదూతలు రెక్కల బదులు దుమ్మును ధరించి తిరుగుతారు... ఆమె వెళ్లిన దారిలో, నరకమే కూడా వెంబడించడానికి ధైర్యం చేయలేదు... ఇవీ ప్రజల దృష్టిలో ఆమె గురించిన అభిప్రాయాలు.

ధైర్యానికి ప్రతిరూపం 'నోరా'



రాంచ్ యజమాని కుమార్తె, అదుపులో ఉండని స్వభావం గల అమ్మాయి. పగ్గాలు లేకుండానే గుర్రాన్ని అదుపులో పెట్టగలదని, పంద గజాల దూరంలో దూకుతున్న జాక్‌రాబిట్‌ని ఒక్క గుండుతో పడగొట్టగలదని ఆమె గురించి చెప్పుకునే వారు. కొండల నుంచి దొంగలు దిగివచ్చిన ఆ రాత్రి, ఆకాశం మంటలతో ఎర్రబడిపోయింది. వాళ్లు ఆమె అన్నను చంపారు. కుటుంబ పశువులను అగ్నిమధ్యకి తోసేశారు. ఆ దృశ్యం చూసి పట్టణం మొత్తం నోరా ధైర్యం పతనమవుతుందని అనుకున్నారు. కానీ ఆమె కళ్ల నుంచి ఒక్క చుక్క కన్నీరు రాలేదు. మాటలూ లేవు, అరుపులూ లేవు. ఆమె తండ్రి విన్‌చెస్టర్ తుపాకిని నిశ్శబ్దంగా శుభ్రం చేసింది. తెల్లవారకముందే ఎవరికీ వీడ్కోలు చెప్పకుండా ఎర్రటి ఎడారిలోకి గుర్రంపై దూసుకెళ్లింది. మూడు రోజులపాటు ఆమె వారిని వెంబడించింది. గుర్రం మీదే కునుకు తీసింది. నాలుగో రోజు ఉదయం ఆమెవాళ్లను చూసింది.. దొంగిలించిన విస్కీతో మత్తులో ఉన్నారు. మొదటి తూటాతోనే నాయకుడిని నేలకొరిగించింది. రెండో గుండు అతని పక్కవాడి నవ్వు ఆపేసింది. అంతాముగిసినప్పుడు, అక్కడ మిగిలింది తుపాకీ రిజోనా టెరిటరీ, 1879, అప్పటికి ఆమె వయసు కేవలం పదిహేడు సంవత్సరాలు. కానీ ఆ వేసవిలో చెలరేగిన అగ్ని ఆమె జీవితాన్ని పూర్తిగా మార్చేసింది. ప్రజలు ఆమెను 'నోరా వాలంటైన్' అని పిలిచేవారు.

భగీరథ కార్మికుల వేతనాలు పెంచకపోతే ఆందోళన చేస్తాం

పల్లా దేవేందర్ రెడ్డి



ప్రజాపక్షం/నల్లగొండ : మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికుల వేతనాలు వెంటనే పెంచాలని ఎఐటియుసి రాష్ట్ర డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి కోరారు. వేతనాలు పెంచకపోతే ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. సోమవారం నల్లగొండ మిషన్ భగీరథ ఎస్ఇ నాగేశ్వరరావుకు మిషన్ భగీరథ కార్మికుల సమస్యలపై ఎఐటియుసి ఆధ్వర్యం లో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత ఒప్పందం ప్రకారం 2026 జూలై నాటికి అగ్రిమెంట్ ముగిసిందని, జూలై నుంచి కొత్త వేతనాలు పెంచాల్సి ఉన్నప్పటికీ ఇప్పటి వరకు కాంట్రాక్టర్ల వైపు నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. నిత్యావసర ధరలు పెరుగుతున్నా కార్మికుల వేతనాలు పెరగకపోవడం విచారకరమన్నారు. ప్రజలకు తాగు నీరు అందిస్తున్న కార్మికుల జీవితాల్లోనే కారుమబ్బులు అలుముకున్నాయని, ప్రతి నెలా వేతనాలు రాక, చాలీచాలని వేతనాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే కాంట్రాక్టర్లతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేసి వేతనాలు పెంచాలని, కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని దేవేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కెవిన్ రెడ్డి, మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి జానీ, కోశాధికారి టి.సత్యనారాయణ, మేడి రామకృష్ణ, ఎం.సత్తయ్య, వై.వెంకట్‌రెడ్డి, సింగం మహేష్, ఎండి అలీముద్దీన్, శంకర్, మంగ యాదమ్మ, అలివేలు తదితరులు పాల్గొన్నారు.

యువత చేతుల్లో దేశ భవిష్యత్తు



సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాలనరసింహ

ప్రజాపక్షం/గద్వాల రూరల్ : దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.బాల నరసింహ పేర్కొన్నారు. అఖిల భారత యువజన సమాఖ్య (ఎఐవైఎఫ్) జోగులాంబ గద్వాల జిల్లా రెండో మహాసభలు గద్వాల పట్టణంలోని నల్లగుంట వాల్మీకి భవన్‌లో మంగళవారం ఘనంగా జరిగాయి. మహాసభలకు ముందు యువజన సమాఖ్య జెండాను బాల నరసింహ ఆవిష్కరించి మహాసభలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయర మాట్లాడుతూ నేటి సమాజంలో యువత అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు తగ్గి యువత భవిష్యత్తును ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకులు, ఎన్నికల సమయంలో యువతకు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వస్తున్నప్పటికీ, వాటిని అమలు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నాయని విమర్శించారు. దేశంలోని అసలైన సమస్యలైన నిరుద్యోగం, పేదరికం, ధరల పెరుగుదల, విద్య, వైద్యం వంటి ప్రజా సమస్యల నుంచి ప్రజల దృష్టికి మళ్లించే ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. యువత ఇలాంటి విభజన రాజకీయాలకు ప్రభావితం కాకుండా శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోని సమాజ మార్పు కోసం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. యువతలో ప్రశ్నించే తత్వం, సామాజిక బాధ్యత, ప్రజాస్వామిక విలువలు పెంపొందించాల్సిన అవసరం ఉందని తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య యువతకు అండగా నిలుస్తూ, విద్యార్థి, యువజన ఉద్యమాలను మరింత బలోపేతం చేయాలని సూచించారు. జోగులాంబ గద్వాల జిల్లాలో యువత ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారం కోసం పోరాటాలు నిర్వహించేందుకు ఈ మహాసభలు వేదిక కావాలని బాల నరసింహ ఆకాంక్షించారు. మహాసభల్లో ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నెల్లికంటి శ్రీకాంత్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రాము, సిపిఐ జోగులాంబ గద్వాల జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు, ఎఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రఘునాథ్‌రెడ్డి, వెంకటేష్, డిహెచ్‌పిఎస్ నాగార్జున, ఎఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రవీణ్‌తో పాటు ప్రజాసంఘాల నాయకులు రంగన్న, ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

సమాజ మార్పులో యువత పాత్ర కీలకం


సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు

హనుమకొండలో సిపిఐలో చేరిన పలువురు యువకులు

ప్రజాపక్షం/హనుమకొండ : సమాజ మార్పులో యువత పాత్ర కీలకమని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ బాల సముద్రంలోని సిపిఐ జిల్లా కార్యాలయంలో ఆయన సమక్షంలో పలువురు యువకులు సిపిఐ సిద్ధాంతాలకు, ప్రజా పోరాటాలకు ఆకర్షితులై పార్టీలో చేరారు. పార్టీలో చేరిన యువతకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం తక్కళ్లపల్లి మాట్లాడుతూ నిరుద్యోగ సమస్య, ప్రజా వ్యతిరేక విధానాలపై సిపిఐ నిరంతరం పోరాడుతోందని, యువత పెద్దఎత్తున కమ్యూనిస్టు ఉద్యమంలో భాగస్వాములు కావడం శుభపరిణామన్నారు. నేడు ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనిస్టుల ప్రభావం పెరుగుతున్నదని, దేశంలోనూ యువత కమ్యూనిస్టు సిద్ధాంతం వైపు ఆకర్షితులు అవుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారిలో డివైఎఫ్ఐ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సముద్రాల అనిల్, మాజీ ఉపాధ్యక్షులు శివరాత్రి కరుణాకర్, అంతనగిరి దేవేందర్, సిఐటియు నాయకులు యష్టం రవి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సిపిఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కరె భిక్షపతి, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, నాయకులు ఏదునూరి వెంకట్రాజు, ఎన్.అశోక్ స్టాలిన్, జక్కు రాజుగౌడ్, యాకయ్య, కిషోర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



కరువు జిల్లాగా 'మహబూబాబాద్'




సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయ సారథిరెడ్డి డిమాండ్

ప్రజాపక్షం/గార్ల : మహబూబాబాద్ జిల్లాను వెంటనే కరువు జిల్లాగా ప్రకటించి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని సిపిఐ జిల్లా కార్యదర్శి విజయ సారథిరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ధరావత్ వీరన్న అధ్యక్షతన స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో మండలవారం జరిగిన కార్యవర్గ సమావేశంలో విజయసారథిరెడ్డి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా పత్తి, మిర్చి, వరి, మొక్కజొన్న పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. పెట్టిన పెట్టుబడి రాక అప్పుల పాలయ్యారని, రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ.30వేలు నష్టపరిహారం చెల్లించాలని, రుణాలు మాఫీ చేసి, కొత్త రుణాలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని, ఉపాధి హామీ పనులు పెంచాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, పశువులకు దాణా, నీటి సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాస్, మండల కార్యదర్శి జంపాల వెంకన్న, నాయకులు కృష్ణ మూర్తి, మేదరమెట్ల గిరిప్రసాద్, భూక్యా హరినాయక్, బోగెల్లి కోటేశ్వరి, లావుడియా భీముడు పాల్గొన్నారు.

కనీస వేతన జీఓ ఇచ్చారు..అమలు మరిచారు

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి రమేష్

మానవహారం, నిరసన బతుకమ్మతో ఆసుపత్రి కార్మికుల వినూత్న నిరసన



ప్రజాపక్షం/వరంగల్ : కనీస వేతన జిఓలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేశారని, అమలు మరిచారని మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి గన్నారపు రమేష్ అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుద్ధ్య, పేషెంట్ కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు కనీస వేతనాలు రూ.26 వేలకు పెంచాలని, కాల పరిమితి ముగిసిన ఏజెన్సీలను రద్దు చేయాలని, కార్పొరేషన్ ద్వారా నేరుగా ప్రభుత్వం జీతాలు చెల్లించాలని, కార్మికులకు పనిభారం తగ్గించాలని తదితర డిమాండ్ల సాధనకు గత ఐదు రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఆసుపత్రి కార్మికుల నిరవధిక ఆందోళనలో భాగంగా మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో వరంగల్ జిల్లా సికెఎం ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు ఆసుపత్రిలో బతుకమ్మ ఆడుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గన్నారపు రమేష్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి కాంట్రాక్టు కార్మికులు దశాబ్దాల తరబడి కనీస వేతనాలకు నోచుకోకుండా వెట్టి చాకిరికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టబద్ధంగా కార్మికులకు రావాల్సిన వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐలు సక్రమంగా అందడం లేదని, వీటిని పర్యవేక్షించాల్సిన లేబర్ శాఖ కాంట్రాక్టర్ల కాసులకు కక్కుర్తి పడి చేతులెత్తేసిందని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలతో కార్మికుల జీవనం విధ్వంసం అవుతుందన్నారు. ప్రభుత్వం తక్షణమే కాంట్రాక్టు కార్మికులతో చర్చలు జరిపి కనీస వేతనం రూ. 26 వేలకు పెంచాలని, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి అధ్యక్ష, కార్యదర్శులు కలకోట్ల రాజు, నాగవెల్లి శంకర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సంధ్యారాణి, రఘు, వరప్రసాద్, దేవేందర్, ప్రవర్ధన్, రాము, రవీందర్, శ్రీశైలం, రవి, వంశీ, కమలాకర్, రాజు, శంకర్, కవిత, బిందు, సక్కుబాయి, దేవి, శోభ, సంధ్య, నీలా, అరుణ, వరలక్ష్మి, కావ్య, మాధవి, లావణ్య పాల్గొన్నారు.

నిజామాబాద్ : రాష్ట్రంలో మెడికల్ కాంట్రాక్ట్ కార్మికులకు 1న వేతనాలు ఇస్తామని ప్రభుత్వం మాటనిచ్చి మరిచిందని ఎఐటియుసి జిల్లా అధ్యక్షుడు ఓమయ్య అన్నారు. మెడికల్ కాంట్రాక్ట్ కార్మికుల 6వ రోజు ధర్నాలో భాగంగా మంగళవారం జిల్లాకేంద్రంలో అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం ఎమ్మెల్యే ధన్‌పాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు చక్రపాణి, గోవర్ధన్, ఫిరోజ్‌అలీ, భాగ్య లక్ష్మి, కవిత, స్వరూప, భారతి, సాయి సుధా, సాయి రెడ్డి, పవిత్ర తదితరులు పాల్గొన్నారు.



లిడ్ క్యాప్ భూములను కాపాడాలి

ఎమ్మెల్యే వీరేశానికి మంద కృష్ణమాదిగ వినతి

**ప్రజాపక్షం/చిట్యాలఃఃః

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు



ప్రజాపక్షం/కాజీపేట: వర్ధన్నపేట నియోజకవర్గం కడిపికొండలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాగరాజు మాట్లాడుతూ... రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారానే మద్దతు ధరకు కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన గన్నీ సంచులు, తూకం యంత్రాలు, ఇతర సదుపాయాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధికి ప్రజా ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తూ రైతులకు అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో కాజీపేట దర్గా పాక్స్ చైర్మన్ గంగుల శ్రీనివాస్ రెడ్డి, సదానందం, హరీష్ రెడ్డి, శ్రీనివాస్, శ్రీకాంత్, స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా అమలుకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రతి అర్హత కుటుంబానికీ రూ.5 లక్షల బీమా

18 నుండి డిసెంబర్ 19 వరకు ప్రక్రియ

ప్రజాపక్షం/జనగామ: జిల్లాలో ఇందిరమ్మ జీవిత బీమా పథకం అమలుకు పకడ్బంది ఏర్పాట్లు చేసినట్లు జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. ఈ నెల 18 నుండి ప్రారంభమై డిసెంబర్ 19 వరకు కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ జీవిత బీమా పథకం ద్వారా ప్రతి కుటుంబానికి ఐదు లక్షల బీమా చేయనున్నట్లు తెలిపారు. 1967 నవంబర్ 19 నుండి 2008 నవంబర్ 18 వరకు జన్మించిన వారై ఉండాలన్నారు. ఈ నెల 18 నుండి డిసెంబర్ 19 వరకు జరిగే ఈ ప్రక్రియను జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారేఇ పర్యవేక్షిస్తారన్నారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూపం 18004256605 హెల్ప్‌లైన్ నెంబర్ పనిచేస్తుందన్నారు. జిల్లాలోని 12 మండలాల పరిధిలో 180 గ్రామాలు ఉన్నాయని, జనగామ, స్టేషన్‌ఘన పూర్ మున్సిపాల్టీ పరిధిలోని ప్రతి వార్డులో కూడా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఆదివారం సైతం శిబిరం కొనసాగుతుందని, రేన్ కార్డు నెంబర్‌నే ధరఖాస్తు నంబర్‌గా పరిగణిస్తారన్నారు. రేషన్ కార్డు లేని కుటుంబాలకు ప్రభుత్వం నిర్దేశించిన కోడ్ ఆధారంగా ప్రత్యేక గుర్తింపు సంఖ్య కేటాయించి నమోదు చేయనున్నారన్నారు. రేషన్ కార్డులో ఈకేవైసి పెండింగ్‌లో ఉన్న కుటుంబాలు సంబంధిత రేషన్‌షాపులో ఈకేవైసి పూర్తి చేసుకోవాలన్నారు. శిబిరానికి బీమా పొంపదే వ్యక్తి స్వయంగా హాజరై తన వివరాలు, నామినీ వివారలు అందించి ధరఖాస్తుపై సంతకం చేయడం తప్పనిసరి అన్నారు. నవంబర్ 19 నుండి డిసెంబర్ 5 వరకు మొదటి విడత శిబిరాలు నిర్వహించి ప్రతి కుటుంబాన్ని సంప్రదించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 6 నుండి 15 వరకు రెండో విడతలో శిబిరాలకు హాజరు కాని కుటుంబాలు, తండాలు, పెండింగ్‌లో ఉన సవరణలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందన్నారు. ఈ పథకంత అత్యంత ప్రాముఖ్యత కలిగింది కావడంతో ప్రతి కుటుంబంలోని ఒకరు హాజరై నమోదు చేసుకోవాలని సూచించారు.

జనగామలో కొత్త పెన్షన్ ఫారాల పంపిణీ



ప్రజాపక్షం/జనగామ: అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందించాలని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జనగామ మండలంలోని చిటకోడూరు, జనగామ మున్సిపాల్టీలో పెన్షన్ మంజూరు ఉత్తర్వుల ఫారాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జనతామ మండలంలోని 21 గ్రామాలకు చెందిన ఐదు రకాల పెన్షన్ల కింద 781 మందికి కొత్తగా మంజూరు చేయడం జరిగిందన్నారు. అందులో 412 వంది వితంతువులు, 86 మంది ఒంటరి మహిళలు, 218 మంది దివ్యాంగులు ఉన్నారన్నారు. కుటుంబ జీవనోపాధి కోసం అప్పులు చేసి ట్రాక్టర్లు, ఇతర వాహనాలు కొనుగోలు చేసుకున్న పేదలకు పెన్షన్లు నిరాకరించినట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. టాక్టర్లు, కార్డు, అద్దెకు నడుపుతు కుటుంబాలను పోషించుకుంటున్నారన్నారు. బ్యాంక్ రుణాలు తీసుకొని జీవనోపాధి కొఓసం వాహనాలు కొనుగోలు చేసిన వారి పరిస్థితిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న ధరఖాస్తులతో పాటు వివిధ కారణాలతో తిరస్కరణకు గురైనా ధరఖాస్తులను కూడా పరిశీలించాలన్నారు. సిఎంఆర్ఎఫ్, ఎల్ఓసి, ఆర్‌బిఎస్ సేవలతో పాటు ఆరోగ్యం, విద్యా రంగాలలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో తన వంతు కృషి చేస్తానన్నారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



ప్రజాపక్షం/భూపాలపల్లి: విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ ప్రతిభ కనబరచాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని మంజూర్ నగర్ ఇల్లందు క్లబ్ లో జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి చిర్ర రఘు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జిల్లా స్థాయి యువజన ఉత్సవాలకు ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై ముందుగా స్వామి వివేకానంద చిత్రపటానికి పూలమాలవేసి, ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమంను ప్రారంభించారు. సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువును నిర్లక్ష్యం చేయకుండా క్రీడలు, సాంస్కృతిక రంగాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని పట్టుదలతో ముందుకు సాగాలని అన్నారు.గ్రామస్థాయి నుంచి మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలను దాటి జాతీయస్థాయిలో గుర్తింపు పొందేలా కృషి చేయాలని ఆకాంక్షించారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మి, లలిత, నరసింహారెడ్డి, శ్రీనివాస్, పాల్గొన్నారు.

రైతులకు ఉపయోగపడేలా మార్కెట్లలో సదుపాయాలు



మంత్రి పొన్నం ప్రభాకర్

ప్రజాపక్షం/ఎల్కతుర్తి : రైతులకు ఉపయోగపడేవిధంగా ప్రభుత్వం మార్కెట్లలో సదుపాయాలు, ఏర్పాట్లు చేస్తుంది. మంగళవారం హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ లో ఎల్కతుర్తి మండల నూతన వ్యవసాయ మార్కెట్ కార్యాలయ భవన నిర్మాణానికి మార్కెట్ కమిటీ చైర్మన్ సుకినే సంతాజీ తో కలిసి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ నియోజకవర్గంలోని హుస్నాబాద్, కోహెడ, సైదాపూర్, ఎల్కతుర్తి సహా నాలుగు మార్కెట్ యార్డులలో వివిధ రకాల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసినట్లు తెలిపారు. ఎల్కతుర్తి వ్యవసాయ మార్కెట్‌లో కోతుల బెడద ఉన్న దృష్ట్యా సోలార్ పెన్సింగ్ ఏర్పాటు చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ కోరగా ఈ విషయాన్నీ మంత్రి దృష్టికి తీసుకెళ్లిసోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు మార్కెట్ యార్డ్‌లో కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తక్కువ ధరకు, దళారులకు విక్రయించకుండా మార్కెట్ యార్డ్‌కు ధాన్యాన్ని తీసుకువచ్చి అమ్మినట్లయితే మద్దతు ధర లభిస్తుందన్నారు. సబ్ యార్డ్‌లు గ్రామాల్లో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సంకల్పంతో ఉందన్నారు. గ్రామాలలో అనువైన స్థలాలు ఉన్నట్టయితే సబ్ మార్కెట్ యార్డ్ ఏర్పాటు చేయడానికి గ్రామ సర్పంచులు, గ్రామ పెద్దలు సూచించాలని అన్నారు. సబ్ మార్కెట్ యార్డ్‌ల ఏర్పాటుతో రైతులకు ఇబ్బందులు తప్పుతాయని అన్నారు. ఎల్ నినో పరిస్థితులు ఉన్న నేపథ్యంలో రైతులు ఆదాయం ఉన్న ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కోరారు. రైతులకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, మార్కెట్ వైస్ చైర్మన్ స్రవంతి, లావణ్య, మేన శ్రీను, అనురాధ, విజయ్ కుమార్, రమేష్, విశాల సహకార సంఘం చైర్మన్ ఇంద్రసేనా రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ బాలికల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్: హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్‌ను మంగళవారం రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థినుల సంఖ్య, ఉపాధ్యాయుల హాజరు తదితర అంశాలను పరిశీలించారు. విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ప్రతి విద్యార్థిని బేసిక్ ఇంగ్లీష్‌లో మాట్లాడేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.ఇంటర్మీడియట్ విద్యార్థినులతో మంత్రి నేరుగా మాట్లాడి వారికి ప్రతిరోజూ నాణ్యమైన భోజనం, అల్పాహారం అందుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం మెస్ ఛార్జీలు, కాస్మోటిక్ ఛార్జీలు పెంచిన తర్వాత తమకు నాణ్యమైన భోజనంతో పాటు అన్ని రకాల సౌకర్యాలు అందుతున్నాయని విద్యార్థినులు మంత్రికి తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తుకు నాణ్యమైన విద్య, మంచి వసతులు ఎంతో కీలకం. ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అన్ని రకాల సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తుందని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, డి ఆర్ డి ఓ మేన శ్రీను, ఎంపీడీవో విజయ్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు..

చిత్తడి నేలల సర్వే వేగవంతం

వారం రోజుల్లో నివేదికలు సమర్పించాలి: కలెక్టర్ హేమంత్ బోర్కడే



ప్రజాపక్షం/ములుగు: జిల్లాలో గుర్తించిన చిత్తడి నేలలకు సంబంధించిన చెరువులు సర్వే, హద్దుల నిర్ధారణ ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత కలెక్టరేట్‌లోని జిల్లా అటవీ అధికారి వికాస్ మీనాతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువుల పూర్తి స్థాయి నీటి మట్టం(ఎఫ్‌ఆర్ ఎల్), గరిష్ట వరద నీటిమట్టాన్ని పరిగణలోకి తీసుకొని హద్దులు నిర్ధారించాలని సూచించారు. రెవెన్యూ, అటవీ, నీటి పారుదల శాఖల అధికారులు సమన్వయంతో సంయుక్త సర్వే చేపట్టి సరిహద్దు గుర్తులు ఏర్పాటు చేయాలన్నారు. వారం రోజుల్లో సాధ్యమైనన్ని చెరువుల సర్వే పూర్తి చేసి నివేదికలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో కృష్ణవేణి, అప్పలనాయుడు, నారాయణ, అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

487 మందికి నూతన చేయూత పింఛన్లు మంజూరు



నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం: మంత్రి సీతక్క

ప్రజాపక్షం/గోవిందరావుపేట: నిరుపేదలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు మహిళలు స్వయం సమృద్ధి సాధించేలా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు మంగళవారం గోవిందరావుపేట మండల కేంద్రంలోని ఆర్యవైశ్య సంఘం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన నూతన చేయూత ఫించన్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమంలో మంత్రి అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. గోవిందరావుపేట మండలంలోని 18 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 487 మందికి నూతన చేయూత పించన్లు మంజూరయ్యాయి అని బాలాజీనగర్‌లో 7 గురికి, బుస్సాపూర్‌లో 18 మందికి, చల్వాయి లో 71 మందికి,గాంధీనగర్‌లో 16 మందికి, గోవిందరావుపేటలో 77 మందికి, కర్లపల్లిలో14 మందికి, కోటగడ్డలో 7 గురికి, లక్ష్మవరంలో 28 మందికి, లక్ష్మీపూర్‌లో 19 మందికి, మచ్చాపూర్‌లో 19 మందికి, మోట్లగూడెంలో 10 మందికి, ముత్తాపూర్‌లో 4 గురికి, పాపయ్యపల్లి లో 2 ఇద్దరికి, పసరలో 148 మందికి, రాఘవపట్నంలో 21 మందికి, రాంనగర్‌లో 13 మందికి, రంగాపూర్‌లో 3, సోములగడ్డలో 10 మందికి నూతన చేయూత పించన్లు మంజూరయ్యాయి మరో 10 దరఖాస్తులు ఆమోద ప్రక్రియలో ఉన్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ చంద్రశేఖర్ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి ఆత్మ కమిటీ రవీందర్ రెడ్డి స్థానిక సర్పంచులు ప్రజాప్రతినిధులు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చల్వాయిలో రూ.3.19కోట్లతో విద్యుత్ ఉప-కేంద్రానికి శంకుస్థాపన: రైతులకు గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మంత్రి సీతక్క అన్నారు చల్వాయి లో రూ.3.19 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రానికి మంత్రి సీతక్క భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్పీడీసీఎల్ ఈ భిక్షపతి , మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, విద్యుత్ శాఖ , అధికారులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్లు

ఎంపి డాక్టర్ కడియం కావ్య



ప్రజాపక్షం/భూపాలపల్లి: అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. మంగళవారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రం లోని అంబేద్కర్ భవన్లో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మలతో కలిసి భూపాలపల్లి అర్బన్, రూరల్ మండలాలకు సంబంధించిన ప్రభుత్వ నూతన చేయూత పెన్షన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కడియం కావ్య మాట్లాడుతూ, గతంలో 40 లక్షల మందికి పెన్షన్లు అందించగా, కాంగ్రెస్ ప్రభుత్వం మరో నాలుగున్నర లక్షల కొత్త పెన్షన్లు మంజూరు చేసిందని తెలిపారు.వితంతువులు, ఒంటరి మహిళలు, గీత, నేత కార్మికులు, దివ్యాంగులకు చేయూత పథకం ద్వారా అండగా నిలుస్తున్నామని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు విడతల్లో సుమారు 8 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి, రూ.40 వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు. మహిళలకు ఇళ్ల యాజమాన్య హక్కులు కల్పిస్తూ వారి ఆత్మగౌరవానికి ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకున్నప్పటికీ పెన్షన్లు ఎందుకు మంజూరు కాలేదో తెలుసుకుని న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, కొమురయ్య గౌడ్, శ్రీనివాస్, ఉదయ్ కుమార్, బాలకృష్ణ, లక్ష్మీరాజయ్య, కిషన్ కురిమిళ్ళ శ్రీనివాస్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పిబి విజ్ఞాన కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్



ప్రజాపక్షం/భీమదేవరపల్లి:భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పీవీ నరసింహారావు జన్మస్థలమైన వంగర గ్రామంలో నిర్మిస్తున్న పీవీ విజ్ఞాన కేంద్రాన్ని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ సందర్శించి పనుల పురోగతిని పరిశీలించారు. విజ్ఞాన కేంద్రంలోని వివిధ విభాగాలు, ఏర్పాటు చేస్తున్న సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్, మిగిలి ఉన్న పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాన్ని ఆకర్షణీయంగా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో తీర్చిదిద్దాలని సూచించారు. పీవీ జీవిత చరిత్ర, రాజకీయ ప్రస్థానం, ఆర్థిక సంస్కరణల్లో ఆయన పాత్ర, సాహిత్య రంగంలో సాధించిన విజయాలను భావితరాలకు తెలియజేసేలా కేంద్రాన్ని అభివృద్ధి చేయాలన్నారు. ఫొటో గ్యాలరీ, మ్యూజియం, ఆర్ట్ గ్యాలరీ ద్వారా పీవీకి సంబంధించిన అరుదైన ఛాయాచిత్రాలు, జ్ఞాపకాలను సందర్శకులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వంగరకు జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చేలా ఈ కేంద్రాన్ని ముఖ్యమైన పర్యాటక ఆకర్షణగా తీర్చిదిద్దాలని దిశానిర్దేశం చేశారు. వచ్చే నెలలో ప్రారంభోత్సవం జరిగేలా మిగిలిన పనులను సమయంలో పూర్తి చేయాలని, నాణ్యతలో రాజీ పడవద్దని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ గజ్జెల సృజన రమేష్, అజిత్ రెడ్డి, తహసీల్దార్ రాజేష్, వీరేశం తదితరులు పాల్గొన్నారు.

రూ.100 కోట్లతో గూడూరు అభివృద్ధికి మహర్దశ

రహదారుల హై లెవల్ బ్రిడ్జిలు ఫోర్ లేన్ రోడ్లుకు శంకుస్థాపన

రూ.200 కోట్ల ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను పరిశీలించిన ఎంపి నరేందర్ రెడ్డి



ప్రజాపక్షం/గూడూరు: గూడూరు మండల కేంద్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకు సీఎం ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ తీసుకొని అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారని రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి అన్నారు.మంగళవారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో సుమారు రూ.100 కోట్లతో చేట్టనున్న వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఇప్పటికే నిర్మాణ పనులు ప్రారంభమైన రూ 200 కోట్ల ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడూరు ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతోందని తెలిపారు. గూడూరునెక్కొండ ప్రదాన రహదారి అభివృద్ధికి రూ.30కోట్లతో 93లక్షలు గూడూరు నుండి కేసముద్రం రహదారి నిర్మాణానికి రూ 38 కోట్ల కేటాయించినట్లు వెల్లడించారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రహదారి వెడల్పును పది మీటర్లకు పెంచేలా చర్యలు తీసుకున్నామన్నారు. అదేవిధంగా వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు కలిగిస్తున్న లోలెవల్ బ్రిడ్జి స్థానంలో సుమారు 18 మీటర్ల వెడల్పుతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గూడూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సుమారు 1.2 కిలోమీటర్లు మేర ఫోర్ లేన్ రహదారి నిర్మాణం గూడూరు జంక్షన్ అభివృద్ధి సెంట్రల్ లైటింగ్ ఉర్పాటు వంటి పనులకు ప్రాధాన్యతనిస్తున్నామని పేర్కోన్నారు. ఈ అభివృద్ధి పనులు పూర్తయితే గూడూరు పట్టణ నూపురేఖలు మారడంతో పాటు రవాణా వ్యాపార రంగాలు మరింత అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే బొద్దుగొండ గ్రామంలో రూ. 200 కోట్లతో ఇంటిగ్రెటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయని మంగళవారం వాటిని పరిశీలించినట్లు తెలిపారు.

మండల కేంద్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే డాక్టర్ మురళీ నాయక్: మానుకోట ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే గూడూరు మండలం అన్ని రంగాల్లో వెనుకబడిందని మిమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం గూడూరు మండలంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఆయన అన్నారు. ఇందిరమ్మ రాజ్యస్థాపన లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షమం అభివృద్ధి కోసం కృషి చేస్తోందని అన్నారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ అధ్యక్షురాలు భూక్య ఉమా మురళినాయక్ రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు నూనవత్ రాధా రమేష్ చంద్రర్‌రెడ్డి కత్తి స్వామి ఎల్ల నరేష్‌రెడ్డి దారవత్ బాలజీ నాయక్ ఉపసర్పంచ్ చంటి స్వామి అయిబోయిన సమ్మక్క నాయకులు పాల్గోన్నారు.

గూడూరు అభివృద్ధికి కాంగ్రెస్ ప్రత్యేక ప్రాధాన్యత :ఎంపి బలరాం నాయక్: మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రాన్ని అభివృద్ధి చేసి పరిసర ప్రాంతాలకు అనువైన కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని ఎంపి బలరాం నాయక్ అన్నారు. గూడూరు కేంద్రంలో ఆధునిక జంక్షన్ ఉర్పాటు బస్టాండ్ అభివృద్ధి సెంటర్ లైటింగ్ పరిసర గ్రామాలకు వెళ్లే రహదారులు మెరుగుదలతో పాటు ఫోర్ వే రహదారుల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు విద్య వైద్యం రవాణా బ్యాంకింగ్ వంటి అన్ని సదుపాయాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గిరిజన విద్యార్థుల కోసం సుమారు రూ 200 కోట్లతో ఇంటిగ్రెటెడ్ స్కూల్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం



ప్రజాపక్షం/వరంగల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మాజీ మంత్రి, వరంగల్ తూర్పు ఎమ్మెల్యే కొండా సురేఖ అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రజా ప్రభుత్వం పేదలు, దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలు, వివిధ వృత్తులపై ఆధారపడిన వారికి ఆర్థిక భరోసా కల్పిస్తూ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని పేర్కొన్నారు. మంగళవారం వరంగల్‌లోని ఎల్ బినగర్‌లోని ఏ1 కన్వెన్షన్ హాల్ లో ఏర్పాటు చేసిన లబ్ధిదారులకు చేయూత పెన్షన్ ధ్రువ పత్రాల అందజేత కార్యక్రమానికి కొండా సురేఖ ముఖ్య అతిథిగా హాజరై కుడా చైర్ పర్సన్ గుండు సుధారాణి,జిల్లా గ్రంధాలయ చైర్మన్ మీసాల ప్రకాష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, బల్దియా కమిషనర్ వెంకన్న లతో కలిసి పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే నిరుపేద కుటుంబాలకు పెన్షన్లు ఎంతో ఆసరాగా నిలుస్తున్నాయని, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు ఆత్మగౌరవంతో జీవించేందుకు ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తోందని తెలిపారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో కొత్త పెన్షన్ల కోసం మొత్తం 3,675 దరఖాస్తులు అందగా, వివిధ కేటగిరీలకు చెందిన 2,740 మందికి ప్రభుత్వం కొత్తగా చేయూత పెన్షన్లు మంజూరు చేసిందని వెల్లడించారు. వీటి ద్వారా నెలకు రూ.69,89,840 మేర లబ్ధిదారులకు ఆర్థిక సహాయం అందనుందని తెలిపారు. కొత్తగా మంజూరైన పెన్షన్లలో 733 దివ్యాంగులు, 1,704 వితంతువులు, 166 వివాహిత ఒంటరి మహిళలు, 22 అవివాహిత ఒంటరి మహిళలు, 98 నేత కార్మికులు, 17 తాటి గీత కార్మికులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వైవి. గణేష్, సమ్మయ్య, ప్రసన్న రాణ

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
బుధవారం
18-11-2026
www.prajapaksham.in

నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'మైసా'పై రోజురోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిలిమ్స్ ఈ సినిమాను భారీ స్థాయిలో, హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తోంది.



'ఆకాశంలో ఒక తార' హీరోయిన్ రుహానీ శర్మ

'ఏనాటి వరమో నువ్వు' పాట రిలీజ్



నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తున్న పాన్ ఇండియా సినిమా 'మైసా'పై రోజు రోజుకీ అంచనాలు పెరుగుతున్నాయి. రవీంద్ర పుల్లె దర్శకత్వంలో అన్‌ఫార్ములా ఫిలిమ్స్ ఈ సినిమాను భారీ స్థాయిలో, హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మిస్తోంది. ఇప్పటికే విడుదలైన ఫస్ట్ గ్లింప్స్, టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. ఫస్ట్ సింగిల్ 'ఓ మైసారే'లో రష్మిక చాలా పవర్‌ఫుల్, ఫెరోషియస్ అవతార్‌లో కనిపించి తన పాత్ర ఎలా ఉండబోతుందో చూపించారు. మొదటి పాటలోని హై ఎనర్జీ, యాక్షన్ మూడ్‌కు భిన్నంగా ఇప్పుడు మేకర్స్ రెండో పాట 'ఏనాటి వరమో నువ్వు'ను రిలీజ్ చేశారు. చక్కని మెలోడీతో పాటు భావోద్వేగాలతో ఈ పాట వినేవారిని ఆకట్టుకుంటోంది. జేక్స్ బిజోయ్ ఈ పాటకు మంచి మెలోడీని అందించారు. వినసొంపైన ట్యూన్‌తో పాటు భావోద్వేగాలు కలిసేలా కంపోజ్ చేశారు. కృష్ణ తేజస్వి తన వాయిస్‌తో పాటకు మరింత అందాన్ని తీసుకొచ్చారు. పాటలోని ఆప్యాయత, అమాయకత్వం, భావోద్వేగాలు వినేవారిని వెంటనే కనెక్ట్ చేస్తాయి. రష్మిక తల్లిదండ్రుల పాత్రల్లో సముద్రఖని, ఈశ్వరీ రావు నటించారు. ఈ భావోద్వేగ సన్నివేశాలకు వీరిద్దరి నటన మరింత సహజత్వాన్ని తీసుకొచ్చింది. మొదటి పాటలో పరిచయం చేసిన యాక్షన్ ప్రపంచానికి భిన్నంగా, 'ఏనాటి వరమో నువ్వు' పాట తండ్రి, కూతుళ్ల మధ్య ఉండే అనుబంధం ద్వారా కథలోని ఎమోషనల్ బేస్‌ను పరిచయం చేస్తుంది.ఈ సినిమాకు శ్రేయాస్ పి. కృష్ణ సినిమాటోగ్రఫీ అందిస్తుండగా, జేక్స్ బిజోయ్ సంగీతం సమకూరుస్తున్నారు. ఇంటర్నేషనల్ యాక్షన్ కొరియోగ్రాఫర్ కేచా ఈ సినిమాలో స్టంట్స్‌ను పర్యవేక్షిస్తున్నారు. 'మైసా' 27న తెలుగు, హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఒకేసారి థియేటర్లలో రిలీజ్ కానుంది.

'ఓం' సాధారణమైనది కాదు

ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మమ్ముట్టి



ధనుష్, మమ్ముట్టి, సాయి పల్లవి, శ్రీలీల ప్రధాన పాత్రల్లో రాజ్ కుమార్ పెరియసామి తెరకెక్కించిన చిత్రం 'ఓం ఛాప్టర్ 1 – రుధిరం: ది బ్లడ్' ఈ మూవీని రెండు తెలుగు రాష్ట్రాల్లో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ నవంబర్ 20న గ్రాండ్‌గా రిలీజ్ చేయబోతోంది. ఈ క్రమంలో ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మమ్ముట్టి మాట్లాడుతూ ఈ సినిమా నాకు చాలా ప్రత్యేకమైనది. మొదట ఆరోగ్యం సహకరించకపోవడంతో షూటింగ్ కొంతకాలం వాయిదా వేయాలని దర్శకుడిని కోరాను. అందుకు ఆయన అంగీకరించారు. ఈ సినిమా కోసం దర్శకుడు, ధనుష్, రేణు దేశాయ్, సాయి పల్లవితో పాటు సాంకేతిక బృందం ప్రతి ఒక్కరూ ఎంతో కష్టపడ్డారు. రేణు దేశాయ్, ధనుష్‌లతో కలిసి ఎక్కువ సన్నివేశాల్లో నటించాను. సాయి పల్లవిలోని అద్భుతమైన ఎనర్జీ నాకూ ఉత్సాహాన్నిచ్చింది. వీళ్లందరితో కలిసి పనిచేయడం చాలా సరదాగా అనిపించింది. ఈ సినిమా సాధారణమైనది కాదు. అన్ని రకాల అంశాలు ఇందులో ఉంటాయి. ప్రేక్షకులందరికీ ఈ సినిమా నచ్చుతుందని ఆశిస్తున్నాను. నవంబర్ 20న థియేటర్లకు వచ్చి మా సినిమాను ఆదరించండి. అందరికీ ధన్యవాదాలు' అని అన్నారు. ధనుష్ మాట్లాడుతూ ''ఓం' సినిమాలో చాలా పాత్రలు తెలుగులోనే మాట్లాడతాయి. దాదాపుగా ఇది ద్విభాషా చిత్రం. తిరుపతి, తిరుమల, తిరువణ్ణామలై వంటి రెండు పుణ్యక్షేత్రాల నేపథ్యంలో సాగే ఈ కథలో తెరపై కనిపించే అంశాల కంటే చాలా లోతైన భావాలు దాగి ఉన్నాయి. ఇలాంటి అద్భుతమైన కథను తెరపైకి తీసుకురావడంలో దర్శకుడు రాజ్‌కుమార్ ప్రతిభ ఎంతో ఉంది. ప్రతి పాత్రకు తగిన ప్రాధాన్యత, స్క్రీన్ టైమ్ ఇచ్చి అద్భుతంగా తెరకెక్కించారు. సాయిపల్లవి మాట్లాడుతూ ఈ సినిమాలో నేను తొలిసారి ఐపిఎస్ అధికారిణి పాత్రలో నటించాను. మన రోజువారీ జీవితం ప్రశాంతంగా సాగడానికి పోలీసులు ఎంతో హెల్ప్ చేస్తారు. మన భద్రత కోసం వాళ్లు ఎన్నో త్యాగాలు చేస్తుంటారు. శ్రీలీల , రేణు దేశాయ్ , లిరిసిస్ట్ కాసర్ల శ్యామ్ పాల్గొన్నారు.

'ఆకాశంలో ఒక తార' కథకు నేను 'పర్సనల్'గా కనెక్ట్ అయ్యా

'ఆకాశంలో ఒక తార' సినిమా కథకు తాను పర్సనల్‌గా బాగా కనెక్ట్ అయ్యానని హీరోయిన్ రుహానీ శర్మ చెప్పారు. ఈ చిత్రంలో ఆమె బిజిలీ అనే పాత్రలో నటిస్తున్నారు. దుల్కర్ సల్మాన్, సాత్విక వీరపల్లి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ చిత్రాన్ని లైట్‌బాక్స్ మీడియా ఆధ్వర్యంలో సందీప్ గుణ్ణం, రమ్య గుణ్ణం నిర్మించగా, స్వప్న సినిమా, గీతా ఆర్ట్స్ సమర్పిస్తున్నారు. ఈ నెల 20 ఆకాశంలో ఒకతార సినిమా రిలీజ్ కాబోతోంది. ఈ సందర్భంగా ఆమె తన పాత్ర గురించి చెప్పుకొచ్చారు. ఆకాశంలో ఒక తార సినిమా కథకు నేను పర్సనల్ గా బాగా కనెక్ట్ అయ్యాను. ఈ కథలో అమ్మాయిలాగే నేను కూడా హిమాచల్ ప్రదేశ్ లోని ఒక ఊరి నుంచి వచ్చాను. నేను హీరోయిన్‌గా మారి ఇలాంటి వేదిక మీద నిలబడి మాట్లాడతానని ఎవరైనా అప్పుడు చెప్పి ఉంటే నమ్మేదాన్ని కాదు. పరిస్థితుల కారణంగా మన కలల్ని చిన్నవి చేసుకోకూడదు. ఈ చిత్రంలో బిజిలీ అనే పాత్రలో నటిస్తున్నాను. ఈ క్యారెక్టర్‌ను చాలా ఇష్టపడి చేశాను. క్యారెక్టర్ నిడివి ఎంత ఉంది అనేకంటే ఆ పాత్ర కథలో ఎంత కీలకంగా ఉందనేది చూసుకుంటాను. అందుకే ఈ రోల్ చేశాను. మీరంతా మా మూవీని, నా పర్ ఫార్మెన్స్‌ను ఇష్టపడతారని నమ్ముతున్నాను అన్నారు.

'రాజిగాడు రాజయ్యాడు' ఫస్ట్ లుక్ పోస్టర్



'బట్టల రామస్వామి బయోపిక్కు' సినిమా ద్వారా తెలుగు ఆడియెన్స్‌లో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు హీరో అల్తాఫ్ హసన్. ఆయన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహిస్తూ 'రాజిగాడు రాజయ్యాడు' అనే కొత్త చిత్రాన్ని మన ముందుకు తీసుకొస్తున్నారు. ఈ సినిమాను శర్మాస్ ఫిలింస్ బ్యానర్ పై బత్తుల పర్వీన్, మనోజ్ అర్రోల, చిన్ని నిర్మిస్తున్నారు. 'రాజిగాడు రాజయ్యాడు' మూవీలో అనుశ్రీ హీరోయిన్ గా నటిస్తుండగా, ప్రముఖ కవి, గాయకుడు డా. గోరటి వెంకన్న కీలక పాత్రలో నటిస్తున్నారు. 'రాజిగాడు రాజయ్యాడు' సినిమా టైటిల్, ఫస్ట్ లుక్ పోస్టర్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ ఎలా ఉందో చూస్తే ఒక గడీ బయట ఒంటిపై గాయాలతో ఒక పంది పిల్లను చేతిలో పట్టుకుని కుర్చీలో హీరో కూర్చుని ఉండటం ఆసక్తి కలిగిస్తోంది. ఆ పెద్ద గడీ లోని వారికి హీరోకు ఉన్న సంబంధం ఏంటి ?, పంది పిల్లను ఆయన ఎందుకు చేతిలో పట్టుకుని ఉన్నారు ?, ఆయన ఒంటిపై గాయాలకు, గొడవలకు కారణం ఏంటి ? వంటి అంశాలతో ఈ ఫస్ట్ లుక్ పోస్టర్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. అల్తాఫ్ హసన్, అను శ్రీ, డా. గోరటి వెంకన్న, గీతా అగర్వాల్, రాజేంద్ర మోహన్ నను, శ్రీవర్ధన్ త్రివేది, సుజాత దీక్షిత్, గోవర్ధన్ రెడ్డి, సంజయ్ గౌడ్ డా. శివకుమార్ కాముని, తదితరులు నటిస్తున్నారు.

150 మిలియన్ డాలర్లు దాటిన

'అవెంజర్స్: డూమ్స్‌డే' బుకింగ్స్



మార్వెల్ స్టూడియోస్ ప్రతిష్టాత్మక చిత్రం 'అవెంజర్స్: డూమ్స్‌డే'. ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్న నేపథ్యంలో, భారత్‌లో కూడా అడ్వాన్స్ బుకింగ్స్ అధికారికంగా ప్రారంభమయ్యాయి. సోషల్ మీడియాలో అభిమానులు చేపట్టిన ప్రచారానికి స్పందించిన మార్వెల్ సంస్థ టికెట్ బుకింగ్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. బుకింగ్స్ ప్రారంభమైన కొద్ది సమయంలోనే ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోంది. ముంబై, బెంగళూరు, ఢిల్లీ, హైదరాబాద్, కొచ్చి వంటి ప్రధాన నగరాల్లో టికెట్లు వేగంగా అమ్ముడవుతున్నాయి. అడ్వాన్స్ టికెట్ అమ్మకాలు ప్రపంచవ్యాప్తంగా 150 మిలియన్ డాలర్లను దాటినట్లు సమాచారం. ఇక ఈ సినిమా విడుదలైన తొలి ట్రైలర్ కేవలం 24 గంటల్లోనే 503 మిలియన్ల వ్యూస్ సాధించి, ప్రపంచ సినిమా చరిత్రలో అత్యధిక వ్యూస్ సాధించిన ట్రైలర్లలో రెండో స్థానంలో నిలిచింది. డిసెంబర్ 17న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఈ చిత్రం విడుదల కానుంది. ఇంగ్లీష్, హిందీ, తమిళం, తెలుగు భాషల్లో మార్వెల్ స్టూడియోస్ ప్రెజెంట్స్ ఇన్ఫినిటీ విజన్‌తో పాటు ఇతర ప్రీమియం ఫార్మాట్లలో ఈ చిత్రం ప్రేక్షకులను అలరించనుంది.




సుమన్‌కు 'కత్తి కాంతారావు జాతీయ పురస్కారం'

తెలుగు ఫిలిం టెలివిజన్ వెల్ఫేర్ పోరం 'మరియు భారత్ కల్చరల్ అకాడమీ సంయుక్తంగా, ప్రతి సంవత్సరం కళా ప్రపూర్ణ కత్తి కాంతారావు జన్మదినోత్సవాన్ని పునస్కరించుకుని గత 24 సంవత్సరాలుగా పలువురు సినీ ప్రముఖులను సన్మానిస్తూ కత్తి కాంతారావు పేరున జాతీయ పురస్కారాలను అందిస్తున్నది. కాగా 2026 జాతీయ పురస్కారానికి గాను ఎంపికయ్యారు నటుడు హీరో సుమన్. దాదాపు 300కు పైగా తెలుగు ..తమిళ, మళయాళ, కన్నడ చిత్రాలలో నటించి, పౌరాణిక పాత్రలైన శ్రీవేంకటేశ్వర స్వామి గా.. శ్రీ రాముడిగా శ్రీకృష్ణుడిగా, యంగ్ అండ్ డైనమిక్ పోలీస్ ఆఫీసర్‌గా, యాక్షన్ చిత్రాల హీరో గా, కరాటే యోధుడు అయిన సుమన్ అనేక పాత్రలలో నటించి ప్రేక్షకుల హృదయాలలో గొప్ప స్థానం సంపాదించుకున్నసుమన్. ఈ అవార్డు కమిటి చైర్మన్ కెవి. రమణా చారి, సి.పార్థసారథి. నాగబాల డి. సురేష్ కుమార్ కో చైర్మన్స్‌గా వ్యవహరించారు. మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలాచారి, నటుడు బాబుమోహన్, తదితరులు పాల్గొన్నారు. తల్వార్ అంటే తెలుసు కదా 'కత్తి' ఇది యద్రుచికంగా కాంతారావు జాతీయ అవార్డ్ నాకు ఇవ్వడం సంతోషంగా ఉంది. నేను చిత్ర పరిశ్రమకు వచ్చి 48 ఏళ్లవుతోంది. దాదాపు వెయ్యి చిత్రాల్లో నటించాను.నన్ను ఇన్నేళ్లుగా అభిమానిస్తూ వస్తున్న ప్రతి ఒక్కరికీ ఈ పురస్కారం ఘనత దక్కుతుంది అన్నారు.

కోటి కుటుంబాలకు 'ఇందిరమ్మ బీమా'

అన్ని ప్రభుత్వ బీమా పథకాలు
ఒకే గొడుగు కిందకు
19న సిద్దిపేట సభలో దరఖాస్తు ప్రారంభం
అర్హులైన మహిళలందరికీ
ఇందిరమ్మ చీరలు
ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి



ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్ : రాష్ట్రంలోని కోటి కుటుంబాలకు బీమా భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం 'ఇందిరమ్మ బీమా' పథకాన్ని అమలు చేయనుంది. ప్రస్తుతం వివిధ శాఖల పరిధిలో అమలవుతున్న అన్ని బీమా పథకాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ బీమా దరఖాస్తు ప్రక్రియను ఈ నెల 19న సిద్దిపేటలో నిర్వహించే బహిరంగ సభలో సిఎం ప్రారంభించనున్నారు. ఇందిరమ్మ బీమా, ఇందిరమ్మ చీరల పంపిణీపై జూబ్లీ హిల్స్‌లోని తన నివాసంలో ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని ప్రతి అర్హ కుటుంబానికి బీమా రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఇందిరమ్మ బీమా కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా సౌకర్యం అందించనున్నట్లు తెలిపారు.

ఏ ఒక్కరినీ తప్పించొద్దు

ప్రస్తుతం వివిధ శాఖల ద్వారా అమలవుతున్న బీమా పథకాల వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. కొన్ని పథకాల కింద జీవిత బీమాగా రూ.2 లక్షలు, ప్రమాద బీమాగా రూ.10 లక్షల వరకు అందుతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికే ప్రభుత్వ బీమా భద్రత పొందుతున్న వారిలో ఏ ఒక్కరినీ మినహాయించకుండా అందరికీ ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కొన్ని శాఖల్లో అమలవుతున్న రూ.2 లక్షల జీవిత బీమాను ఇందిరమ్మ బీమా పరిధిలోకి తీసుకువచ్చి రూ.5 లక్షలకు పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రమాద బీమా ప్రయోజనాలు కూడా యథాతథంగా కొనసాగేలా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీలతో పాటు రాష్ట్రంలోని లక్షలాది మంది పేద కుటుంబాలకు ఈ పథకం అండగా నిలుస్తుందన్నారు.

ఇందిరమ్మ చీరల పంపిణికి శ్రీకారం

సిద్దిపేట బహిరంగ సభ వేదికగా ఇందిరమ్మ చీరల పంపిణి కార్యక్రమాన్ని కూడా ముఖ్యమంత్రి ప్రారంభించనున్నారు. రాష్ట్రంలోని అర్హులైన ప్రతి మహిళకు ఇందిరమ్మ చీర అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. చీరలను వెంటనే అన్ని జిల్లాలకు తరలించాలని సూచించారు. పంపిణి కార్యక్రమంలో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి హెచ్చరించారు. ఈ కార్యక్రమంపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుకు సూచించారు.

గ్రామస్థాయి వరకు ప్రచారం

ఇందిరమ్మ బీమా పథకంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. దరఖాస్తులను గ్రామస్థాయిలో అందుబాటులో ఉంచాలని, జిల్లా కలెక్టర్లు ప్రజలకు వివరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో సిఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సిఎంఓ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, సిఎంఓ కార్యదర్శి మానిక్ రాజ్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, సిఎం ఓఎస్‌డి వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యూనివర్సిటీల్లో మరో 150

అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీ..

త్వరలోనే ఉత్తర్వులు...?..
నియామకాల అంశంపైన యూనివర్సిటీ విసిలతో
సమావేశమైన ఉన్నత విద్యా మండలి..

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో /హైదరాబాద్: యూనివర్సిటీల్లో అదనంగా మరో 150 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేయనుంది. ఇప్పటికే 7 విశ్వవిద్యాలయాల్లో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ అనుమతించగా, యూనివర్సిటీల్లో బ్యాక్లాగ్ పోస్టులతోపాటు మరో 2 యూనివర్సిటీల్లో కలిపి 150 పోస్టులను భర్తీ చేయనున్నట్లు తెలిసింది. ఇందులో యూనివర్సిటీల్లో 97 బ్యాక్‌లాగ్ పోస్టులు, తెలంగాణ, మహాత్మాగాంధీ యూనివర్సిటీల్లో 53 పోస్టులలు ఉన్నాయి. దీనికి సంబంధించిన ఒకటి,రెండు రోజుల్లో ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేయనున్నట్టు సమాచారం. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి రాష్ట్రంలోని 13 యూనివర్సిటీల విసిలతో మంగళవారం సమావేశం నిర్వహించింది.ఈ సమావేశంలో అధ్యాపకుల నియామకాలకు సంబంధించిన అంశంపైన చర్చించారు. రాష్ట్రంలోని ఏడు యూనివర్సిటీల్లో 429 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసేందుకు ఇటీవల ఆర్థిక శాఖ ఉత్తర్వులు జారీ చేయడంతో పాటు అదనంగా 97 బ్యాక్లాగ్ పోస్టులను భర్తీ చేయడానికి ఆమోదం తెలిపింది. రాష్ట్రంలోని యూనివర్సిటీలో ఇంజనీరింగ్ కాలేజీల నిమ్మితం 37 పోస్టులను గతంలోనే మంజూరు చేసిన విషయం తెలిసిందే. మహాత్మాగాంధీ యూనివర్సిటీలో ఫార్మసీ, లా డిపార్ట్‌మెంట్‌తో కలిపి 16 పోస్టులను మంజూరు చేశారు. వాటికి అనుమతించాలని కోరుతూ యూనివర్సిటీలు ఇప్పటికే ఈసీల్లో నిర్ణయం తీసుకొని ప్రభుత్వానికి లేఖ రాశారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో నాలుగు పోస్టులను భర్తీ చేసేందుకు అనుమతి కావాలని యూనివర్సిటీ ప్రభుత్వాన్ని కోరింది.జెఎన్‌టియులో 100 నుంచి 120 పోస్టుల భర్తీకి అనుమతించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసింది. అయితే యూనివర్సిటీ యూనిట్‌గా నియామకాలను చేపట్టేందుకు యూనివర్సిటీలు రోస్టర్ పాయింట్లను ప్రభుత్వానికి సమర్పించాయి. 12 యూనివర్సిటీలు విద్యశాఖ పరిధిలో కొనసాగుతుండగా. అగ్రికల్చర్, హార్టీ కల్చర్, వెటర్నరీ యూనివర్సిటీల్లో కూడా యూనివర్సిటీ యూనిట్‌గానే రోస్టర్ పాయింట్లను కొనసాగించేందుకు ఆర్డినెన్స్‌ను జారీ చేసే అవకాశం ఉన్నది.



మనుగడే ముఖ్యం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తిచేశామని, రానున్న మూడేళ్లలో మరో రెండు లక్షల ఇళ్లు నిర్మిస్తామని చెప్పారు. చెన్నూరు నియోజకవర్గంలో రూ.800 కోట్లతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం కొనసాగుతోందని మంత్రి వెల్లడించారు. రూ.100 కోట్లతో అమృత్ పథకం తాగునీటి పనులు, రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం జరుగుతోందన్నారు. చెన్నూరులో 100 పడకల ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధంగా ఉండగా, మందమర్రిలో 50 పడకల ఆసుపత్రి నిర్మిస్తామని తెలిపారు. మందమర్రి ఏజెన్సీ ప్రాంతంలో 6 ఎకరాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మిస్తామన్నారు. ఆర్‌కె ఓపిలో కొత్త బొగ్గు గని ఏర్పాటుతో స్థానికులకు ఉపాధి పెరుగుతుందని చెప్పారు. గోదావరి పుష్కరాలకు రూ.70 కోట్లు, నియోజకవర్గంలో రోడ్లకు రూ.80 కోట్లు, బొక్కలగుట్ట, అందుగులపేట, సండ్రులపల్లె, పులిమడుగు గ్రామాల్లో కల్వర్టులకు నిధులు మంజూరయ్యాయని వివరించారు. రాష్ట్రంపై ఎల్‌నినో ప్రభావం దృష్ట్యా రైతులు ఆరుతడి పంటలు సాగు చేయాలని, నీరు, విద్యుత్‌ను పొదుపుగా వాడుకుంటూ కరువు పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ చంద్రయ్య, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చిరునామా

(మొదటి పేజీ తరువాయి)

అవకాశాలు ఏర్పడతాయని పేర్కొన్నారు.రంగారెడ్డి జిల్లా కొత్తూరులో జెఇహెచ్ ఏరోస్పేస్ సంస్థ ఏర్పాటు చేసిన 'టూలింగ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను మంగళవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'తెలంగాణ రైజింగ్–2047' విజన్‌లో భాగంగా రాష్ట్రాన్ని అడ్వాన్స్‌డ్ మాన్యుఫ్యాక్చరింగ్, ఏరోస్పేస్, రక్షణ, సాంకేతిక రంగాల్లో ప్రపంచస్థాయి పెట్టుబడులకు ప్రధాన గమ్యస్థానంగా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఏరోస్పేస్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పెట్టుబడులు పెట్టేలా సమగ్ర పారిశ్రామిక వ్యవస్థను ప్రణాళికాబద్ధంగా నిర్మిస్తున్నామన్నారు. విడిభాగాల తయారీతోపాటు డిజైన్, ఇంజినీరింగ్, ప్రెసిషన్ మాన్యుఫ్యాక్చరింగ్, పరీక్షా సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మంత్రి వివరించారు. ప్రపంచ స్థాయి సంస్థలు, దేశీయ పరిశ్రమలు, పరిశోధనా సంస్థలతో స్థానిక సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలను (ఎంఎస్ఎంఇ) అనుసంధానించడం ద్వారా వాటి ఉత్పత్తి సామర్థ్యాన్ని, సాంకేతిక నైపుణ్యాన్ని పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.విమానాల తయారీ, నిర్వహణలో వినియోగించే ప్రత్యేక టూల్స్, ఫిక్చర్లు, గేజ్‌ల కోసం ఇప్పటివరకు పరిశ్రమలు కొద్దిమంది ప్రత్యేక సరఫరాదారుల పైనే కాకుండా విదేశాలపైనా ఆధారపడాల్సి వచ్చేదని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోనే ఇలాంటి అత్యాధునిక టూలింగ్ సదుపాయాలు అందుబాటులోకి రావడం పారిశ్రామిక రంగానికి కీలక ముందడుగని అన్నారు. అంతర్జాతీయ ఏరోస్పేస్ సరఫరా వ్యవస్థలో 'మేడ్ ఇన్ తెలంగాణ' ఉత్పత్తులకు గుర్తింపు పెరగడానికి ఇటువంటి కేంద్రాలు దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ షాద్‌నగర్ ప్రాంతంలో మరిన్ని పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు తగిన ప్రోత్సాహం అందించడంతోపాటు ప్రభుత్వం అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జేహెచ్ ఏరోస్పేస్ సంస్థ ప్రతినిధులు విశాల్, వెంకటేష్, కొత్తూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎల్లారం శేఖర్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు జె.సుదర్శన్ గౌడ్, మాజీ ఎంపిపి శివశంకర్ గౌడ్, మాజీ మండల అధ్యక్షుడు హరినాథ్‌రెడ్డి, సింగిల్ విండో చైర్మెన్ అంబటి ప్రభాకర్, సాయిలు, కొర్ర రవి, ఆంజనేయులు పాల్గొన్నారు.

దుర్వినియోగం! (మొదటి పేజీ తరువాయి)

ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటిసి)ను క్లెయిమ్ చేసినట్లు జిఎస్‌టి అధికారులు వెల్లడించిన సమాచారంతో బాధిత సంస్థ పోలీసులను ఆశ్రయించింది. అంబటి రిసోర్స్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తరఫున దాని ప్రతినిధి అంబటి శ్రీనివాస్‌రెడ్డి (46) ఈ మేరకు ఫిర్యాదు చేశారు. ఐటి సేవలు, ఇతర నమోదిత కార్యకలాపాలు నిర్వహించే తమ సంస్థకు సంబంధం లేని రాగి, తుక్కు తదితర వస్తువుల క్రయవిక్రయాలు జరిగినట్లు జిఎస్‌టి అధికారుల ద్వారా తెలిసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు తమ సంస్థ జీఎస్టీ నంబర్, ఇతర నమోదు వివరాలను అక్రమంగా వినియోగించి నకిలీ ఇన్‌వాయిస్‌లు సృష్టించడం, అనధికారికంగా జిఎస్‌టి రిటర్నులు దాఖలు చేయడం ద్వారా అక్రమంగా ఐటీసీ పొందేందుకు ప్రయత్నించినట్లు అనుమానం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంలో తమ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని, సంబంధిత లావాదేవీలు తమ అనుమతి లేకుండానే జరిగినట్లు ఫిర్యాదుదారు స్పష్టం చేశారు. ఈ అక్రమ లావాదేవీల కారణంగా సంస్థపై పన్ను బకాయిలు, జరిమానాలు, న్యాయపరమైన చిక్కులు వచ్చే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అనుమానాస్పద జిఎస్‌టి లావాదేవీలకు సంబంధించి జిఎస్‌టి అధికారుల నుంచి లభించిన మొబైల్ నంబర్, ఈమెయిల్ వివరాలను పోలీసులకు అందజేశారు. వాటిని ఎవరు నిర్వహిస్తున్నారన్నది తమకు తెలియదని, దర్యాప్తులో తేల్చాలని కోరారు. జిఎస్‌టి రిటర్నులు, ఇన్‌వాయిస్‌లు, ఐటిసి క్లెయిమ్‌లను సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుని పరిశీలించాలని, అనుమానాస్పద మొబైల్ నంబర్, ఈమెయిల్ ఖాతాలతో పాటు ఇతర డిజిటల్ ఆధారాలను సేకరించి బాధ్యులను గుర్తించాలని ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సిసిఎస్ ఎస్ఐ వుప్పు సందీప్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను

వాయిదా వేయండి

సిఎం - మేధావుల బహిరంగ లేఖ

ప్రజాపక్షం న్యూస్‌బ్యూరో/హైదరాబాద్: తీవ్రమైన ఎల్‌నినో కరువు నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్'ను తక్షణమే వాయిదా వేయాలని నాలుగవందల మందికిపైగా పౌర సమాజ నాయకులు, మేధావులు రాష్ట్ర ప్రభుత్వాన్